# క్రాంతి

లోపలి పేజీల్లో....


ఎన్నికల బహిష్కరణ మూడు పార్టీల ప్రకటన ... 10
జాతులసమస్యపై సెమినార్..... 12
పాలకుర్తి హత్యాకాండ .... ..... 14
'హిందుత్వ' తీర్పు ... ..... 21
హవాలా కుంభకోణం .. ..... 23
దండకారణ్యంలో ప్రజాసంక్షేమ కార్యక్రమాలు . 28



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 19 సంచిక : 1 జనవరి - ఫిబ్రవరి 1996 వెల : రెండు రూపాయలు



## యావత్తు విప్లవ ప్రజానీకానికి ఉత్తేజాన్నందించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్)

# అఖిల భారత ప్రత్యేక మహాసభ





భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్) అఖిలభారత ప్రత్యేక మహాసభ **1995**, నవంబరు **15-30** మధ్య ఉత్తేజకరమైన విప్లవ వాతావరణంలో జరిగింది. కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వాన జరిగిన **8**వ కాంగ్రెస్ ఉజ్వల విప్లవ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, దేశంలో త్వరత్వరగా పెంపొందుతున్న విప్లవ పరిస్థితిలో నిజమైన విప్లవ శక్తులు చేయి చేయి కలిపి ముందుకు నడుస్తున్న దశలో జరిగిన ఈ ప్రత్యేక మహాసభ దేశవ్యాప్తంగా వున్న విప్లవాభిమానులకు ఒక గొప్ప శుభ సందర్భం, భారత విప్లవోద్యమంలో ఒక మహత్తరమైన పురోగమనం.


కాన్ఫరెన్స్ హాల్
CONFERENCE HALL







ఆంధ్రప్రదేశ్, ఉత్తర తెలంగాణా, దండకారణ్యం, బెంగాల్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి వచ్చిన 41మంది ప్రతినిధులు, పార్టీ యూనిటీ తరఫున వచ్చిన ఒక సౌహార్ద్ర ప్రతినిధి పాల్గొన్న ఈ ప్రత్యేక మహాసభ 1995 నవంబరు 15న గొప్ప విప్లవ వాతావరణంలో ప్రారంభమైంది. ''**ఆంధ్రప్రదేశ్, దండకారణ్య అమరుల లోయ**''గా పిలువబడిన ఈ మహాసభ ప్రాంగణంలో ఉదయం 8.30గంటలకు ''నక్సల్బరీ-శీకాకుళం **అమరుల ద్వారం**'' నుండి ప్రారంభమైన ఊరేగింపు ''**గెరిల్లాజోన్లు నిర్మిద్దాం**'' ''**ప్రజా యుద్ధాన్ని మునుముందుకు కొనిపోదాం**'', ''**అమరుల కలలను నిజం చేద్దాం**'', ''**గ్రామకమిటీలు నిర్మిద్దాం**'', ''**రకరకాల రివిజనిజం నశించాలి**'', ''**సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) వర్ధిల్లాలి**'' అంటూ దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో, అమరులందరికీ పేరు పేరునా నివాళులర్పిస్తూ ముందుకు నడిచింది. తెలుగు, హిందీ, గోండీ, తమిళ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, ఒరియా, ఇంగ్లీషు భాషలలో మిన్నుముట్టిన నినాదాలూ, విప్లవగీతాలూ ఈ చారిత్రక మహాసభ ప్రారంభాన్ని ఉత్తేజపూరితం చేసాయి.

ఊరేగింపు ఒక గంటపాటు సాగి ''**మాండ్వా అమరవీరుల మిలిటరీ పెరేడ్‌గ్రౌండ్**'' చేరి, గెరిల్లాలందరూ ఆలివ్‌గ్రీన్ యూనిఫారాలతో, తలపై ఎర్రనక్షత్రం టోపీ, భుజాన వేలాడే తుపాకీలతో క్రమశిక్షణాయుతంగా వరుసలలో నిలబడి వుండగా దండకారణ్యం నుండి వచ్చిన ఒక కామ్రేడ్ జెండా ఆవిష్కరణ చేసారు. జెండావిష్కరణ జరుగగానే గెరిల్లాలందరూ ఆకాశంలో రెపరెపలాడుతున్న అరుణ పతాకానికి 'రెడ్‌శాల్యూట్' చేసారు. ఎర్రజెండా గీతాన్ని ఆలాపించారు. ఆ తర్వాత జెండావిష్కరణ చేసిన కామ్రేడ్, పార్టీ ఎదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలను వివరిస్తూ హిందీ, గోండీలలో మాట్లాడారు.

ఆ తర్వాత సి.ఓ.సి. కార్యదర్శి కామ్రేడ్ గణపతి ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మహాసభలు ప్రారంభమవుతున్నాయని ప్రకటించి, ఆ మహాసభల చారిత్రక ప్రాముఖ్యతను వివరించి చెప్పారు. ఒకవైపు సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా పీకలబంటి సంక్షోభంలో మునిగిపోయి, అంతిమ నాశనానికి దగ్గరవుతుండగా, మరోవైపు శతృవుతో మన పోరాటం రోజురోజుకు తీవ్రస్థాయికి చేరుతున్న కీలక సమయంలో జరుగుతున్న ఈ మహాసభల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

జెండావిష్కరణ తర్వాత కామ్రేడ్స్ అందరూ ఊరేగింపుగా ''**కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంల కాన్ఫరెన్స్ హాలు**'' ప్రాంగణంలో నిర్మించిన అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. ''**ప్రజావీరులు మృత్యుంజయులు**'' అని రాసివున్న అక్షరాలతో దేదీప్యమానంగా వెలుగుతున్న ఎర్రటిస్థూపాన్ని ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన ఒక కామ్రేడ్ ఆవిష్కరించారు. వెంటనే అమరుల స్మృతికి నివాళులర్పిస్తూ గెరిల్లా లందరూ తమ టోపీలు తీసి, తుపాకీలు దించి తలవంచి రెండు నిముషాలు మౌనం పాటించారు. స్థూపావిష్కరణ చేసిన కామ్రేడ్ తెలుగు, ఇంగ్లీషు భాషలలో మాట్లాడుతూ, భారత ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రాణాలర్పించిన వీరులను గుర్తుచేస్తూ మాట్లాడారు. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు కట్టుబడి చివరి వరకూ పోరాటాన్ని కొనసాగించి, భారత ప్రజల విముక్తిని సాధించడం ద్వారానే మన ప్రియమైన అమరులకు నిజమైన నివాళులర్పించగలం అని ఆయన అన్నారు.

అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఒక సి.ఓ.సి. కామ్రేడ్ ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ స్వాగతోపన్యాసం చేశారు. విప్లవోద్యమంలో ఎదురైన ఒడిదుడుకులను, ఎం-ఎల్ పార్టీలో వచ్చిన చీలికలను సంక్షిప్తంగా వివరిస్తూ, 1970లో జరిగిన 8వ కాంగ్రెస్ తర్వాత ఇప్పుడు జరుగుతున్న ఈ అఖిలభారత ప్రత్యేక మహాసభకున్న ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. తర్వాత సి.ఓ.సి. కార్యదర్శి ప్రతినిధులందరినీ సభకు పరిచయం చేశారు. ఆ సందర్భంగా ప్రతినిధుల రాజకీయ జీవితాన్ని, పార్టీ స్థాయిని సంక్షిప్తంగా వివరించారు. పరిచయం చేస్తున్నప్పుడు ప్రతినిధులు ఒక్కొక్కరే వేదిక వద్దకు వచ్చి సభకు 'రెడ్‌శాల్యూట్' చెప్పారు. ఆ తర్వాత సభా కార్యక్రమాల నిర్వహణకు ప్రతినిధులలో నుండి ముగ్గురితో కూడిన అధ్యక్షవర్గాన్ని ఎన్నుకుని, వారిని వేదికపైకి ఆహ్వానించారు.

మధ్యాహ్న కార్యక్రమం సి.ఓ.సి. కార్యదర్శి ప్రారంభోపన్యాసంతో మొదలైంది. సి.పి.ఐ. (ఎం-ఎల్) ఏర్పాటైన దగ్గర్నుండీ భారత దేశంలో విప్లవోద్యమ చరిత్రను తడుముతూ, ప్రస్తుత ప్రత్యేక మహాసభ అవసరాన్ని ఆయన వివరించారు. పోరాట ప్రాంతాలలో పెరుగుతున్న నిర్బంధం, పెరుగుతున్న ప్రజాసాయుధ ప్రతిఘటన, పాలకవర్గాలలో పెరుగుతున్న అస్థిరత, అంతర్గత కుమ్ములాటలు, పార్లమెంటరీ రాజకీయాల బూటకత్వం, అదే సమయంలో అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రమైతున్న వైరుధ్యాలు యిలా యిప్పుడున్న అద్భుతమైన విప్లవ పరిస్థితిని మనస్సులో వుంచుకొని కాన్ఫరెన్స్ డాక్యుమెంట్లను, ఇతర ఎజెండాను చర్చించవలసిందిగా ఆయన ప్రతినిధులను తన ఉపన్యాసంలో కోరారు. దేశవ్యాప్తంగా విప్లవకారులను ఐక్యపరిచే, విప్లవోద్యమాన్ని పటిష్టపరిచి, విస్తృతపరిచి ముందుకు తీసుకుపోయే నిర్ణయాలను ఈ మహాసభ చేయాలని ఆయన తన ఉపన్యాసంలో కాంక్షించారు.

ఆ తర్వాత సి.పి.ఐ. (ఎం-ఎల్) (పార్టీ యూనిటీ) తరఫున వచ్చిన సౌహార్ద్ర ప్రతినిధి మాట్లాడారు. పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీ పార్టీల మధ్య చిరకాలంగా వున్న సౌహార్ద్ర సంబంధాలు, రెండు పార్టీల అధ్వర్యంలోని విప్లవ పోరాటాలు, వాటి అభివృద్ధిలో వున్న సారూప్యాలను వివరిస్తూ, నిజమైన విప్లవకారు లందర్నీ ఐక్యంచేసి, ఒకే విప్లవ పార్టీని ఏర్పర్చడం ద్వారానే పెరుగుతున్న విప్లవ పరిస్థితిని సరిగ్గా వినియోగించుకొని, విప్లవాన్ని విజయవంతం చేయగల్గుతామని ఆయన అన్నారు.

ఆ తర్వాత మహాసభ భారత నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో, అనేక విప్లవ రైతాంగ పోరాటాలలో 1857 నుండి నేటివరకు అమరులైన విప్లవవీరుల త్యాగాలను కొనియాడుతూ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ అమరులు కన్నకలల్ని నిజం చేయడానికీ, అందుకై పోరాడడానికీ మహాసభ పునరంకితమౌతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మహాసభ ప్రాంగణంలోని వివిధ

ద్వారాలకు, హాళ్ళకు అమరుల పేరున ఏర్పర్చిన వివరాలను, ఆ అమరవీరుల జీవితచిత్రాలను ఒక పి.ఓ.సి. కామ్రేడ్ సంక్షిప్తంగా సభకు నివేదించారు. ఆ సమయంలో "అమరవీరులకు జోహార్లు!" అన్న నినాదాలు సభలో ప్రతిధ్వనించాయి. ఆ తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాలలో వున్న జైళ్లలోను, పెరూ, ఫిలిప్పైన్స్, టర్కీ, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాల జైళ్లలోను నిర్బంధించబడిన విప్లవకారులందరికీ విప్లవాభినందనలు చెప్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ప్రత్యేకించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ జైళ్లలోని విప్లవకారులు, రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో వున్న ఖైదీలందర్నీ కూడగట్టి నిరాహార దీక్షలు చేసి సాధించిన విజయాన్ని సభ శ్లాఘించింది. జె.ఏ.సి.డి.ఆర్. ఏర్పర్చి, ఖైదీల పోరాటానికి మద్దత్తుగా నిలిచిన మేధావుల కృషికి జేజేలు పలికింది. "మీరు నంకెళ్లు తెంపుకొని మా మధ్యకు వచ్చే రోజుకోసం ఎదురుచూస్తున్నా"మని సభ విప్లవ ఖైదీలపట్ల ఆశాభావాన్ని వెలిబుచ్చింది. అనంతరం సభ పెరూ విప్లవ నాయకుడు కామ్రేడ్ గొంజాలోను విడుదలను డిమాండు చేస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించింది.

అనంతరం స్టీరింగ్ కమిటీగా వ్యవహరించడానికి పి.ఓ.సి. సభ్యులందర్నీ వేదికపైకి ఆహ్వానించారు. సభా నిర్వహణా పద్ధతులు, సంప్రదాయాలు, ఓటు చేసే విధానాలు చర్చించి నిర్ణయించుకున్న తర్వాత ప్రారంభ సమావేశం ఆ రోజు సాయంత్రానికి ముగిసింది.

16 ఉదయం సమావేశంలో స్టీరింగ్ కమిటీ మహాసభల ఎజెండాను ప్రవేశపెట్టింది. కొన్ని చేర్పులతో సభ దానిని ఆమోదించింది. పి.ఓ.సి. ప్రతిపాదించిన డాక్యుమెంట్లు పార్టీ ప్రణాళిక-నిబంధనావళి, వ్యూహం-ఎత్తుగడలు, రాజకీయ తీర్మానం, రాజకీయ నిర్మాణ సమీక్ష ఒక్కొక్కటి వరుసగా సభ వివరంగా చర్చించి, అవసరమైన సవరణలతో ఆమోదించింది. 1980నాటి ఆత్మవిమర్శనా రిపోర్టును ఒక ప్రత్యేక తీర్మానం ద్వారా ఆమోదించింది. "భారత విప్లవయుద్ధం-గెరిల్లాజోన్లు" అనే డాక్యుమెంటును ప్రతినిధులు చర్చించి, తమ అభిప్రాయాలు వినిపించారు. ఆ డాక్యుమెంటుకు తుదిరూపం ఇచ్చే అధికారాన్ని ఎన్నుకోబోయే కేంద్రకమిటీకి అప్పగించారు. 1990-95 మధ్య పార్టీ మొత్తం జమా ఖర్చుల వివరాలను సభ చర్చించి ఆమోదించింది. పార్టీ "ఆర్థిక విధానాన్ని" రూపొందించే బాధ్యతను కూడా ప్రతినిధులు ఎన్నుకోబోయే కేంద్రకమిటీకి అప్పగించారు.

తర్వాత పి.ఓ.సి. సభ్యులందరూ తమతమ ఆత్మ విమర్శలు వినిపించారు. దానిపై ప్రతినిధుల విమర్శలు స్వీకరించి తర్వాత మరోసారి ఆత్మవిమర్శ చేసుకున్నారు. ఆ తర్వాత స్టీరింగ్‌కమిటీ ప్రతిపాదనపై ప్రతినిధులు చర్చించి తొమ్మిదిమందితోకూడిన నూతన కేంద్రకమిటీని, ఐదుగురు ప్రత్యామ్నాయ సభ్యులను ఎన్నుకున్నారు.

చివరి రోజున సభ 7 ప్రత్యేక తీర్మానాలను ఆమోదించింది. తర్వాత సోదర ప్రతినిధి ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. క్యాంపు నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, ఉన్నతమైన రాజకీయ పరిపక్వత, క్రమపద్ధతిలో కార్యక్రమాల నిర్వహణను ఆయన ప్రశంసించారు. అధ్యక్షవర్గం ధన్యవాదాలు చెప్పడంతో సభా కార్యక్రమాలు ముగిసాయి.

సభా కార్యక్రమాలు చివరి రోజు మధ్యాహ్నానికి ముగియగానే, ప్రతినిధులు, రక్షణ బాధ్యతలలో వున్న కామ్రేడ్స్‌తో కలిసి ఊరేగింపు తీశారు. కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రారంభమైన ఊరేగింపు ఆంధ్ర-దండకారణ్య అమరులలోయ అంతటా తిరిగి గ్రౌండులో సమావేశమైంది. ఈ ఊరేగింపులో స్థానిక గిరిజన ప్రజలు కూడా తమ రంగురంగుల సాంప్రదాయ దుస్తులతో డప్పులు వాయిస్తూ ఉత్సాహంగా పాల్గొని, ఊరేగింపుకు పెద్ద ఆకర్షణ అయ్యారు. "ప్రజాసైన్యాన్ని నిర్మించుదాం", "గ్రామకమిటీలు నిర్మించుదాం!" "సర్వాధికారాలు గ్రామకమిటీలకే", "ఉత్తర తెలంగాణా, దండకారణ్య గెరిల్లాజోన్లను ఉన్నతస్థాయికి కొనిపోదాం!" "గ్రామరక్షక దళాలను, ప్రజా మిలీషియాను నిర్మిద్దాం!", "బలమైన ఐక్య విప్లవపార్టీని నిర్మిద్దాం!", "ప్రభుత్వ బలగాల దాడులను ఓడిద్దాం!", "మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి", "నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి" మొదలైన నినాదాలు ఊరేగింపులో మారుమ్రోగాయి.

గ్రౌండులో కొత్తగా ఎన్నికైన కేంద్రకమిటీ కార్యదర్శి కా॥ గణపతి సమావేశాన్నుద్దేశించి ప్రసంగించారు. ఆయన తెలుగులో మాట్లాడగా దానిని గోండీ, హిందీ భాషలలోకి అనువదించారు. మహాసభ తీసుకున్న ప్రధాన నిర్ణయాలను నొక్కిచెప్తూ, వాటి పరిపూర్తికి కృషి చేయాలని కోరారు. పార్టీలో అన్యవర్గ ధోరణులపట్ల అప్రమత్తంగా వుండి పోరాడాలనీ, పార్టీని బలోపేతంచేసి, బోల్షివీకరించి విప్లవోద్యమానికి శక్తివంతమైన నాయకత్వాన్ని అందివ్వాలనీ ఆయన ప్రత్యేకించి నొక్కి చెప్పారు.

నిర్వహణకమిటీ తరఫున ఒక కామ్రేడ్ మాట్లాడుతూ క్యాంపు నిర్మాణంలోను, రక్షణ, హాస్పిటల్, పరిశుభ్రత, లైటింగ్, సెంట్రీడ్యూటీలు, రక్షణ బాధ్యతలు నిర్వహించిన కామ్రేడ్స్ కృషికి విప్లవాభినందనలు చెప్పారు. మహాసభను విజయవంతం చేయడంలో వారి కృషిని కొనియాడారు.

సాయంత్రం 6 గం॥కు మహాసభలు విజయవంతంగా ముగించడానికి సూచనగా తుపాకుల వందనం చేసారు. ఆ తర్వాత సమావేశం యావత్తూ అంతర్జాతీయగీతాన్ని ఆలపించి, ఎర్రజెండాను అవనతం చేశారు.

**అఖిల భారత ప్రత్యేక మహాసభ నినాదాలు**

1. పి.వి. నర్సింహారావు ప్రభుత్వ
   నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం!
   హిందూ ఫాసిస్టు శక్తులను ఓడిద్దాం !!
   వ్యవసాయక విప్లవాన్ని ముందుకు తీసుకుపోదాం !!!

2. ప్రజా సాయుధ ప్రతిఘటనను పెంపొందించి
   ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోదాం !

3. దండకారణ్యం, ఉత్తర తెలంగాణా ప్రాంతాలను
   ఉన్నతస్థాయి గెరిల్లాజోన్స్‌గా పెంపొందిద్దాం !
   ఇతర ప్రాంతాలలో గెరిల్లాజోన్స్‌ను నిర్మిద్దాం !!

4. క్రిందినుండి ప్రజల అధికారాన్ని స్థాపిద్దాం !

5. స్వీయాత్మక శక్తులను పెంపొందించుకుందాం !
నూతన ప్రాంతాలలో ప్రజాపునాదిని నిర్మించుకుందాం !!

6. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యసంఘటనను నిర్మిద్దాం !
జాతుల ఉద్యమాలతో ఐక్యమవుదాం !

7. బలమైన కార్మికవర్గ పార్టీని నిర్మిద్దాం !
నిజమైన విప్లవకారులందరితో ఐక్యతను సాధిద్దాం !!

8. అన్యవర్గ ధోరణులతో పోరాడుదాం !
అన్ని స్థాయిల్లో పార్టీని బోల్షివీకరిద్దాం !!

9. సమిష్టి పనివిధానాన్ని పెంపొందించుకోవడం ద్వారా, కమిటీల పనివిధానాన్ని బలోపేతం చేద్దాం !

10. సైద్ధాంతిక అవగాహనను పెంపొందించుకుందాం!
నిర్దిష్ట అధ్యయనంపై కేంద్రీకరిద్దాం !!

11. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని ఎత్తిపడుదాం !
రకరకాల రివిజనిజాలను ఓడిద్దాం !!

12. మహిళలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుదాం !
మహిళా ఉద్యమాన్ని పెంపొందిద్దాం !!

13. కులవివక్షత, అణచివేత, అస్పృశ్యతలకు వ్యతిరేకంగా పోరాడుదాం !

14. పట్టణ ఉద్యమాన్ని నిర్మిద్దాం !
కార్మికవర్గంపై కేంద్రీకరిద్దాం !!

## సాహిత్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు

సుబ్బారావు పాణిగ్రాహి సాంస్కృతిక వేదిక, చెరబండరాజు సాహిత్యవేదిక కామ్రేడ్ సరోజ్‌దత్త గ్రంథాలయం, కామ్రేడ్స్ చంద్రన్న, పద్మక్కల ఎగ్జిబిషన్‌హాల్, ఉడుతల శ్రీనివాసులు పాఠశాల మహాసభ ప్రాంగణంలో సాంస్కృతిక వాతావరణం కల్పించాయి.

చెరబండరాజు సాహిత్యవేదిక ప్రతినిధులను, ఇతర గెరిల్లా కామ్రేడ్స్‌ను కవితలు, కథలు రాయమని ప్రోత్సహించింది. సాహిత్య ప్రక్రియలపై రెండు ఉపన్యాసాలు కూడా ఏర్పాటు చేసింది. సాహిత్యవేదిక కృషితో కామ్రేడ్స్ ఉత్సాహంతో 8 భాషలలో సుమారు 57 కవితలు రాసారు. అవి రోజూ చదివి వినిపించారు.

పాణిగ్రాహి సాంస్కృతిక వేదిక తరపున మహిళల సమస్య, జైలు పోరాటం, ఎన్‌కౌంటర్లపై మూడు నాటకాలు ప్రదర్శించారు. రెండు నృత్యనాటికలు, మిమిక్రీ, ఒగ్గుకథలు ప్రదర్శించారు. ఎన్నో విప్లవగీతాలు వినిపించారు. మధ్యాహ్న సమయంలో కూడా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రత్యేకించి బెంగాల్ నుండి వచ్చిన ఒక ప్రతినిధి, ప్రపంచదేశాల విప్లవ సాహిత్యం నుండి అనువదించిన ఎన్నో పాటలను పాడి వినిపించి అందర్నీ ఉత్తేజితులను చేశారు.

మహాసభ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కామ్రేడ్స్ సూర్యం, పద్మక్కల ప్రదర్శనశాలలో పెరుగుతున్న విప్లవోద్యమంలోని వివిధ మలుపులను, ముఖ్యసంఘటనలను సూచించే ఫోటోలను ప్రదర్శించారు. కా॥ సరోజ్‌దత్త లైబ్రరీలో మార్క్సిస్టు మహోపాధ్యాయుల రచనలు, పార్టీ డాక్యుమెంట్లు, వివిధ భాషలలో వెలువడుతున్న పార్టీ పత్రికలు, ఇతర సాహిత్యం అందుబాటులో వుంచారు. కా॥ ఉడుతల శ్రీనివాసులు రాజకీయ పాఠశాలలో రాజకీయ పాఠాలతోబాటుగా, చదువులేనివారికి చదువు నేర్పారు. ఎప్పటికప్పుడు రేడియో ద్వారా సేకరించిన వార్తలను అందరికోసం ఒక నోటీసుబోర్డుపై రాసి ప్రదర్శించారు. ఖాళీ సమయంలో ఆటలకోసం రెండు వాలీబాల్‌కోర్టులు ఏర్పాటు చేశారు. ఒక వాలీబాల్ పోటీ కూడా నిర్వహించారు.

## ప్రతినిధుల విశ్లేషణా వివరాలు

| వర్గం : | |
|---|---|
| కార్మికవర్గం | 2 |
| పట్టణ పేదవర్గం | 1 |
| పేదరైతాంగం | 4 |
| పట్టణ మధ్యతరగతి, మధ్యతరగతి రైతాంగం | 22 |
| ధనిక రైతాంగం | 10 |
| భూస్వామ్య వర్గం | 1 |
| జాతీయ బూర్జువా | 1 |

| చదువు : | |
|---|---|
| పోస్టు గ్రాడ్యుయేట్లు | 7 |
| గ్రాడ్యుయేట్లు | 17 |
| ఇంటర్మీడియట్ | 11 |
| సాంకేతిక విద్య | 4 |
| హైస్కూలు | 2 |

| వయస్సు : | (సంవత్సరాలలో) |
|---|---|
| అతి ఎక్కువ | 59 |
| అతి తక్కువ | 26 |
| సగటు | 37 |
| అతి ఎక్కువ పార్టీ జీవితం | 24 |
| అతి తక్కువ పార్టీజీవితం | [illegible]½ |
| సగటు పార్టీజీవితం | 15½ |

# విప్లవోత్తేజాన్ని నింపిన ఆంధ్రప్రదేశ్ 14వ రాష్ట్ర మహాసభలు

ఎత్తైన కొండలమధ్య, దట్టమైన పచ్చాటి అడవిలో వెలసింది కాళంగి అమరవీరుల కమ్యూన్. కమ్యూన్‌కు ప్రారంభం అమరుడు కా॥ సంతోష్ ద్వారం. కొద్దిగా ముందుకు వెళ్తే కామ్రేడ్స్ అంజన్న, భాగ్యక్క మరియు మాధవ్‌ల అందంగా అలంకరించిన ఎత్తైన ప్రవేశద్వారం. ఆ పక్కనే పద్మక్క అమరవీరుల వంటశాల. మరికొంత ముందుకు వెళ్తే అమరులు కామ్రేడ్స్ సీతక్క, మల్లేశ్వరరావుల ద్వారం. అది దాటి ముందుకు వెళ్తే విశాలమైన మండువా అమరవీరుల మిలిటరీగ్రౌండు. ఆ గ్రౌండుకు ఒకవైపు కా॥ ఆనంద్ సైన్యాల, మరోవైపు కా॥ మహమ్మద్ ఖదర్ టెంట్. మార్గదర్శనైన చంద్రమతి అమరుల మహిళల టెంట్, కా॥ సిరారెడ్డి డిస్పెన్సరీటెంట్ ఏర్పాటై వున్నాయి. ఈ గ్రౌండులోనే కా॥ ఎం.ఎస్.ఆర్. సాహిత్యవేదిక, కా॥ సిను సాంస్కృతిక వేదిక, రూపొందిన స్మారక వేదికలను స్థాపించారు. ఈ గ్రౌండు దాటి కొంత ముందుకు వెళ్తే కామ్రేడ్స్ సూర్యం, పద్మక్క కాన్ఫరెన్స్‌హాల్, దానికి ఒక్కగా పి.పి. సమావేశాల కోసం ఏర్పాటుచేసిన సాంకుర్తి అమరవీరుల టెంట్. ఈ కమ్యూన్ నంతటిని కలుపుతూ దారులతో పాటు అంతటా వెలుగులు చిమ్మే ట్యూబ్‌లైట్లు. అది పటిష్టమైన రక్షణలో ఏర్పడిన ఒక విప్లవ కుగ్రామం. ఎత్తైన కొండలపై ఏర్పాటు చేసిన కా॥ కిషన్, కా॥ శాంతమ్మ సెంట్రీపోస్టుల్లో నిలిచిన గెరిల్లాలు సదా అప్రమత్తంగా ఈ గ్రామాన్ని కంటికి రెప్పలా కాపాడేవారు.

ఇటువంటి పటిష్టమైన రక్షణలో, ఉత్తేజకరమైన వాతావరణం మధ్య ఆంధ్రప్రదేశ్ 14వ రాష్ట్ర మహాసభలు 1995 ఆగష్టు 2న ప్రారంభమయ్యాయి. కాళంగి అమరవీరుల కమ్యూన్‌లోని కామ్రేడ్స్ అంజన్న, భాగ్యక్క నగర్‌లో, మండువా అమరవీరుల మిలిటరీ గ్రౌండులో అమరుడు కా॥ చంద్రన్న ప్రత్యేకంగా రూపొందించిన 10 అడుగుల అమరవీరుల స్థూపం, విప్లవవీరుల త్యాగాలను ప్రతిఫలిస్తూ నిలిచివుండగా, ఆకాశమంతా అలంకరించిన అరుణారుణ తోరణాలు, స్థూపం ముందు సభకు విచ్చేసిన ప్రతినిధులు, రక్షణ కర్తవ్యాన్ని నిర్వహించను భుజాన వేసుకున్న గెరిల్లా యోధులు క్రమశిక్షణతో మూడు వరుసలలో నిలిచివుండగా సాయంత్రం 4గంటలవేళ ఒక కామ్రేడ్ అరుణపతాకాన్ని ఎగురవేయడంతో సభలు ప్రారంభమయ్యాయి. రెపరెపలాడే అరుణ పతాకానికి రెడ్‌శాల్యూట్స్ చెప్తూ, గెరిల్లాలు పాడుతుండగా చుట్టూ వున్న కొండలు తమవంతుగా ప్రతిధ్వనించాయి. జెండాను ఆవిష్కరించిన కామ్రేడ్ ప్రసంగించిన తర్వాత మరొక కామ్రేడ్ స్థూపావిష్కరణ చేశారు. అనంతరం గెరిల్లాలందరూ అమరులను సంస్మరిస్తూ 2ని.లు మౌనం పాటించారు. అనంతరం అమరులందరికీ పేరుపేరునా జోహార్లు అర్పిస్తూ నినదించారు. స్థూపావిష్కరణ చేసిన కామ్రేడ్ అమరుల త్యాగాలను కీర్తిస్తూ మాట్లాడారు. అనంతరం సి.ఓ.సి. కార్యదర్శి కా॥ గణపతి ప్రారంభోపన్యాసం చేస్తూ ఈ మహాసభల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ మాట్లాడారు. తమిళనాడు నుండి వచ్చిన సి.ఓ.సి. సభ్యుడు, సౌహార్ద ప్రతినిధిగా వచ్చిన దండకారణ్య కమిటీ కార్యదర్శి ఆయా కమిటీల తరఫున ఆంధ్రప్రదేశ్ 14వ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తూ తమ సందేశాలు వినిపించారు.

ఆగష్టు 3వ ఉదయం నుండి కామ్రేడ్స్ సూర్యం, పద్మక్క హాలులో సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సభలో 40మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అందులో ఇద్దరు మహిళలు. ప్రతినిధిగా రావలసిన నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కా॥ సంతోష్ పాముకరిచి అమరుడయ్యాడు. సౌహార్ద ప్రతినిధిగా రావలసిన మరో కామ్రేడ్ రాలేదు. ఇద్దరు ఓటుహక్కులేని ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన ఇద్దరు సి.ఓ.సి. సభ్యులు, దండకారణ్య కమిటీ కార్యదర్శి ఈ మహాసభలో పాల్గొన్నారు. ప్రతినిధులందర్నీ ఆంధ్ర రాష్ట్రకమిటీ కార్యదర్శి సభకు పరిచయం చేశారు.

సభా కార్యక్రమాల నిర్వహణకు సభ ముగ్గురితో కూడిన ఒక అధ్యక్షవర్గాన్ని ఎన్నుకున్నది. రాష్ట్రకమిటీ స్టీరింగ్ కమిటీగా వ్యవహరించింది. అనంతరం సభ డాక్యుమెంట్లపై చర్చ ప్రారంభించింది. వరుసగా పార్టీ కార్యక్రమం, నిబంధనావళి, వ్యూహం-ఎత్తుగడలు, రాజకీయ తీర్మానం, కేంద్రరాజకీయ నిర్మాణ సమీక్ష, ఏ.పి. రాష్ట్ర రాజకీయ నిర్మాణ సమీక్ష, పట్టణాలలో పని విధానం, సాంస్కృతిక పర్స్పెక్టివ్‌లను సి.ఓ.సి., రాష్ట్రకమిటీల సభ్యులు ప్రతిపాదించగా సభ విస్తృతమైన, వివరమైన చర్చ జరిపి అవసరమైన సవరణలతో ఆమోదించింది.

ఆ తర్వాత 13వ రాష్ట్ర మహాసభ నుండి రాష్ట్రకమిటీ జమా-ఖర్చుల వివరాలను రాష్ట్రకమిటీ కార్యదర్శి సభ ముందుంచారు. సభ వాటిని ఆమోదించింది. అనంతరం 13వ రాష్ట్ర మహాసభ నుండి రాష్ట్రకమిటీకి నాయకత్వం వహించిన కామ్రేడ్స్ అందరు సభ ముందు తమ ఆత్మవిమర్శను వినిపించారు. తర్వాత ప్రతినిధులు సూచించిన విమర్శను స్వీకరించి, తమ లోపాలు సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం ఆంధ్రప్రదేశ్ కమిటీ నుండి ఉత్తర తెలంగాణా ప్రాంతాన్ని విభజించాలన్న, సి.ఓ.సి. ప్రతిపాదనపై చర్చ జరిగింది. సభ కూలంకషంగా చర్చించి, ఉత్తర తెలంగాణా ప్రాంతాన్ని ఉన్నతస్థాయి గెరిల్లాజోన్‌గా అభివృద్ధి చేయడానికి ఆ నిర్ణయం ఎంతో అవసరమైనదిగా భావించి, ఆమోదించింది. అదేసమయంలో ఈస్ట్ డివిజన్ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రకమిటీ నాయకత్వం క్రిందికి తీసుకువస్తూ కూడా సభ తీర్మానాన్ని ఆమోదించింది. కొత్తగా ఏర్పడ్డ ఆంధ్ర రాష్ట్ర ప్రాంతానికి, ఆ ప్రాంతానికి చెందిన ప్రతినిధులు తొమ్మిది మందితో కూడిన నూతన రాష్ట్రకమిటీని, ముగ్గురు ప్రత్యామ్నాయ సభ్యులను ఎన్నుకున్నారు. అదే సమయంలో కేంద్ర కాన్ఫరెన్స్‌కు తొమ్మిదిమందితో కూడిన ప్రతినిధి వర్గాన్ని కూడా సభ ఎంపిక చేసింది. తర్వాత సభ వివిధ తీర్మానాలను ఆమోదించింది. ప్రత్యేకించి అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ, ఇటీవల వీరోచిత పోరాటాలు నిర్వహించి యావత్తు పార్టీకి ఉత్తేజాన్ని అందించిన జైలు కామ్రేడ్స్‌కు విప్లవాభినందనలు తెల్పుతూ రెండు తీర్మానాలను ఆమోదించారు.

17న సాయంత్రం 4 గంటలకు సభా కార్యక్రమాలు ముగియగానే కామ్రేడ్స్ సూర్యం, పద్మక్క హాలు నుండి ప్రతినిధులందరూ రెండు

## సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు

కమ్యూన్ కామ్రేడ్స్‌లో వివిధ ప్రక్రియలలో సాహిత్య సృజన చేస్తున్న కామ్రేడ్స్ అనేకమంది వున్నారు. అటువంటి కామ్రేడ్స్ కొందరు సమావేశాన్నై అమరుడు, విప్లవకవి కా॥ ఎమ్.ఎస్.ఆర్. సాహిత్యవేదికను ఏర్పాటు చేశారు. కమ్యూన్ కామ్రేడ్స్‌లో సాహిత్య అభిరుచిని పెంపొందించడానికి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి కొన్ని నిర్ణయాలు చేశారు. అందుకనుగుణంగా సాహిత్యవేదిక తరపున ఏర్పాటు చేసిన సమావేశంలో కమ్యూన్ కామ్రేడ్స్ అందరికీ తలాఒక తెల్లకాగితం పంచారు. ఆ తెల్ల కాగితంపై ప్రతి కామ్రేడ్ ఏదో ఒకటి రాసి ఇవ్వాలనీ, అది కవిత, కథ, గల్పిక, వ్యాసం ఏదైనా ఫరవాలేదని కోరారు. కామ్రేడ్స్ రాసిన వాటిని సమావేశంలో చదివి వినిపిస్తామనీ, సాహిత్య వేదిక బోర్డుపై అంటిస్తామనీ, మొహమాటపడకుండా అందరూ రాసివ్వాలనీ కోరారు. రాసిన వాటిని మెరుగుపర్చడానికి అవసరమైన సూచనలు, సలహాలు సాహిత్యవేదిక అందివ్వగలదని కూడా చెప్పారు. సాహిత్యవేదిక విజ్ఞప్తి మేరకు దళసభ్యుల నుండి సి.ఓ.సి. సభ్యుల వరకు అందరూ ఉత్సాహంగా సాహిత్య సృజనలో పాల్గొన్నారు. అనేక మంది కొత్త కామ్రేడ్స్, దళంలో వచ్చాకే చదువు నేర్చుకున్న కామ్రేడ్స్ ఉత్సాహంగా ముందుకువచ్చి చక్కని కవితలు రాసారు. మొత్తం 72 కవితలు, రెండు గల్పికలు సాహిత్య వేదికకు అందాయి. సాహిత్యవేదిక తరపున కవిత, కథ, నవల తదితర సాహిత్య ప్రక్రియలను వివరిస్తూ కొందరు కామ్రేడ్స్ మాట్లాడారు.

సాంస్కృతిక కార్యకలాపాల నిర్వహణకు ఏర్పడిన కా॥ ఏసు కళావేదిక కుల సమస్య తదితర సమస్యలపై అనేక నాటికలు ప్రదర్శించింది. పగిడేరు వీరులు ఒగ్గుకథ, మహిళా కామ్రేడ్స్ ప్రదర్శించిన ఒగ్గుకథ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.

ధూమపాన వ్యతిరేక వేదిక కూడా తన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ వేదిక కోరికపై కొందరు పొగత్రాగే కామ్రేడ్స్ ఒక రోజు పొగకాల్పుల విరమణ పాటించారు. ఈ వేదిక కవితలు, పాటల ద్వారా ధూమపాన వ్యతిరేక ప్రచారం నిర్వహించింది. ❑

వరుసలలో ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపు ముందవా అమరవీరుల గ్రౌండుకు చేరగానే కమ్యూన్ కామ్రేడ్స్ అందరూ ఊరేగింపులో చేరారు. అక్కడి నుండి ఊరేగింపు కమ్యూన్ మొదట్లో వున్న కా॥ సంతోష్ ద్వారం వద్దకు వెళ్ళి తిరిగి గ్రౌండుకు చేరింది. ఊరేగింపు పొడుగునా దిక్కులు పిక్కటిల్లేలా, కొండలు ప్రతిధ్వనించేలా, ఆకాశం మారుమ్రోగేలా నినాదాలు ఎగిసివచ్చాయి. ఊరేగింపు గ్రౌండుకు చేరగానే ముగింపు సమావేశం ప్రారంభమైంది.

ఆగస్టు 17న మహాసభల ముగింపు సమావేశం జరిగింది. ముందుగా రాష్ట్రకమిటీ మాజీ కార్యదర్శి, సి.ఓ.సి. సభ్యుడు అయిన కామ్రేడ్ నూతన కమిటీని, కమిటీ కార్యదర్శిని కమ్యూన్ కామ్రేడ్స్ అందరికీ పరిచయం చేశారు. ఆ తర్వాత అంతర్జాతీయ గీతం పాడి జెండాను అవనతం చేశారు. ఆతర్వాత సి.ఓ.సి. కార్యదర్శి మహాసభలు విజయవంతంగా ముగిసాయని ప్రకటిస్తూ, మహాసభ తీసుకున్న మహత్తర నిర్ణయాలను కమ్యూన్ కామ్రేడ్స్‌కు వివరించారు. తర్వాత కమ్యూన్ నిర్వహణ బాధ్యత తీసుకున్న కామ్రేడ్, నిర్వహణలో ఎదురైన సమస్యలను తప్పొప్పులను వివరిస్తూ మాట్లాడారు. మహాసభ ప్రతినిధులు, చర్చలలో చురుగ్గా పాల్గొనేలా, రోజుకు ఎక్కువ గంటలు సభ జరిగేలా చూడడానికి సెంట్రీ, వంట, శానిటరీ, ఇతర నిర్వహణ బాధ్యతలను పూర్తిగా తమ భుజాన వేసుకొని ఎక్కువ భారాన్ని మోయడం ద్వారా మహాసభ అనుకున్న సమయంలో విజయవంతంగా ముగించడానికి తోడ్పడి, బోల్షివిక్ చైతన్యాన్ని ప్రదర్శించిన ప్రొటెక్షన్ టీమ్ కామ్రేడ్స్‌కు మహాసభ తరపున అయన ప్రత్యేకించి విప్లవాభినందనలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రకమిటీ నూతన కార్యదర్శి తమ కమిటీ ముందున్న కర్తవ్యాలను వివరిస్తూ మాట్లాడారు. దీనితో సభ విజయవంతంగా ముగిసింది.

***ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్ రూపొందించిన నినాదాలు :***

1. గ్రామస్థాయి నుండి ప్రజల అధికారాన్ని నెలకొల్పాలి !
2. ప్రజల సాయుధ ప్రతిఘటనను పెంపొందించడం ద్వారా ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోవాలి !
3. పార్టీ నిర్మాణాన్ని క్రిందినుండీ బలోపేతం చేయాలి !
4. ఉత్తర తెలంగాణాను బలమైన గెరిల్లాజోన్‌గా నిర్మించాలి ! ఇతర రీజియన్లలో వర్గపోరాటాలను తీవ్రతరం చేయాలి ! గెరిల్లాజోన్ సన్నాహాలపై కేంద్రీకరించాలి !
5. అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలి !
6. సమిష్టి పనివిధానాన్ని పెంపొందించి కమిటీ పనిపద్ధతిని పటిష్టం చేయాలి !
7. సిద్ధాంత పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి ! నిర్దిష్ట అధ్యయనంపై శ్రద్ధ వహించాలి !

| | | | |
|---|---|---|---|
| వర్గం : | | చదువు : | |
| కార్మికవర్గం | :.........6 | పార్టీ చదువు | :.........2 |
| పేదవర్గం | :.........8 | ప్రైమరీ చదువు | :.........1 |
| మధ్యతరగతి | :.......20 | పదవ తరగతి | :.........6 |
| ధనికరైతు వర్గం | :.........6 | ఇంటర్ | :.......13 |
| | | డిగ్రీ : | .........9 |
| కులం : | | పి.జి. : | .........9 |
| ఎస్.సి. | :.........5 | పార్టీ జీవితం : | |
| బి.సి. | :.......17 | అతి ఎక్కువ | :.......21 |
| ఎస్.సి. | :.........1 | అతి తక్కువ | :.......3½ |
| ఎఫ్.సి. | :.......15 | సగటు | :.12 సం॥ |
| మైనారిటీ మతస్థులు | :.........2 | | .11 నెలలు |
| వయస్సు : | (సంవత్సరాల్లో) | జైలు జీవితం : | |
| అతి ఎక్కువ | :.......59 | అతి ఎక్కువ | :.......5½ |
| అతి తక్కువ | :.......26 | అతి తక్కువ | :.....1 నెం |
| సగటు | :.....35½ | లేనివారు | :.23 మంది |

# జయప్రదంగా ముగిసిన ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ ప్రథమ మహాసభలు

అమరులు కామ్రేడ్స్ సూర్యం, పద్మక్క నగర్‌లోని అమరుడు కామ్రేడ్ గోనగాని ఐలన్న స్మృతిలో నిర్మితమైన కమ్యూన్‌లో విప్లవకర వాతావరణం మధ్య ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ ప్రథమ మహాసభ జయప్రదంగా జరిగాయి. కామ్రేడ్ కట్ల మల్లేశ్ పేర నిర్మితమైన ముఖద్వారం తర్వాత విశాలంగా వున్న కామ్రేడ్ శంకర్, బాలన్నల మిలిటరీ గ్రౌండులో అరుణకాంతులతో వెల్లివిరుస్తూ అమరుల జ్ఞాపకార్థం నిర్మించబడ్డ 15 అడుగుల ఎత్తైన స్మారకస్థూపం. స్థూపందగ్గరి జెండా స్థంభం నుండి మొదలై గ్రౌండుకు నలువైపులా త్యాగాల చాల్లుగా వేలాడదీసిన అరుణారుణ తోరణాలు అందంగా అలంకరించబడ్డాయి. మిలిటరీ గ్రౌండుకు చుట్టూ పచ్చటిచెట్ల క్రింద నలువైపులా వివిధ టెంట్లు నిర్మించబడ్డాయి. విశ్రాంతికోసం పగిడేరు అమరవీరుల జనరల్ టెంట్, అమరవీరుల ఫోటోలను, చిత్రాలను, ఉద్యమాన్ని, నిర్బంధకాండను ప్రతిబింబింపజేస్తూ వేసిన కార్టూన్లను ప్రదర్శించేందుకు కామ్రేడ్ ఆజాద్ ఫోటో ప్రదర్శనశాల, మరోవైపు కాళంగి అమరవీరులపేర నిర్మితమైన వంటశాల, ఇంకొకవైపు కామ్రేడ్ పులి మధున్న డిఫెన్స్ టెంట్ నిర్మించబడ్డాయి. గ్రౌండు నుండి కామ్రేడ్ శాయిని ప్రభాకర్ ద్వారం గుండా కాన్ఫరెన్సు హాలుకు పోయే దారిలో కామ్రేడ్ జ్యోతక్క మెడికల్ టెంట్ నిర్మితమైంది. మరికొస్త దూరంలో ఎత్తైన విశాల ప్రాంతంలో అమరులు కామ్రేడ్ అంజన్న, భాగ్యక్కలపేర కాన్ఫరెన్సు హాలు నిర్మించబడి హాలులో మహాసభలపేర వ్రాయబడ్డ బ్యానర్‌కు ఐదుగురు మార్క్సిస్టు మహోపాధ్యాయుల ఫోటోలతోబాటు భారత విప్లవనేత, ఎం-ఎల్ పార్టీ స్థాపకుడైన అమరుడు కామ్రేడ్ చారుమజుందార్ ఫోటోను పెట్టారు. హాలులో చుట్టూలా మార్క్సిస్టు మహోపాధ్యాయుల బోధనలు వ్రాసిన పోస్టర్లు అమర్చారు. హాలుకు ముందు మహాసభలపేర వ్రాసి కట్టిన చాలా పెద్దదైన బ్యానర్‌పై మార్క్సిస్టు మహోపాధ్యాయుల చిత్రాలు గీసారు. కాన్ఫరెన్సు హాలుకు ఎదురుగా కొస్త దూరంలో కామ్రేడ్ దగ్గుదాయలింగు పేర ఆర్.పి. టెంట్ వేసారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల సాగింపుకోసం గ్రౌండులో కామ్రేడ్ సారంగపాణి సాంస్కృతిక కళావేదికను, కామ్రేడ్ సంతోష్ సాహిత్య వేదికను ఏర్పాటు చేసారు. సెంట్రీ బాధ్యతలు నిర్వహిస్తూ శత్రువుతో తుదిశ్వాస వరకు పోరాడి వీరమరణం పొంది అమరులైన కామ్రేడ్స్ ఆయ్యోరు, శ్రీనివాస్, భీమన్న, కిషన్‌ల పేర్లతో సెంట్రీ పోస్టులను ఏర్పాటు చేసారు.

28.9'95నాడు ఉదయం 8గంటలకు జెండా ఎగురవేయడంతో సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉత్తర తెలంగాణా రీజియన్‌లోని వివిధ జిల్లాల నుండి ప్రతినిధులుగా, రక్షణకుగాను వచ్చిన కామ్రేడ్స్ అంతా గ్రౌండులో మూడు వరుసలుగా బారులుతీరి రెడ్‌శాల్యూట్స్ చేస్తుండగా, సాక్ సభ్యురాలైన మహిళా కామ్రేడ్ ఎర్రజెండాను ఎగురవేయగానే జెండా గీతం ఆలపించారు. అనంతరం ఆ కామ్రేడ్ ఎర్రజెండా ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగించారు. తదనంతరం రీజనల్ కమిటీ సభ్యుడు స్థూపావిష్కరణ చేయగా కామ్రేడ్స్ అందరూ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు తెల్పుతూ పాటపాడి, దిక్కులు పిక్కటిల్లేలా విప్లవ నినాదాలు చేసారు.

అనంతరం స్థూపావిష్కర్త ప్రసంగిస్తూ అమరుల త్యాగాలను కొనియాడుతూ ఉత్తర తెలంగాణా ఉద్యమం ప్రాథమిక గెరిల్లాజోన్ స్థాయికి ఎదగటానికి దాదాపు 750మంది కామ్రేడ్స్ తమ రక్తాన్ని ధారపోసి, ప్రాణాలను త్యాగంచేసి అమరులయ్యారని తెలుపుతూ వారి ఆశయాన్ని తుదకంటా కొనసాగించాల్సిన కర్తవ్యం మనపై వుందని గుర్తుచేశాడు. దోపిడీవర్గ ప్రభుత్వాలు రాక్షస దమనకాండను అమలుజరిపి విప్లవోద్యమాన్ని నిర్మూలించలేకపోయాయని, నిర్బంధాలను ఎదుర్కొంటూ సంఘటిత మిలిటెంట్ పోరాటాలతో ప్రజలు అనేక విజయాలను సాధించుకున్నారని తెలిపాడు. ఉద్యమాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రామాలలో గ్రామకమిటీలను నిర్మించాల్సిన అవశ్యకతను వివరిస్తూ ముగించాడు.

భోజన విరామం తర్వాత సాయంత్రం 3గంటలకు ప్రారంభ ఉపన్యాసంతో కార్యక్రమాలు ప్రారంభమైనాయి. మహాసభలకు హాజరైన సి.ఓ.సి. సెక్రటరీ ప్రారంభోపన్యాసం యిస్తూ 'గత 15 సంవత్సరాల ఉద్యమాన్ని సమీక్షించుకొని నూతన కర్తవ్యాలను రూపొందించుకొని ఉత్తర తెలంగాణా ప్రాంతాన్ని ఉన్నత స్థాయి గెరిల్లాజోన్‌గా అభివృద్ధి చేయాల్సి వుంటుందని తెలిపాడు. జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్ని తడుముతూ సామ్రాజ్యవాద దేశాలన్నీ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూ, అగ్రరాజ్యాలు పతనమవుతూ, ఆర్థికపోటీ తీవ్రతరమవుతుండగా ఇంకొకవైపు ప్రపంచవ్యాపితంగా సామ్రాజ్యవాదులకు, దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విప్లవోద్యమాలు, జాతుల పోరాటాలు, ప్రజా ఉద్యమాలు తీవ్రతరం అవుతూ ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికి అనుకూల పరిస్థితులు పెరుగుతున్న పరిస్థితుల్లో భారతదేశంలో నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని కొనసాగిస్తున్న మన పార్టీ నిర్మాణాన్ని పటిష్టపర్చుకుంటూ, సాయుధ నిర్మాణాలను పెంపొందించుకుంటూ, ఐక్యసంఘటనల్ని సాధించుకుంటూ విప్లవోద్యమాన్ని విజయంవైపు నడిపించాల్సిన కర్తవ్యం మనపై ఉందని గుర్తుచేశాడు. మన ఉద్యమంలో అనేక విజయాలు సాధించుకో గలిగినప్పటికీ ఉద్యమ క్రమంలో అనేక పొరపాట్లు, లోపాలు కూడ దొర్లినందున మన ఉద్యమాన్ని సమీక్షించుకుని, తప్పుల్ని లోపాలని సరిదిద్దుకొని నూతన కర్తవ్యాలతో పార్టీని, ఉద్యమాన్ని మరింత పటిష్టం చేయాల్సి వుందని, ఆ లక్ష్యంతో ప్రారంభమవుతున్న ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేసుకోవడానికి కృషి చేయాలని కోరుతూ అమరవీరులకు జోహార్లర్పించి, వారి ఆశయాలను కొనసాగిద్దామని నినదిస్తూ ప్రసంగాన్ని ముగించాడు.

తిరిగి అదే రోజు సాయంత్రం బహిరంగ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితుడైన ఆంధ్రరాష్ట్ర కమిటీ సెక్రటరీ తమ సందేశాన్ని వినిపిస్తూ ఉత్తర తెలంగాణా ఉద్యమం ఆంధ్ర రాష్ట్రం మొత్తానికి ఉత్తేజాన్ని కలిగిస్తూ, ఒకే కమిటీ గైడెన్సులో పనిచేస్తూ అనేక అనుభవాలను అందిస్తూ వచ్చిందని పేర్కొన్నాడు. ఉద్యమ అవసరాలరీత్యా ఉత్తర తెలంగాణా రాష్ట్రస్థాయిగల స్పెషల్‌జోన్ కమిటీ

ఏర్పడుతున్నప్పటికీ యిరుప్రాంతాలలో ఉద్యమావసరాల కోసం ఒకరికొకరు అనుభవాలను ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు అనేక విషయాలలో సహాయ సహకారాలను కూడా అందించుకోవాల్సి వుంటుందని అభిప్రాయపడ్డాడు.

అనంతరం సాయంత్రం 5గంటలకు ప్రతినిధులంతా అంజన్న, భాగ్యక్కల కాన్ఫరెన్సు హాలులోకి చేరుకున్నారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఫారెస్ట్ డివిజన్, సింగరేణిలకు చెందిన జిల్లా కాన్ఫరెన్సులను ముగించుకొని వచ్చిన ప్రతినిధులతోపాటు ఉత్తర తెలంగాణాలో తిరిగి కలిపేందుకుగాను దండకారణ్య నిర్మాణం నుండి వేరుచేయబడ్డ ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు కూడా ఈ కాన్ఫరెన్సులో పాల్గొనడంతో మొత్తం 41మంది ప్రతినిధులతో సభ ప్రారంభమైంది. సి.ఓ.సి. సెక్రటరీతోపాటు మరొక సి.ఓ.సి. సభ్యుడు, అలాగే ఆంధ్ర రాష్ట్ర సెక్రటరీతోపాటు మరో రాష్ట్రకమిటీ సభ్యుడు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైనారు. అదేవిధంగా సి.ఓ.సి. టెక్రంగానికి చెందిన కామ్రేడ్ ఒకరు, జననాట్యమండలి కామ్రేడ్ ఒకరు ఓటుహక్కులేని ప్రతినిధులుగా హాజరైనారు. అనంతరం ఒక మహిళా కామ్రేడ్‌తోపాటు మొత్తం ముగ్గురితోకూడిన అధ్యక్షవర్గం ఎంపిక జరిగింది. రీజనల్ కమిటీకి చెందిన ఏడుగురు సభ్యులు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించగా కాన్ఫరెన్సుకు సంబంధించిన ఎజెండాను అధ్యక్షులు సభకు వినిపించడంతో ఆనాటి కార్యక్రమాలు ముగిసాయి.

రెండవరోజునాటి సమావేశంలో భారత నూతన ప్రజాతంత్ర విప్లవంలో అసువులుబాసిన అమరులందరికీ విప్లవ జోహార్లు అర్పిస్తూ ప్రత్యేక తీర్మానం ఆమోదించారు. అలాగే ప్రభుత్వ నిర్బంధకాండలో జైలు జీవితాలు అనుభవిస్తూ కూడ విప్లవ కర్తవ్యాలను నిర్వహిస్తున్న జైలులోని కామ్రేడ్స్‌కు విప్లవాభివందనాలు తెలుపుతూ మరొక ప్రత్యేక తీర్మానం ఆమోదించారు. ఆ తర్వాత 1984నుండి దండకారణ్యంలో భాగంగా కొనసాగుతూ వచ్చిన ఆదిలాబాద్ జిల్లా ఉద్యమ అవసరాల రీత్యా తిరిగి ఉత్తర తెలంగాణాలో విలీనమవ్వడాన్ని ఆమోదిస్తూ సభలో తీర్మానం జరిగింది. ఆ తర్వాత ఉత్తర తెలంగాణా ఉద్యమ సమీక్ష ప్రారంభమైంది.

ఈవిధంగా సెప్టెంబరు 28నుండి అక్టోబరు 7వ తేదీ వరకు కొనసాగిన ఈ కాన్ఫరెన్సులో — ఉత్తర తెలంగాణా రీజనల్ కమిటీ రాజకీయ, నిర్మాణ సమీక్ష, సింగరేణి ఉద్యమ సంక్షిప్త సమీక్ష, ఆదిలాబాద్ జిల్లా ఉద్యమ సంక్షిప్త సమీక్షలను ప్రవేశపెట్టగా ఈ డాక్యుమెంట్లపై ప్రతినిధులంతా వివరంగా చర్చలు జరిపి కొన్ని సవరణలతో వాటిని ఆమోదించారు. ఈ మహాసభల్లో ప్రాంతాల విభజనపై ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. దిగజారి ప్రభుత్వ సహాయం పొందుతున్న వారిపట్ల అనుసరించాల్సిన వైఖరి విషయంలో స్పష్టమైన విధానంతో తీర్మానం చేశారు. అకౌంట్స్ పద్ధతిపైన, ప్రస్తుత రాజకీయ పరిస్థితిపైన, రాబోయే పార్లమెంట్ ఎన్నికలు—మన అవగాహన పైన విడివిడి తీర్మానాలు చేశారు.

ఆత్మవిమర్శ-విమర్శ అనంతరం 9మంది సభ్యులతో ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ కమిటీ (NTSZC) ఎంపిక జరిగింది. కమిటీ సభ్యులు కమిటీ సెక్రటరీని ఎన్నుకొని ప్రకటించిన అనంతరం కాన్ఫరెన్సు హాలులో కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేయగా, ఆ తర్వాత మొత్తం ప్రతినిధులంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం ఆల్‌ఇండియా స్పెషల్ కాన్ఫరెన్సుకు పంపాల్సిన ప్రతినిధులను హాలు ఎంపిక చేసింది.

*ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ కాన్ఫరెన్స్ రూపొందించిన నినాదాలు:*

1. గ్రామస్థాయి నుండి ప్రజల అధికారాన్ని స్థాపిద్దాం!
   గ్రామకమిటీలను నిర్మిద్దాం!
2. ప్రజాసాయుధ ప్రతిఘటనను పెంచి ప్రజాయుద్ధాన్ని పెంపొందిద్దాం!
   ప్రజా మిలీషియాను నిర్మిద్దాం!
3. క్రింది నుండి పార్టీ నిర్మాణాన్ని పటిష్టంచేద్దాం!
4. ఉత్తర తెలంగాణాను బలమైన గెరిల్లాజోన్ చేద్దాం!
   దండకారణ్య గెరిల్లాజోన్‌తో, ఆంధ్ర రాష్ట్రంలోని ఇతర రీజియన్ల గెరిల్లాజోన్‌ల సన్నాహాలతో చేయిచేయి కలిపి పురోగమిద్దాం!
5. భూ పోరాటాలపై కేంద్రీకరిద్దాం!
   భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యసంఘటనను నిర్మిద్దాం!
6. బలమైన విప్లవ మహిళా ఉద్యమాన్ని నిర్మిద్దాం!
7. సిద్ధాంత జ్ఞానాన్ని పెంపొందించుకుందాం!
   నిర్దిష్ట అధ్యయనంపై శ్రద్ధపెడదాం!
8. సమిష్టి పని విధానాన్ని పెంపొందించి కమిటీ ఫంక్షనింగ్‌ను పటిష్టం చేద్దాం!
9. శరీర దారుఢ్యాన్ని పెంచుదాం! సైనిక క్రమశిక్షణను పాటిద్దాం!

ప్రతినిధుల నుద్దేశించి ధన్యవాదాలు తెలుపుతూ అధ్యక్షవర్గం తరపున ఒకరు ప్రసంగించడంతో అక్టోబరు 7నాడు సాయంత్రం 5గంటలకు మహాసభలు విజయవంతంగా ముగిసాయి. అనంతరం కమ్యూన్‌లోని మొత్తం కామ్రేడ్స్ కాన్ఫరెన్స్ హాలు నుండి రెండు వరుసలుగా బారులుతీరి విప్లవ నినాదాలు, పాటలు, డప్పుల చప్పుళ్లతో దిక్కులు పిక్కటిల్లేలా హోరెత్తిస్తూ, ఎర్రజెండాలు, బ్యానర్లు రెపరెపలాడుతుండగా కామ్రేడ్స్ సూర్యం, పద్మక్కల నగరమంతా ఊరేగింపుగా తిరిగి గ్రౌండులోని జెండావద్ద చేరగా ముగింపు సమావేశం జరిగింది. కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులను కమ్యూన్‌లోని కామ్రేడ్స్ అందరికి పరిచయం చేసిన అనంతరం సి.ఓ.సి. కామ్రేడ్ ప్రసంగించాడు. గత 25 సం॥ దీర్ఘకాల పోరాటంలో అనేక త్యాగాలతో, ఎంతో రక్తార్పణగావిస్తూ తల్లీ తెలంగాణా రెండు కవల పిల్లల్ని కన్నదని మాట్లాడుతూ ఉత్తర తెలంగాణా, దండకారణ్య గెరిల్లాజోన్ల పేరుతో జన్మించిన ఈ కవలపిల్లలు దినదినం ఎదుగుతూ, కండపుష్టితో బలపడుతూ మరెన్నో గెరిల్లాజోన్‌లు నిర్మాణం గావటానికి తగిన సహాయ సహకారాలందిస్తూ విముక్తియుద్ధం సాగించి విజయం పొందగలిగే స్థాయికి క్రమంగా ఎదగాల్సి వుందని తెలిపాడు.

ఆ తర్వాత ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్ కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ, కాన్ఫరెన్సు తీసుకున్న నినాదాల పరిపూర్తి

తేపేందుకు పట్టుదలగా కృషి చేయాలంటూ తెలిపి కాన్ఫరెన్సు విధానాలను చదివి వినిపించాడు. సాంస్కృతిక, సాహిత్యవేదికలు ఏర్పడి మహాసభలు కొనసాగినన్ని రోజులు ప్రతిరోజు సాయంత్రం 45 నిమిషాల కాలం తమతమ కార్యక్రమాలు సాగిస్తూ వచ్చాయి. సాయుధ జననాట్యమండలి బృందం కామ్రేడ్స్ పాటలు, నాటికలు నృత్య ప్రదర్శనలు, ఒగ్గుకథల ద్వారా కమ్యూన్‌లోని కామ్రేడ్స్ నందరినీ ఉత్తేజపరుస్తూ రాగా సాహిత్య వేదికకు చెందిన కామ్రేడ్స్ విప్లవ సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని గుర్తింపచేస్తూ ప్రోత్సహించగా చాలా మంది కామ్రేడ్స్ ప్రతిస్పందిస్తూ కవితలు వ్రాసి రోజువారీగా వినిపించడం జరిగింది. చివరగా క్యాంపు నిర్వాహణా బాధ్యుడు ప్రసంగించాడు. ఈ కార్యక్రమాలతోబాటు మొత్తం క్యాంపు నిర్వహణను సమీక్షిస్తూ మాట్లాడాడు. చివరగా కామ్రేడ్స్ అందరూ అంతర్జాతీయ గీతం పాడి జండాను దించడంతో మహాసభల కార్యక్రమాలు ముగిసాయి. □

---

# పార్లమెంటు ఎన్నికలను బహిష్కరించండి !
# సాయుధ వ్యవసాయక విప్లవాన్ని ముందుకు తీసుకుపొండి !!

సి.పి.ఐ. (ఎం-ఎల్)(పీపుల్స్‌వార్), ఎమ్.సి.సి., సి.పి.ఐ.(ఎం-ఎల్)(పార్టీయూనిటీ)ల సంయుక్త ప్రకటన

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా పిలువబడుతున్నది. మన దేశంలో 11వ పార్లమెంటు ఎన్నికలతో బాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా 1996 ఏప్రిల్, మే నెలలో జరుగబోతున్నాయి. పేదరికాన్ని నిర్మూలిస్తామనీ, నిరుద్యోగం, అధిక ధరలు, విద్య, ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తామని పార్లమెంటరీ పార్టీల నాయకులు మనకు వాగ్దానాలు కుమ్మరిస్తారు. పి.వి ప్రభుత్వం నూతన ఆర్థిక విధానం, నూతన పారిశ్రామిక విధానాల విజయంవల్లనే దేశంలో విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నాయని ప్రకటించుకుంటుంది. వాళ్లను వాళ్లు దేశభక్తులుగా, ప్రజా సంక్షేమ కోసంపాటు పడుతున్న వాళ్లుగా చెప్పుకుంటారు. మరోవైపున, వివిధ పార్లమెంటరీ పార్టీల నాయకులు కొత్త ఫ్రంట్‌లు కట్టడానికి పాత ఎన్నికల ఫ్రంట్‌లను వదిలిపెట్టి ''స్థిరమైన, ప్రజానుకూలమైన ప్రభుత్వాన్ని'' ఏర్పరుస్తామని వాగ్దానాలు చేస్తారు.

ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థలో కొనసాగుతున్న సంక్షోభం వలన భారతదేశ ఆర్థిక పరిస్థితి దివాళా తీసింది. పాలకవర్గాలు ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. అమెరికా, రష్యా, జపాన్, జర్మనీ, బ్రిటన్‌తోసహా సామ్రాజ్యవాద శక్తులేవీ సంక్షోభం నుండి బయటపడ లేకపోతున్నాయి. జపాన్, జర్మనీల పరిస్థితి ఎంతో కొంత మెరుగుగా వున్నప్పటికి ఆ దేశాలలో కూడా ఈనాడు సంక్షోభం కనిపిస్తున్నది. సామ్రాజ్యవాదులు తమ సంక్షోభ భారాన్ని భారతదేశం వంటి మూడో ప్రపంచ దేశాల మూపుల్లపైకి నెట్టారు. సామ్రాజ్యవాదులు ప్రపంచవ్యాప్తంగా తమ దోపిడీని తీవ్రతరం చేయడానికి ప్రపంచీకరణ, వ్యవస్థాపరమైన సర్దుబాటు విధానాలు చేపట్టారు. ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచబ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థ వారి ప్రధాన ఆయుధాలు. ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచబ్యాంకు ఆదేశాలతో పి.వి ప్రభుత్వం ప్రపంచీకరణ, గాట్ ఒప్పందాలను అమలు జరపడానికి వున్న అడ్డంకులన్నిటినీ తొలగించడంలో తీరికలేకుండా నిమగ్నమై వుంది. ''నూతన ఆర్థిక విధానం'' పేరుతో భారత ప్రభుత్వం ఎమ్.ఎన్.సి.లను, టి.ఎన్.సి.లను ఆహ్వానిస్తూ, భారత ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వారి నిబంధన లన్నిటినీ ఆమోదిస్తున్నది.

పై పరిస్థితుల కారణంగా, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల దారుణమైన దోపిడీ అణచివేతలు, పెద్దఎత్తున నిరుద్యోగానికి, రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు, దళితులు, మహిళలపై సామాజిక అణచివేతకు, స్వయం నిర్ణయాధికార హక్కుకై పోరాడుతున్న జాతులపై నిర్బంధం, ప్రభుత్వ సాయుధ బలగాల పాశవిక చర్యలకు శాశ్వతంగా దారితీస్తున్నాయి. ప్రజల పరిస్థితి మరింత భరించరానిదిగా తయారైంది.

భారత ప్రజలు గత 45 ఏళ్లలో 10 పార్లమెంటు ఎన్నికలను చూసారు. ఎన్నికలలో పార్టీలు, మంత్రులు బాగుపడవచ్చుగాని, దోపిడీ అంతంకాదని వాళ్లు తెలుసుకున్నారు. సారాంశంలో అమలు జరగకుండా, ఉపరితల నిర్మాణంలో మాత్రం బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ వుండే భారతదేశం లాంటి దేశాలలో ఇది ఏమాత్రం ఆశ్చర్యపడదగ్గది కాదు. అర్ధవలస, అర్ధభూస్వామ్య ఆర్థిక పునాది కలిగిన భారత రాజ్యంపై పార్లమెంటరీ వ్యవస్థ బలవంతంగా రుద్దడం వలన, ఆర్థిక పునాదికి ఉపరితలానికి పొత్తు కుదరలేదు. భారత ప్రభుత్వం మాటలలో ప్రజాస్వామ్యాన్ని వల్లిస్తూనే నియంతృత్వాన్ని అమలుజరుపుతున్నది.

కేంద్రంలోను, రాష్ట్రాల్లోనూ వున్న పాలకవర్గాలు ఏ క్షణమైనా 144వ సెక్షన్, కర్ఫ్యూ, నల్లచట్టాలు, కల్లోలిత ప్రాంతాలు విధించవచ్చు; పారామిలిటరీ దళాలను మోహరించవచ్చు; రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను నిషేధించవచ్చు, వివిధ ప్రాంతాలలో అప్రకటిత యుద్ధాన్ని సాగించవచ్చు. కొన్ని ప్రాంతాల పరిపాలన సైనిక బలగాలకు అప్పగించారు. అరెస్టు అయిన తర్వాత పోలీసు లాకప్‌లలో కొట్టి చంపడం, బూటకపు ఎన్‌కౌంటర్‌లలో కాల్చి చంపడం, అరెస్టైయిన ప్రజాసంఘ కార్యకర్తలను మాయం చేయడం, ఇండ్లు కూలగొట్టడం, పంటలు నాశనం చేయడం, సామూహిక మారణకాండ మొదలైనవి తరుచుగా జరుగుతున్నాయి. అదేసమయంలో అదుపులేని అవినీతి, ప్రజావ్యతిరేక సంస్కృతి వలన మానవ విలువలు నశించిపోతున్నాయి. ఈ వాస్తవ చిత్రం దేనిని సూచిస్తున్నది? పార్లమెంటరీ ప్రజాస్వామ్య పాలన అనే బోర్డును చూపి వాస్తవానికి వాళ్లు మిలిటరీ పాలనను కొనసాగిస్తున్నారు. నిరంకుశ రాజ్యాంగ యంత్రం రోజురోజుకు వివిధ రకాల ఫాసిస్టు పద్ధతులను అమరుజరుపుతూ అణచివేతను తీవ్రతరం చేస్తున్నది. ప్రజలు క్రమంగా ఈ వ్యవస్థపై మరింతగా విశ్వాసాన్ని కోల్పోతున్నారు.

ప్రతిఘటనా పోరాట మార్గాన్ని ఎన్నుకుంటున్నారు.

ప్రజల కోపాగ్నిని నీరుగార్చడానికి పాలకవర్గ పార్టీలన్నీ చాలాకాలంగా వివిధ సంస్కరణలను వాగ్దానం చేస్తూ ప్రజలను మోసపుచ్చడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ సంస్కరణ పథకాలన్నీ ప్రజల దుస్థితిని మార్చడంలో విఫలమయ్యాయి. దానితో పాలకవర్గాలు అందమైన భవిష్యత్తును చిత్రిస్తూ కొత్త నినాదాలు ఎత్తుకుంటున్నాయి. అంతేగాక ప్రజల కుల, జాతి, మైనారిటీ మత భావాలను సైతం వాడుకుంటున్నాయి. బిజెపి, శివసేన, జనతాదళ్, సమాజ్‌వాది జనతాదళ్, సమతాపార్టీ, ఇంకా ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, అన్నా డిఎంకె, డిఎంకె, అకాలీదళ్, అస్సాం గణపరిషత్ - ఈ పార్టీలన్నీ పై భావాలను ఉపయోగించుకుని ప్రస్తుత దోపిడీ పాలనను నిలబెట్టి, పాలకవర్గాలలోని వివిధ సెక్షన్ల ప్రయోజనాలకు సేవ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

అధికార కాంగ్రెస్(ఐ)తో సహా, పై పార్టీలన్నీ ఈ బూటకపు ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజలలో ఈ దోపిడీ వ్యవస్థపై భ్రమలు కల్పించడానికి శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నాయి.

నక్సల్బరీ రైతాంగ ఉద్యమం సిపిఐ, సిపిఎంల రివిజనిస్టు తత్వాన్ని బయటపెట్టింది. ఈ పార్టీలు విప్లవ వాగాడంబరంతో వ్యవసాయ విప్లవ పంథా నుండి ప్రజలను పార్లమెంటరీ పంథాకు మళ్లించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఎస్.ఎన్.ఎస్., కానూసన్యాల్, పి.సి.సి. టిఎన్‌డి, వినోద్‌మిశ్రా వంటి దిగజారిన గ్రూపులన్నీ పార్లమెంటరీపంథాను స్వీకరించి, ప్రజల ఆశలని వమ్ముచేశాయి. చివరికి జనశక్తి, యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) వంటి కొన్ని గ్రూపులు కూడా ప్రజల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయడంవల్ల ఎన్నికలలో పాల్గొంటున్నాయి.

డెబ్బైలు, ఎనభైలలో విప్లవపార్టీలు పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. కాని ఇప్పుడు ఒక సరికొత్త అధ్యాయం తెరుచుకుంటున్నది. విప్లవపార్టీలు ప్రభుత్వ దాడులను తట్టుకుంటూ, నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ, తిప్పికొడుతూ ఎన్నికలను చురుకుగా బహిష్కరించడానికి ప్రజలను నడిపిస్తున్నాయి. మరోవైపున జాతుల పోరాటాలు జరుగుతున్న ప్రాంతాలలో అభివృద్ధి నిరోధక భారతప్రభుత్వం ఎన్నికలు నిర్వహించే పేరుతో పాశవిక సాయుధ బలగాలన్నిటినీ మోహరించి, క్రూరమైన అణచివేతను అమలుజరుపుతూ, అచ్చమైన మిలిటరీ పాలనను నెలకొల్పుతున్నది. వర్గ పోరాటాలు, జాతుల పోరాటాలు జరుగుతున్న ప్రాంతాలలో ఎన్నికలు నిర్వహించడం అంటే సారాంశంలో ప్రతిఘటనా పోరాటాలను అణచివేసి, విస్తృతమైన మారణకాండను సాగిస్తూ మిలిటరీ, పారామిలిటరీ పాలనను నెలకొల్పడమే.

*కామ్రేడ్స్, మిత్రులారా!*

ఎన్నికలపంథా అంటే శత్రువుకు లొంగిపోయే పంథానే, మృత్యు వలలో చిక్కుకోవడమే. దానికి వ్యతిరేకంగా సాయుధ విప్లవపంథా అంటే సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని వ్యవసాయ విప్లవం, దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా తుడిచి పెట్టే పంథా; ప్రజాసైన్యాన్ని, స్థావర ప్రాంతాలను నిర్మించి ''దున్నేవారికే భూమి'', ''సర్వాధికారాలు రైతాంగ కమిటీలకే'' అనే మౌలిక నినాదాల ద్వారా రైతాంగకమిటీల చట్టాలను, అధికారాన్ని నెలకొల్పి, ప్రాంతాలవారీగా రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకుని నూతన ప్రజాస్వామిక భారతాన్ని ఏర్పరిచే పంథా.

ప్రజలు ఆత్మరక్షణ దళాలు, గెరిల్లాదళాలు, గెరిల్లాబలగాలు నిర్మించుకుని, ఎర్రసైన్యాన్ని, స్థావర ప్రాంతాలను నెలకొల్పే లక్ష్యంతో పురోగమిస్తున్నారు. వారు భూస్వామ్య అధికారాన్ని కూలదోసి ప్రజల చట్టాన్ని, అధికారాన్ని నెలకొల్పుతున్నారు. భూములు ఆక్రమించుకుని ఆయుధాలు, భూస్వాముల, జోతేదారుల చరాస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. నేరస్తులను ప్రజాకోర్టులలో విచారించి శిక్షిస్తున్నారు. ప్రజల స్వతంత్ర, ప్రజాస్వామిక రాజ్య వ్యవస్థ పిండరూపంలో అగుపిస్తున్నది. ఈ నూతన రాజ్యవ్యవస్థను సంరక్షించే, అభివృద్ధి చేసే బాధ్యతను ప్రజలు మరింతగా తమ భుజాలపైకి ఎత్తుకుంటున్నారు. ఆవిధంగా కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వాన విప్లవపోరాటాలు భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో మునుముందుకు పోతున్నాయి.

అందువలన ఎన్నికలను బహిష్కరించి, సాయుధ వ్యవసాయ విప్లవంవైపుగా మరలి, సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని తుడిచిపెట్టి నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించవలసిందిగా ప్రజలకు మేము పిలుపునిస్తున్నాము. అప్పుడు మాత్రమే నిజమైన సంస్కరణ, అంటే, దున్నేవారికే భూమి అన్నది, గ్రామీణ ప్రాంతమంతటా అమలు జరుగుతుంది.

పై పోరాటాలను సంరక్షించి, అభివృద్ధి చేయడానికి ముందుకు రావలసిందిగా భారతదేశంలోని కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థి, యువతరం, మహిళలు, మేధావులతోసహా ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులందరికీ మేము విజ్ఞప్తి చేస్తున్నాము. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించి, ఈ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను ఆయా ప్రాంతాలలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా బలమైన, చురుకైన ప్రతిఘటనా పోరాటంగా మలచవలసిందిగా ప్రజలందరికి మేము పిలుపునిస్తున్నాం. మన పోరాటం ముందున్న అడ్డంకులేవైనప్పటికీ, వ్యవసాయ విప్లవపంథాని, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని మనం దృఢంగా ముందుకు తీసుకుపోవాలి. నూతన ప్రజాస్వామిక భారతాన్ని నెలకొల్పడానికి మనం ఆంధ్ర, బీహార్, దండకారణ్య మార్గాన్ని దృఢసంకల్పంతో పురోగమింపజేయాలి.

| | | |
|---|---|---|
| కేంద్రకమిటీ,<br>భా.క.పా(మా-లె)<br>(పీపుల్స్‌వార్) | కేంద్రకమిటీ,<br>ఎం.సి.సి. | కేంద్రకమిటీ,<br>భా.క.పా(మా-లె)<br>(పార్టీయూనిటీ). |


వెలువడింది ! చదవండి !!

సారంగయుద్ధం

(బొమ్మల పుస్తకం)

శ్రామికవర్గ ప్రచురణలు వెల : 25 రూ॥లు

# జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు
# విప్లవిస్తున్న ప్రజలు జాతుల విముక్తి పోరాటాలకు బాసటగా నిలుస్తారు

## ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. 'జాతుల సమస్యపై అంతర్జాతీయ సదస్సు' సందేశం

అది భగత్‌సింగ్‌నగర్. సిద్దూకానూ డహర్ (వీధి). కెన్‌సారోవివా హాల్. అక్కడొక చిన్న ప్రపంచం నాలుగురోజులపాటు వెలిసింది. ఆ జాతుల నందనోద్యానంలో రంగురంగుల పక్షులు వాలాయి. తమదయిన తమ కిన్నమైన భాషల్లో మాట్లాడాయి. అక్కడ పక్షులకు పంజరాలులేవు. ఇష్టంగా ఏ చెట్టుకొమ్మ మీదనయినా కూర్చోవచ్చు. ఇష్టం లేకుంటే ఎగిరిపోవచ్చు. గడ్డిపూవు నుంచి గులాబీపువ్వు వరకు వాటి స్వచ్ఛంద స్వేచ్ఛను గౌరవిస్తూ ఒక ఎర్రతలపాగా చుట్టుకున్న తోటమాలి ఆ ప్రపంచాన్ని సమన్వయపరుస్తున్నాడు. గ్లోబల్ సంగ్రామంలో అది ఒక విప్లవ కుగ్రామం. నానాజాతుల సహపంక్తి భోజనం సహజీవనం.

1996 ఫిబ్రవరి 16నుంచి 19వరకు నాలుగురోజులపాటు ఢిల్లీలో ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్ జాతుల సమస్యపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు అపూర్వమైన విజయాన్ని సాధించి ప్రతినిధులకు నూతన ఉత్తేజాన్ని, ఢిల్లీ ప్రజలకు సంభ్రమాశ్చర్యాలను కలిగించింది. తొలినాటి నుంచి ఇంకా ముగియని ఐరిష్ జాతివిముక్తి పోరాటం మొదలు కుర్దిస్థాన్ వరకు, కాశ్మీర్ మొదలు శ్రీలంక ఈలం వరకు జాతుల విముక్తి పోరాట ప్రాంతాలను ఘూర్తించిన ఎత్తైన మృతవీరుల స్థూపానికి ఎఐపిఆర్ఎఫ్ అధ్యక్షుడు గోరుమాధవరావు స్మృత్యంజలి ఘటించడంతో కార్యక్రమాలు ప్రారంభమైనవి. దొడ్డి కొమురయ్య షహీద్ మైదాన్‌గా పిలుచుకున్న ఆ ప్రాంతంలో ఝార్ఖండ్ మొదలు వివిధ జాతుల పోరాటాలను చిత్రించే బిర్సాముండా చిత్రప్రదర్శనశాల, జాతుల విముక్తి పోరాటాల గాధలను, ఇతిహాసాలను విశ్లేషించే వివిధ పుస్తకాలు హోచిమిన్ బుక్‌స్టాల్, ఆ దృశ్యం ఒక వినూత్న ప్రజాస్వామ్య సంస్కృతికి సంకేతంగా కనులకుగట్టింది.

సదస్సును ప్రారంభిస్తూ, చైనాపై సజీవ ప్రామాణిక ప్రత్యక్ష వ్యాఖ్యాత అనదగిన విలియం హింటన్ (ఫ్యాన్‌షన్, షెన్‌ఫెన్, టర్నింగ్‌పాయింట్, గ్రేట్ రివర్సల్ రచయిత) 'జాతి అంటే ఏమిటి? ఒక పెద్దతెగ' 'జాతుల స్వయంనిర్ణయాధికారాన్ని గుర్తించడం ఒక ప్రజాస్వామిక కర్తవ్యం' అన్నాడు. 'జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక చైనా పోరాటం ఒక ఆదర్శప్రాయమైన జాతివిముక్తి పోరాటం' అనీ, ఐక్యసంఘటన ద్వారా అది ప్రజల విప్లవంగా కూడ మావో సాధించగలిగాడని ఆయన అన్నాడు. సభకు అతిథులకు, ప్రతినిధులకు తొలుత ఆహ్వానసంఘ కార్యదర్శి నవీన్ స్వాగతం చెప్పాడు. ఆహ్వానసంఘ అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి తన స్వాగతోపన్యాసంలో 'ఈనాడు అత్యంత కీలకమైన జాతుల సమస్యను ప్రజాస్వామిక పద్ధతిలో పరిష్కరించడానికి సృజనాత్మకంగా పూనుకుంటున్న' ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్.కు అభినందనలు చెప్పాడు. ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. నిర్మాణం ఈ నాలుగేళ్లుగా చేసిన కృషి గురించి గోరుమాధవరావు, ఈ సదస్సు ఉద్దేశ్యం, లక్ష్యాల గురించి ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. కార్యదర్శి విజయ్‌కుమార్ ఆర్య మాట్లాడారు. ఈ సదస్సు విజయవంతం కావాలని కోరుతూ 'మంత్లీరివ్యూ' సంపాదకుడు పాల్ స్వీజీ, హైదరాబాదు, సికిందరాబాదు జైళ్లలోని పీపుల్స్‌వార్ రాజకీయ ఖైదీలు పంపిన సందేశాలు, రాజమండ్రి జైలు నుంచి వచ్చిన టెలిగ్రాం కూడా మొదట చదివి వినిపించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 600మంది ప్రతినిధులు, 150మందిదాకా ఆహ్వానితులు పాల్గొన్న ఈ సదస్సులో 32 పత్రాలు సమర్పించబడ్డాయి. తొమ్మిది మంది విదేశీ ప్రతినిధులు (విలియం హింటన్-మంగోలియా/అమెరికా, గూగీవాధియాంగో, అమెరికాలో ప్రవాసంలోవున్న కెన్యా-తూర్పు ఆఫ్రికా రచయిత, జలంధానీ-ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు, రేమండ్‌లొట్టా-మావోయిస్టు ఎకానమిస్టు-ఆర్.సి.పి, రిమ్ నాయకులే కాకుండా కుర్దిస్థాన్, ఈలం, నేపాల్, బెల్జియం, భూటాన్, పాకిస్థాన్ ప్రతినిధులు) కాశ్మీర్, నాగా, గోర్ఖాల్యాండ్, ఝార్ఖండ్, ఉల్ఫా, అస్సాం, సంథాలీ, పంజాబ్, ఉత్తరాఖండ్, కర్ణాటక విమోచన రంగ ప్రతినిధులు పత్రాలు సమర్పించారు. ప్రతినిధులుగా పాల్గొన్నవారిలో ఛత్తీస్‌ఘడ్ ముక్తిమోర్చా వాళ్లు కూడా వున్నారు.

కాశ్మీర్, అస్సాం, పంజాబ్ పోరాటాల గురించి వైవిధ్యంగల విభిన్న అభిప్రాయాల పత్రాలను కూడా సదస్సు చర్చించింది. కాశ్మీర్ స్వయం నిర్ణయాధికార పోరాటానికి జె.కె.ఎల్.ఎఫ్. నాయకుడు యాసిన్‌మాలిక్, పీపుల్స్‌పార్టీ నాయకుడు షబ్బీర్‌షాలకు పంపించిన ఆహ్వానాలకు ఆల్‌పార్టీ హురియత్ తనకు పంపిన ఆహ్వానంగా స్వీకరించి నలుగురితో ప్రతినిధి బృందాన్ని పంపింది. అందులో జెకెఎల్ఎఫ్ ఉపాధ్యక్షుడు జావీద్‌మీర్, షబీర్‌షా అనుచరుడు పర్వేజ్‌నక్వీ కూడా వున్నారు. అబ్దుల్‌గనీలోన్ హురియత్ తరపున పత్రాన్ని సమర్పించాడు. కాశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనపై యాసిన్‌మాలిక్ అనుచరుడైన అడ్వొకేట్ మాట్లాడాడు. కాశ్మీర్ ప్రజల స్వయంనిర్ణయ హక్కును ముక్తకంఠంతో బలపరచిన ఈ సభలో 'కాశ్మీర్ ప్రజలరా మీరు పోరాడండి, మీవెంట మేం వున్నాం' అన్న నినాదాలు హోరెత్తాయి. కాశ్మీర్‌పై సదస్సు ముగియగానే ఆంధ్రప్రదేశ్ జననాట్యమండలి ప్రదర్శించిన 'కాశ్మీర్' రూపకం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నది. భాషలకు సరిహద్దులు లేవని, పోరాట భాష పోరాడే ప్రజలందరికీ అర్థమవుతుందని ఈ తెలుగు రూపకం నిరూపించింది. ఈ సదస్సు వెనుక ప్రజాపుద్యమాల దశాబ్దాల దన్ను అలావుంచి ప్రత్యేకించి ఈ సదస్సుకోసం దాదాపు ఒక సంవత్సరం కృషి వున్నది. డిసెంబర్ 1 నుంచే ఢిల్లీలో మఖ్బూల్‌భట్ కమ్యూన్‌లో ఆంధ్ర, బీహార్, బెంగాల్, పంజాబ్, తమిళనాడు, ఢిల్లీల నుంచి వచ్చిన వలంటీర్ల నిరంతర శ్రమ వున్నది. ఇదివరకెన్నడూ ఎవరూ రాయనంతగా ఢిల్లీ నగరమంతటా మారుమూల ప్రాంతాల్లో కూడా జాతుల విముక్తి పోరాటాలను బలపరిచే నినాదాలు రాసారు.

ఒక జనతాదళ్ నాయకుడు విస్మయంతో వ్యాఖ్యానించినట్లుగా 'ఎంత ధైర్యంతో రాజధాని గుండెలపై కాశ్మీర్ లోయనుంచి భారత సైన్యాలు వెనక్కు రావాల'ని వీరు ప్రకటించారు. ఢిల్లీ మేధావుల్లో, రాజకీయ జీవుల్లో, పత్రికల్లో ఇది ఒక చర్చనీయాంశం అయిపోయింది. అందుకే ఆహ్వానితులు మాత్రమే కాకుండా ముప్పై ఎంఎల్ గ్రూపుల ప్రతినిధులు ఎంతో ఆసక్తితోవచ్చి ఈ సదస్సులో పాల్గొన్నారు. బలరాజ్‌పూరీ, ఎం.టి. ఖాన్, నందితా హక్సర్, ప్రొ॥ రణధీర్‌సింగ్, గౌతమ్ నావల్కా, సుమంతాబెనర్జీ, సాగర్‌సర్వదే, సెబాస్టియన్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

జాతుల స్వయం ప్రతిపత్తి మొదలు, స్వయం నిర్ణయాధికారం వరకు చర్చించిన ఈ సదస్సులో జాతుల దురహంకార ప్రమాదం గురించి యూరప్ అనుభవాన్ని బెల్జియం ప్రతినిధి హెచ్చరిస్తే నాలుగు దేశాలతో, ముఖ్యంగా టర్కీ రాజ్యంలో కుర్దిస్థాన్ కోసం పోరాడుతున్న కుర్దిష్ ప్రజలకు టర్కీ ప్రజల సంఘీభావం గురించి కుర్దిష్ ప్రతినిధి మాట్లాడాడు. కుర్దిష్‌జాతి విముక్తి కోసం సాయుధ మహిళా గెరిల్లాలను కూడా రూపొందించుకున్న ఎంతో ముందుకు వెళ్లిన (అడ్వాన్స్‌డ్) అనుభవం నుంచి సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో భాగంగా ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్న కర్ణాటక విమోచనరంగ అనుభవం దాకా ఇమిడివున్నాయి. నాలుగు రాష్ట్రాలకు విస్తరించిన ఝార్ఖండ్ పోరాటం నుంచి, యుపిలో స్వయం ప్రతిపత్తిగల రాష్ట్రం కావాలని కోరుకుంటున్న ఉత్తరాఖండ్ దాకావున్నాయి. ఇండియా, బర్మాలలో వున్న నాగాలు ఏకీకృతమయ్యే ఆయా రాజ్యవ్యతిరేక నాగా ఏకీకరణ పోరాటం గురించిన పత్రమూవుంది. స్త్రీల సమానహక్కుల పోరాటాన్ని వెలుగులోకి తెచ్చిన నేపాల్ పోరాటం, అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రం అయ్యి కూడా దళారీ బూర్జువా కేంద్రం తీవ్ర వివక్షకు గురియైన పంజాబియత్, సిక్కు మైనారిటీ పోరాటం - ఇట్లా వైవిధ్యంగల అంశాలు చర్చకు వచ్చాయి. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భోజన విరామంతప్ప పత్రాల సమర్పణ, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి.

ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. పక్షాన — జాతుల సమస్యపై అవగాహనా పత్రం, గ్లోబలైజేషన్ పాలసీలో స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్స్ — గురించి పత్రాలు సమర్పించబడ్డాయి. జాతుల విముక్తి పోరాటాలను, ప్రజల విప్లవ పోరాటాలను సమన్వయపరచి సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాల్సిన అవసరాన్ని ముంచుకొస్తున్న సామ్రాజ్యవాద గ్లోబలైజేషన్ పాలసీ, దానికి దాసోహమంటున్న భారత దళారీల కుట్రల గురించి ఈ పత్రాలు శాస్త్రీయంగా విశ్లేషించాయి. బంగ్లాదేశ్ నుంచీ, కుర్దీ పోరాటం గురించీ కూడా పత్రాలు వచ్చాయి. మొదట భారత ప్రభుత్వంతో వీసా నిరాకరించబడి, ఢిల్లీలోని ప్రజాస్వామ్యవాదులు, ముఖ్యంగా మిరాండా కాలేజ్, ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లీషు టీచర్స్ పోరాటంతో వీసా పొంది వచ్చిన గూగీ దంపతులు సదస్సుకు ఒక పెద్ద ఆకర్షణ అయ్యారు. ఆఫ్రికా జాతుల విముక్తి పోరాటాల గురించి చెప్తూ 'పోరాడందే నాకు వీసా కూడా లభించనపుడు, ఇంక స్వయం నిర్ణయాధికారాలు ఎలా వస్తాయి చెప్పండి' అని అన్నాడు. వలసవాదం, నయావలసవాదంకు వ్యతిరేకంగా ఆఫ్రికా ప్రజల సుదీర్ఘ పోరాటాలను వివరిస్తూ, కెన్యా నుంచి బహిష్కృతుడై ఇపుడు ప్రవాసంలో బతుకుతున్న తాను కెన్‌సారోవివా ఉరితీత తర్వాత జాతుల పోరాటానికి సామ్రాజ్యవాద వ్యతిరేకత ఎంత కీలకాంశమో గుర్తించానన్నాడు. జాతుల విముక్తిలో అంశమైన భాషా సమస్యపై చివరి రోజు ప్రసంగిస్తూ, 'మనస్సును, బుద్ధిని వలసీకరణ నుంచి విముక్తం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. జ్ఞానం కూడా ఒక ఉత్పత్తే. ఉత్పత్తి అందులో పాల్గొంటున్న శ్రామికులైన ప్రజలకు చెందవలసినట్లే జ్ఞానం కూడా ప్రజలకు చెందాలని బుద్ధిజీవులు తమ నైతిక బాధ్యతగా గ్రహించాలి. ఇంత చర్చల ఒత్తిడిలో కూడా దిశా సాంస్కృతిక మంచ్ - హర్యానా (కెన్‌సారోవివా, కాశ్మీర్‌లపై రూపకాలు) అభివ్యక్తి-బీహార్, క్రాంతికారీ సాంస్కృతిక సంఘ్-బీహార్, జనకళామండలి-కర్ణాటక, ఆవాహన్ నాట్యమంచ్-మహారాష్ట్ర (జాతుల పోరాటాలపై వీళ్లు, హర్యానా వాళ్లు కూడా సుదీర్ఘమైన పాటలు రాసారు) జమ్హోరే మోర్చా-పంజాబ్, జననాట్యమండలి, జనకళామండలి-ఆంధ్ర, మఖ్బూల్‌భట్ కమ్యూన్, ఢిల్లీ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

మూడోరోజు కాశ్మీర్, నాగా మొదలైన జాతుల విముక్తి పోరాటాలపై సదస్సు ముగియగానే ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. చొరవతో ఒక సమన్వయ సమావేశం జరిగింది. ఇక నుంచి ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్.తో వివిధ జాతుల పోరాట సంఘాలకు ఒక సమన్వయం వుండాలని, అందుకు ఆరంభంగా ఈరోజును (ఫిబ్రవరి 18) ఇకనుంచి సంఘీభావ దినంగా పాటించాలని నిర్ణయం జరిగింది. అలాగే నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో భగత్‌సింగ్ బాంబు విసిరిన ఏప్రిల్ 10న నల్లచట్టాల నిరసన దినంగా పాటించాలని నిర్ణయం జరిగింది. సమన్వయ కృషి జరగాలని ఏకగ్రీవ నిర్ణయమైంది.

ఆఖరి రోజున - జాతుల పోరాటాలపై నిర్బంధాన్ని ఖండిస్తూ, జాతుల పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ, సామ్రాజ్యవాద కుట్రలను దళారీ పాలకుల తాబేదారీతనాన్ని ఖండిస్తూ సభ తీర్మానాలను ఆమోదించి నాలుగురోజుల సదస్సును సమీక్షించుకున్న తర్వాత వేదికపైకి విదేశీ ప్రతినిధులు, జాతుల పోరాటాల ప్రతినిధులు, ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. కార్యవర్గం, ఆహ్వానసంఘ అధ్యక్షుడు, ఆహ్వానసంఘ స్థానిక కార్యనిర్వాహకవర్గం, వలంటీర్లు ఆహ్వానింపబడ్డారు. 'ఆవాజ్ దో హమ్ ఏక్ హై' వంటి నినాదాలతో, సంఘీభావ స్వరాలతో పాటలతో, చప్పట్లతో ఒకగంటకుపైగా హాల్ ఒక ఉత్తుంగతరంగాల ఆనందహేలలో తేలిపోయిన సముద్రంలా మైమరపించింది.

ఈ సదస్సు బీహార్ రైతాంగంపై జిల్లా కోర్టు విధించిన ఉరిశిక్షలను ధ్రువపరిచిన హైకోర్టు తీర్పును ఖండిస్తూ ఉరిశిక్షలు రద్దు చేయాలని డిమాండు చేసింది.

సదస్సు ముగిసింది. ప్రజల చరిత్ర, జాతుల విముక్తి పోరాటాలను, ప్రజల విప్లవ పోరాటాల్లో సంలీనం చేసుకుని ముందుకు సాగాల్సిన మహత్తర బాధ్యతను స్వీకరించింది. ❐

# చంద్రబాబు పాలన ఫాసిస్టురూపాన్ని బయటపెట్టిన పాలకుర్తి హత్యలు

ప్రజల సమస్యలను నిర్దిష్ట చర్యలు చేపట్టి పరిష్కరించడంగాక, కేవలం రాజకీయ జిమ్మిక్కులు, ఆకుకు అందని, పోకకు పొందని వాగ్దానాలతో కాలం గడుపుకొస్తున్న చంద్రబాబు కొత్త సంవత్సరాన్ని శ్రమదానం కార్యక్రమంతో ప్రారంభించాడు. చంద్రబాబు పాలనలో పోలీసులు మాత్రం పాలకుర్తిలో జనవరి 2 రాత్రి 9 నిండుప్రాణాలను నిర్దాక్షిణ్యంగా బలిగొని తమ నెత్తుటి దాహాన్ని తీర్చుకొని కొత్త సంవత్సరం ఎన్‌కౌంటర్ హత్యల కోటా ప్రారంభించారు. ప్రజలపైన నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపించి ప్రాణాలు బలిగొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజల కోపాగ్నిని చల్లార్చడానికి పోలీసుకాల్పులలో మరణించిన పాలకుర్తి గ్రామస్థులు ఐదుగురి కుటుంబాలకు లక్షరూ.ల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాడు. తాను వెనుకబడిపోతానేమోననే భయంతో హడావుడిగా పరిగెత్తుకొచ్చిన కేంద్ర కార్మికశాఖామంత్రి వెంకటస్వామి చనిపోయిన వారి భార్యలకు తన శాఖకింద వున్న ప్రభుత్వ వుద్యోగాలను ఇప్పించాడు. ప్రజలవద్దకు పాలన, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించి తన హయాంలో నిజమైన ప్రజా పరిపాలనను అందిస్తానని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు ప్రభుత్వ అసలు రూపం ఫాసిస్టు పాలనే అని, భూస్వామ్య పాలకవర్గాల కొమ్ముకాయడమేనని పాలకుర్తి సంఘటన బయటపెట్టింది. ముఖ్యమంత్రి, హోంమంత్రి కలిసి పోలీసులు సాధించిన ఈ పచ్చినెత్తుటి హత్యలను నిస్సిగ్గుగా సమర్థించడం, ఉత్తరతెలంగాణా జిల్లాలలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో ఉవ్వెత్తున కదులుతున్న ప్రజానీకాన్ని అణచివేసి భూస్వాముల అధికారానికి పట్టంగట్టి పదిలపర్చడానికి చేస్తున్న ప్రయత్నమే. ఈ హత్యలతో ప్రజలను భయభ్రాంతులను చేసి ప్రజా పోరాటాలను ఆపగలనని చంద్రబాబు ప్రభుత్వం కలలుగంటున్నది. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలన్ని మట్టికొట్టుకపోయిన సంగతి విస్మరిస్తున్నది. పాలకుర్తి నెత్తుటితడి ఆరకముందే వరంగల్ జిల్లా ఆసరవెల్లి వద్ద జనవరి 9న మరో ఐదుమంది గెరిల్లాలను పోలీసుమూకలు హత్యచేశాయి.

కరీంనగర్ జిల్లా రామగుండం మండలం, పాలకుర్తి గ్రామం నడిబొడ్డున రాత్రి 11.30 గంటలకు పోలీసు ఇన్‌ఫార్మర్ దాడిరాజయ్యపై ప్రజల సమక్షంలో పంచాయతీ నిర్వహిస్తున్న గెరిల్లా దళాన్ని మట్టుబెట్టే ప్రయత్నంలో రహస్యంగా అక్కడికి చేరుకున్న వందలాది పోలీసులు మేడపై నుండి విచ్చలవిడిగా జరిపిన కాల్పులలో నలుగురు దళసభ్యులు ఐదుగురు గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. ఎంతోమంది తూటాలుతగిలి గాయపడ్డారు. ప్రతిచోటా గెరిల్లాదళాలను కలువడానికి వచ్చి, దళాలు నిర్వహించే మీటింగులలో పెద్దఎత్తున పాల్గొంటున్న సామాన్య ప్రజానీకాన్ని భయభ్రాంతులనుచేసి గెరిల్లాదళాలకు ప్రజలను దూరం చేయాలన్న పిచ్చి ఆలోచనతో చంద్రబాబు ప్రభుత్వం, పోలీసులు జరిపిన ఈ హత్యాకాండ ప్రజలలో అంతకు పదిరెట్లు అసహ్యాన్ని కసిని కల్గించకమానదు. ఈ కాల్పులలో ఇద్దరు దళసభ్యులు నలుగురు గ్రామస్థులు అప్పటికప్పుడే ప్రాణాలు కోల్పోగా, గాయాలు తగిలి పడివున్న దళసభ్యురాలు కామ్రేడ్ పార్వతిని, మరో దళసభ్యుడిని తెల్లవారి గ్రామమంతా గాలిస్తున్న పోలీసులు పట్టుకొని పాశవికంగా కాల్చిచంపారు. కాల్పుల సమయంలో భయపడి పరిగెత్తి ఏదో ఒక ఇంటిలో తలదాచుకున్న మరో గ్రామస్థుడు ఉదయం తన ఇంటికి తిరిగివెళుతుండగా పోలీసులు అతనిని కూడా పట్టుకొని కాల్చిచంపారు. పోలీసులు హఠాత్తుగా దాడిచేసి జరిపిన మారణకాండలో ఆప్తబంధువులను కోల్పోయి, తూటాల గాయాలు తగిలి తమవారిని వెతుక్కునే అవకాశం కూడా లేక విలపిస్తున్న ప్రజలు, నెత్తుటిదారులు కట్టిన నేల, తూటాల తాకిడికి రంధ్రాలుపడిన గోడలతో నాజీలను మరిపించే ఫాసిస్టు దాడికి కకావికలమై తల్లడిల్లుతున్న పాలకుర్తి గ్రామాన్ని రాత్రికి రాత్రి సుమారు 600 మంది పోలీసులు దిగ్బంధించారు. తెల్లవారి ఇల్లిల్లు గాలిస్తూ ప్రజలను తిడుతూ కొడుతూ చిత్రహింసల పాల్జేశారు. తమ వారు చనిపోయిన వారిలో వున్నారో పారిపోయిన వారిలో వున్నారో తెలుసుకోవడానికి శవాలను చూడవచ్చిన మహిళలను పిల్లలను పోలీసులు తరిమి తరిమి కొట్టారు. ముందుగా అందుకున్న సమాచారంతో పకడ్బందీ వ్యూహంతో వచ్చిన పోలీసులు పాలకుర్తి గ్రామాన్ని స్మశానమయం చేశారు. రాబందుల రెక్కల చప్పుడుతో పాలకుర్తి తల్లడిల్లింది. ప్రాణ భయంతో బిక్కుప్రాణాలు చిక్కుపడ్డాయి. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు కరీంనగర్ ఎస్.పి. సురేంద్రబాబు పాలకుర్తిలో జరిగినవి ఎదురుకాల్పులని, నక్సలైట్ల కాల్పులలోనే ప్రజలు చనిపోయారని ప్రపంచాన్ని నమ్మించడానికి విఫలయత్నం చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రమంతటితోబాటు పాలకుర్తిలో కూడా రోజూ వుండే కరంటు కోత పోలీసులు దాడిచేసిన రోజు లేకపోగా, రాత్రంతా లైట్లు వెలుగుతూనే వున్నాయంటే, అధికారయంత్రాంగం యావత్తూ ఈ దారుణమారణకాండలో పకడ్బందీ వ్యూహంతో పాల్గొన్నదనీ, పాలకుల మద్దతు వారికి పూర్తిగా వున్నదనీ అర్థమవుతున్నది. వరంగల్ జిల్లా ఆసరవెల్లిలో పోలీసులు ఒక ఇన్‌ఫార్మర్ సహాయంతో అర్ధరాత్రి నిద్రిస్తున్న దళాన్ని చుట్టుముట్టి నిస్సిగ్గుగా కాల్పులు జరిపి ఐదుగురు కామ్రేడ్స్‌ను హత్యచేశారు. పాలకుర్తి, ఆసరవెల్లి సంఘటనలు చంద్రబాబు ప్రభుత్వం విప్లవోద్యమంపై కత్తిగట్టి, నిషేధం ఎత్తివేతమాటునే తీవ్ర నిర్బంధాన్ని అమలుజరుపుతున్నదని, ఎంతటికైనా తెగించి మట్టుబెట్ట ప్రయత్నిస్తున్నదని నిరూపిస్తున్నవి.

తన మామ ఎన్టీఆర్‌ను ఓడించడానికి, ప్రజలను మభ్యపెట్టడానికి ప్రారంభించిన ప్రజలవద్దకు పాలన ప్రహసనంగామారి నీరుకారి పోతున్న దశలో పరువుకాపాడుకోవడానికి చంద్రబాబు శ్రమదానం అంటూ మరొక జిమ్మిక్కు మొదలుపెట్టాడు. తానే స్వయంగా శ్రమదానంలో పాల్గొని బట్టనలగకుండా, అందించిన మట్టితట్టలను హారతిపళ్లెంలా పట్టుకొని రోజూ పేపర్లో ఫొటోలు వేయించుకున్నాడు. చంద్రబాబును అనుసరించిన పాలక ప్రతిపక్ష రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, సినీనటులు సూట్లు బూట్లు టాకుటీకులతో నల్లకళ్లద్దాలతో శ్రమదానం నాటకాన్ని రక్తికట్టించారు. కూలీ దొరకక కూడులేక అల్లల్లాడుతున్న గ్రామీణ ప్రజానీకం శ్రమదానం పేరుతో ప్రభుత్వానికి పైసా ఖర్చులేకుండా రోడ్లువేసి, కాలువలు తవ్వారు. రేపు

ఎన్నికల ప్రచారంనాటికి చంద్రబాబు అవి తన ప్రభుత్వ ఫలాలుగా ప్రచారం చేసుకుంటాడు. ఈ శ్రమదానం పథకంవల్ల జరిగిన పని విలువకన్నా అధికారుల ఆర్భాటానికి అయిన ఖర్చు ఎక్కువ అని పత్రికలు నోళ్లునొక్కుకున్నాయి. 10 లక్షల రేషన్‌కార్డులిస్తానని కోటి ఎకరాల అటవీభూములు ప్రజలకు పంపకం చేస్తానని ఓట్లు దండుకోవడానికి చంద్రబాబు బూటకపు వాగ్దానాలు చేస్తున్నాడు. గతంలో టిడిపి ప్రభుత్వాన్ని దొంగరేషన్ కార్డుల ఏరివేతపేర లక్షలాది పేదల నుండి రేషన్‌కార్డులు లాక్కున్నది. నేటికి కూడా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆక్రమించిన మూడున్నర లక్షల ఎకరాల భూమికి పట్టాలు ఇవ్వాల్సిందిపోయి పోలీసులను ప్రయోగించి భూస్వాములకు పట్టంగడుతున్నది. ప్రభుత్వం ఇప్పటికే మిగులుభూముల సేకరణకై కేటాయించిన 75కోట్ల రూ.లు భూములు కొనే పేర భూస్వాములకు అందించబోతున్నది. చంద్రబాబు పాలనలో కరెంటుకోత తప్ప మద్యనిషేధం ఉందన్న విషయం కూడా ప్రజలు మర్చిపోయారు. ఎక్కడ చూసినా సారా, మద్యం విస్తృతంగా లభిస్తున్నవి. ప్రజలవద్దకు పాలన సందర్భంగా అనేక గ్రామాలలో ప్రజలే స్వయంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ముందు చెప్పారు. శ్రమదానం సందర్భంగా నల్లగొండ జిల్లా ఇనుపాములలో జరిగిన సభలో ఒక వ్యక్తి విస్కీబాటిల్‌ను స్వయంగా ముఖ్యమంత్రికే అందించాడు.

ఈ ఎన్నికల జిమ్మిక్కులతో పీపుల్స్‌వార్‌పై నిషేధం లేదంటూనే చంద్రబాబు ప్రభుత్వం అమలుజరుపుతున్న నిర్బంధంతో రానున్న పార్లమెంటు ఎన్నికల వరకు గడుపుకవచ్చి ఆ తర్వాత తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించాలని చంద్రబాబు ప్రభుత్వం, పోలీసులు వేసిన పథకంలో భాగంగానే పాలకుర్తి హత్యలు జరిగాయి. ఇవి రాబోయే ఫాసిస్టు పాలనకు సూచికలు మాత్రమే. కాంగ్రెస్(ఐ), తెలుగుదేశం పార్టీలలో ఏది అధికారంలో వున్నప్పటికి ఏ ముఖ్యమంత్రి అధికారంలో ఏ మాటలు చెప్పినప్పటికీ నిర్బంధమే నిత్యంగా, నిజంగా అమలుజరుగుతున్నది. ఎన్టీఆర్ అప్రకటిత నిషేధం కాలంలోనైనా, చెన్నారెడ్డి నిర్బంధ సడలింపు కాలంలోనైనా, జనార్ధన్‌రెడ్డి నిషేధం విధించినప్పుడైనా, తిరిగి ఎన్టీఆర్ చంద్రబాబులు నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసిన కాలంలోనైనా అంతిమంగా అమలుజరుగుతున్నది ఫాసిస్టు పోలీసుపాలనే. ఈ ప్రభుత్వాలేకాదు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చే ఏ ప్రభుత్వమైనా అది భూస్వామ్య బూర్జువా వర్గాలకే సేవ చేయకతప్పదు. ఆ పార్టీలు నిండివున్నది ఆ వర్గాలవారితోనే, సేవ చేసేది ఆ వర్గాల కొరకే. అధికారంకోసం దేనికైనా తెగించగల్గిన చంద్రబాబు తన అధికారం భూస్వామ్యవర్గాల పట్టు నిలబెట్టడం కోసం ప్రజాపోరాటాలను అణచకమానడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి ప్రజల రాజకీయ అధికారాన్ని నెలకొల్పడానికి ఎర్రసైన్యాన్ని నిర్మించి నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకై పోరాడడమే ప్రజల ముందు వున్న కర్తవ్యం. ❑

## ప్రజావిముక్తిలో మృత్యుంజయులు !

# పాలకుర్తి, ఆసరవెల్లి అమరవీరులకు జోహార్లు !!

**పాలకుర్తి అమరులు :**

1996 జనవరి రెండవ తేదీన రాత్రి 11 గంటలకు పాలకుర్తి గ్రామంలో ప్రజాపంచాయతీ జరుపుకుంటున్న ప్రజలు, దళంపై దొంగచాటుగా వచ్చిన పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 9మందిని పొట్టన పెట్టుకున్నారు. ఇందులో ప్రచార దళసభ్యులు ముగ్గురు, దళసభ్యురాలు ఒకరితోపాటు ఐదుగురు సాధారణ ప్రజలు అసువులుబాశారు.

విప్లవోద్యమాన్ని నిర్బంధం, నిషేధాలతో అణచివేయజూచిన పాలకవర్గాలకు ఎండమావులే ఎదురయ్యాయి. భూస్వాముల భూ ఆక్రమణ పోరాటాలేకాదు, గ్రామాలపై రాజ్యాధికారం సాధించే దిశగా గ్రామకమిటీల నిర్మాణాలవైపు, సర్వాధికారాలు తమ చేతుల్లోకి తీసుకునే చైతన్యంతో గెరిల్లా యుద్ధం వైపు ప్రజలు ముందుకు నడుస్తున్నారు. ప్రజా పోరాటాల ధాటికి తట్టుకోలేక పార్టీపైన, ప్రజాసంఘాలపైన ఒకవైపు నిషేధం ఎత్తివేస్తున్నామంటూనే ప్రజలపైన విచ్చలవిడిగా కాల్పులతో హత్యాకాండను కొనసాగిస్తూ బరితెగించిన బీభత్సాన్ని తెలుగుదేశం ప్రభుత్వ కొనసాగిస్తూంది. అందులో భాగమే జనవరి 2న ప్రజాపంచాయతీ జరుపుతున్న ప్రజలపై పోలీసుల పైశాచిక కాల్పులు. కాల్పుల్లో అమరులయిన కామ్రేడ్స్ అందరికీ విప్లవ జోహార్లర్పిద్దాం! వారి ఆశయ సాధనలో ఉత్తర తెలంగాణాను బలమైన గెరిల్లాజోన్ చేద్దాం.

కామ్రేడ్ ప్రవీణ్ (కొండమల్లేశ్, 28 సం॥లు) కరీంనగర్ జిల్లా రామగుండం మండలం, మురుమూరు గ్రామంలో ఎల్లాపు కులానికి చెందిన పేద కుటుంబంలో జన్మించాడు. నలుగురు చెల్లెళ్ళకు తోడుగా ఒక్కడే అన్నగా వుండడంవల్ల కుటుంబ బాధ్యత ప్రధానంగా ఇతనిపైనే వుండేది. 5వ తరగతిలోనే చదువు ఆపాల్సివచ్చింది.

కా॥ ప్రవీణ్ '93 మధ్యలో పార్టీ సంబంధాల్లోకి వచ్చాడు. అనతికాలంలోనే '94లో యూత్‌కు ఏర్పాటు చేసిన మిలిటరీ క్యాంపుకు హాజరై, తర్వాత తన గ్రామంలో వున్న మిలిటెంట్స్‌కు మిలిటరీ విషయాలను నేర్పడానికి ప్రయత్నించాడు. కూలీ, జీతాల పోరాటాల నుండి భూస్వాముల భూములు ఆపడం వరకు ప్రతి పోరాటంలో పాల్గొన్నాడు. గ్రామంలో ఆర్.వై.ఎల్., ఆర్.సి.ఎస్.లను నిర్మాణం చేశాడు. క్రమక్రమంగా రాజకీయంగా అభివృద్ధి అవుతూ ప్రజలను కూడగట్టడం, శత్రువును ఎదుర్కోవడంలో ప్రజల పాత్ర పెంచడం, ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం ప్రవీణ్ చాలా కృషిచేసి సాధించుకోగలిగాడు. సర్పంచ్ ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, గ్రామానికి వచ్చే రోజ్‌గార్ నిధులు స్వాహా చేస్తుంటే ప్రజలకు అర్థం చేయించి ప్రజల్లో నిలదీయడంలో ముందున్నాడు. తన పెద్దనాన్న భూస్వామి, పెత్తందారి, ఇన్‌ఫార్మర్ కావడంతో అతడిని ప్రజల్లో పెట్టి శిక్షించి ''రక్త సంబంధంకన్న వర్గ సంబంధం మిన్న'' అనే విషయాన్ని ఋజువు చేశాడు.

శత్రువు అతడి కోసం వేటాడుతున్నప్పటికీ ప్రజల్లో కలిసిపోతూ, ఒంటరిగా రహస్య ప్రదేశాల్లో ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటూ శత్రువుకు చిక్కకుండా తప్పుకోగలిగాడు. ప్రజలతో విస్తృత సంబంధాలు ఏర్పర్చుకుంటూ, సమస్యలు పరిష్కరిస్తూ సెల్ సెక్రటరీగా ఎదిగి క్రమంగా '95లో ఏరియా ఆర్వైఎల్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. పార్టీ అప్పగించిన బాధ్యతలను, కార్యక్రమాలను సహనంతో కొనసాగించేవాడు. చెల్లెండ్ల పెళ్ళిళ్ల తర్వాత పార్టీలోకి పూర్తికాలం వస్తానని రహస్యంగా వుంటున్నాడు. శత్రువు కేంద్రీకరణ ఎక్కువ కావడంతో 5, 6 గ్రామాలలో ప్రజా సంబంధాల్లో వుంటూ యీ క్రమంలో దళంతోబాటు 1996 జనవరి 2న పాలకుర్తి మీటింగులో పాల్గొని శత్రువు జరిపిన కాల్పుల్లో గాయపడి కదలలేని స్థితిలో వున్న కా॥ ప్రవీణ్‌ను పోలీసులు తెల్లవారి జనవరి 3న గోడకు నిలబెట్టి ప్రజల ముందే కాల్చి చంపారు. కా॥ ప్రవీణ్ గెరిల్లా యోధుడిగా ఎదిగిన తీరు, ప్రజల విశ్వాసం పొందడం కోసం చేసిన కృషి, నిర్మాణాలపై కేంద్రీకరించిన పట్టుదల మనకందరికీ ఆదర్శం.

**కామ్రేడ్ పార్వతక్క** (రమక్క, 18 సంవత్సరాలు) ముత్తారం మండలం బేగంపేట గ్రామానికి చెందిన ఒక నిరుపేద తెనుగు కుటుంబంలో జన్మించింది. గ్రామంలో జరుగుతున్న పోరాటాలను చూసి ఆకర్షితురాలై 1992లో దళానికి పరిచయమైంది. గ్రామంలో సారాకు వ్యతిరేకంగా మహిళలను కదిలించి సారా పోరాటానికి నాయకత్వం వహించింది. సంఘంలో అనేకమంది మహిళలను కూడగట్టింది. దళం ఎప్పుడు ఏ పని చెప్పినా ఎలాంటి జంకులేకుండా పనిచేసేది. రాత్రి సమయాలలో కూడా దళం వద్దకు వచ్చేది. పూర్తి కాలం పనిచేయడానికి సిద్ధపడగా పార్టీ అవసరాల రీత్యా 1995 నవంబరు నెలలో పెద్దపల్లి దళానికి పంపడం జరిగింది. వరద బాధితుల సహాయనిధి కోసం ప్రచారం చేయడంలో భాగంగా దళంతోపాటు వెళ్లి పాలకుర్తిలో ప్రజాకోర్టు నిర్వహిస్తుండగా పోలీసులు విచ్చలవిడిగా జరిపిన కాల్పులలో కా॥ పార్వతక్క గాయపడి, రోడ్డుపై పడివుండగా, పోలీసులు తెల్లవారి కాల్చి హత్యచేసారు.

**కామ్రేడ్ బాలన్న** (25 సం॥లు) కరీంనగర్ జిల్లా రామగూడెం, మురుమూరు గ్రామ నివాసి. బాలన్న తెనుగు కులానికి చెందిన పేదరైతు కుటుంబంలో జన్మించాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

చుట్టూ గ్రామాలలో జరుగుతున్న పోరాటాలు, గ్రామంలో భూస్వామికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంతో ఉత్తేజితుడై 1992లో పార్టీ సంబంధాల్లోకి వచ్చి గ్రామంలో జరిగే పోరాటాలలో చురుకుగా పాల్గొని నడిపించడంలో ప్రధాన పాత్ర వహించాడు. నిర్బంధం కారణంగా 1994లో సరెండర్ అయి మామూలుగా బ్రతుకుతున్నప్పటికి శత్రువు వేధించడం అధికం కావడంతో తిరిగి 1995లో మళ్లీ పార్టీ సంబంధాలలోకి వచ్చాడు. 1995 నుండి జరిగే ప్రతి పోరాటంలో కామ్రేడ్ ప్రవీణ్‌తోపాటు పాల్గొంటూ ఆర్ఎస్‌ఎస్ నిర్మాణానికి బాధ్యత వహించాడు. ఆర్ఎస్‌ఎస్ కార్యదర్శిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. గ్రామసెల్ మెంబర్‌గా ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నాడు. ఈ క్రమంలో దళం వెంట జనవరి 25న పాలకుర్తిలో నిర్వహించిన మీటింగులో పాల్గొని శత్రువు మూకుమ్మడిగా జరిపిన కాల్పులలో అమరుడయ్యాడు.

**కామ్రేడ్ బొక్కం రమేష్** (20 సంవత్సరాలు) కరీంనగర్ జిల్లా, రామగుండం మండలం, కుక్కలగూడూరు గ్రామానికి చెందిన పేద దళిత కుటుంబంలో జన్మించాడు. గ్రామాలలో జరుగుతున్న పోరాటాలకు ఉత్తేజితుడై, పార్టీని కలవడం కోసం ప్రయత్నించాడు. అతడెంత ప్రయత్నించినప్పటికీ అతడి అన్న ఒక రేప్ కేసులో వుండడంతో మనవాళ్లు కలవలేదు. అయినప్పటికీ మరింత పట్టుదలతో ప్రయత్నిస్తూ, "కుటుంబం ఒకటైనప్పటికీ, అతని విషయాన్ని నాకు జోడించవద్దు" అని కోరాడు. అతని పట్టుదలను చూసి సంఘ సభ్యుడుగా చేర్చుకున్నారు. కుటుంబ సభ్యులు బొంబాయి వెళుతున్నప్పుడు వారితో పోకుండా పార్టీలో పని చేయడానికి వుండిపోయాడు. పట్టుదలతో కార్యాన్ని సాధించడానికి ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొనడానికి సిద్ధపడే అతని పట్టుదల మనకు ఆదర్శనీయం.

పెద్దపల్లి తాలుకాలో విప్లవోద్యమ గ్రామాలలో తలమానికంగా వున్న పోరుగడ్డ పాలకుర్తి గ్రామ బిడ్డలు **పాపిడి రాజయ్య, దుర్గంబాబు, దుర్గం కిష్టయ్య, ముదాం శంకర్, సోమిశెట్టి కనకయ్యలు** ఈ కాల్పుల్లో అమరులయ్యారు. వర్గపోరాటాల రాజకీయాలతో రాటుదేలుతున్న పోరు బిడ్డలైన రాజయ్య, బాబు, కిష్టయ్య, శంకర్, కనకయ్యలు ప్రజాపంచాయతీలో తమ అభిప్రాయాలు వెలిబుచ్చడానికి వచ్చి పోలీసుల తూటాలకు బలిఅయ్యారు.

**ఆసరవెల్లి అమరులు :**

వరంగల్ జిల్లాలో రివిజనిస్టు కంచుకోటగా వున్న నర్సంపేట ప్రాంతంలో సిపిఎం, ఎంసిపిఐ, ప్రజాపంథా సాయుధ గూండాలను ఎదుర్కొంటూ, రివిజనిస్టు కంచుకోటను బద్దలుకొట్టి నర్సంపేటను విప్లవకోటగా మార్చిన నర్సంపేట దళానికి నాయకుడు ఆ ప్రాంత ప్రజల ముద్దుబిడ్డ కామ్రేడ్ వెంకన్న (గోపన్న) పర్కాల సింహం లచ్చన్నలతోపాటు మరో ముగ్గురు దళసభ్యులు పోలీసు కాల్పులలో అసువులుబాసారు. జనవరి 8న రాత్రి ఆసరవెల్లి అడవిలో దళం మకాం వేసినట్లుగా ఒక ద్రోహి ద్వారా సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఆ రాత్రే దాదాపు 150మంది దళాన్ని చుట్టుముట్టి తెల్లవారుతుండగా 6గంటల ప్రాంతంలో ఇంకా నిద్ర నుండి పూర్తిగా మేల్కొని స్థితిలో దళంపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి 5గురిని పొట్టనబెట్టుకున్నారు. నేలతల్లి విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరులకు వినమ్రంగా తలవంచి జోహార్లర్పిద్దాం. ఆసరవెల్లి సంఘటనలో అమరులైన కామ్రేడ్స్ పట్టుదల, త్యాగం, దృఢదీక్ష మరవరానిది. వారి ఆశయ సాధన కోసం తుదికంటా పోరాడదామని ప్రతినబూనుదాం.

**కామ్రేడ్ గోపన్న** (కోడి వెంకన్న) ఖానాపూర్ మండలం బుధరావుపేట గ్రామస్థుడు. మధ్యతరగతికి చెందినవాడు. వెంకన్న అన్నలు సంఘంలోచేరి పనిచేస్తే చిన్నతనంలోనే దళానికి తిండి తీసుకెళ్లడంతో వెంకన్న విప్లవ జీవితం ప్రారంభమైంది. కా॥ వెంకన్న పిల్లలతో ఆడుతూ పాడుతూ వారిని బాలలసంఘంలో చేర్పించాడు. 1985 నుండి కొనసాగిన తీవ్రనిర్బంధంలో సంఘాలు దెబ్బతిని పోయినా గ్రామంలోని యువకులను చేరదీసి వారికి రాజకీయాలు బోధించేవాడు. గ్రామ సమస్యలను పట్టించుకోవడంలో వెంకన్న

ముందుండేవాడు. గ్రామ పెత్తందార్లైన లక్ష్మణరావు, MCPI కార్యకర్తలు వెంకన్నపై పోలీసులకు సమాచారం అందించడంతో కా॥ వెంకన్న కోసం గాలింపులు ఎక్కువైనాయి. కా॥ వెంకన్నను 1988లో అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టి జైలుకు పంపినారు. కా॥ వెంకన్న పట్టుదలతో నిలచి, జైలు నుండి బయటకు వచ్చి మళ్లీ సంఘ కార్యక్రమాలు కొనసాగించాడు. ఖానాపురం మండలంలో 'ప్రజాపంథా' వాళ్లు విస్తరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు కాని అది వారికి సాధ్యంకాలేదు. '85లో తీవ్ర నిర్బంధంవల్ల సంఘాలు దెబ్బతిని పోవడం, సంఘనాయకులు సరెండర్ కావడంతో 'ప్రజాపంథా' మరోసారి ప్రయత్నం చేసినా వారి ప్రయత్నాన్ని కా॥ వెంకన్న త్రిప్పికొట్టి స్థానం లేకుండా చేశాడు. దీనితో రెచ్చిపోయిన 'ప్రజాపంథా' దళాలు వెంకన్నను పట్టుకొని కొట్టడానికి ప్రయత్నాలు చేశాయి.

కా॥ వెంకన్న కృషిమూలంగా ఖానాపురం మండలంలో సంఘాలు బలపడినాయి. విస్తృతంగా రైతాంగంలో సంబంధాలు ఏర్పడినాయి. '90 వెసులుబాటు కాలంలో వెంకన్న క్యాంపెయిన్ చేసి రైతుకూలీ మహాసభకు ప్రజలను కదిలించాడు. 1991లో రైతుకూలీలను కూడగట్టి తన స్వగ్రామంలోనే MCPI అండతో తిరుగులేని దోపిడీ కొనసాగిస్తున్న భూస్వాముల భూములను ఆక్రమించుకోడానికి నాయకత్వం వహించాడు. ఎర్రజండాలతో ఊరేగింపుగా రైతుకూలీలు భూస్వాముల భూముల్లో జండాలు పాతడానికి వెళ్లగా భూ ఆక్రమణను అడ్డుకోవడానికి వచ్చిన పోలీసులు కాల్పులు జరిపినా ప్రజలకు ధైర్యంచెప్పి, జండాలు పాతించాడు. MCPI, కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల నాయకులు పోడు భూమిని నరికించి పేద ప్రజలకు పంచడంలో అవకతవకలు చేసి భూమిగల మధ్యతరగతి, ధనిక రైతులకు పంచి ఎక్కువ భూమి వారు తీసుకోగా వారి విధానాలను ఎండగట్టి, నిరుపేదలకు పంచినాడు. బుధరావుపేట, మనుబోతుగడ్డ మధ్యగల పోడు భూమి తగాదాలో MCPI నాయకులు అవకాశవాదంతో ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణకు దించగా ఘర్షణను నివారించడానికి వెళ్లిన వెంకన్ననే మనుబోతుగడ్డల వాళ్లు కొట్టారు. తర్వాత ఆ భూమి తగాదాను పరిష్కరించి 'తన బావదే తప్పు' అని చెప్పి తీర్పు ఇవ్వడంతో మనుబోతుల గడ్డలవాళ్లు గోపన్నను కొట్టినందుకు బాధపడ్డారు. 'రక్త సంబంధంకన్న వర్గ సంబంధమే గొప్పది' అని కా॥ వెంకన్న నిరూపించాడు. కూలీరేట్లు, పాలేర్ల జీతాలపెంపుదల కోసం జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించాడు. గ్రామంలో లంపెన్‌గా తిరుగుతూ మహిళలను వేధించిన వారికి తగిన బుద్ధి చెప్పి సరిదిద్దాడు. రోజ్‌గార్ నిధులను మింగిన గ్రామసర్పంచ్‌ను ప్రజల ముందు నిలదీసాడు. అక్రమంగా తిన్న డబ్బును వాపస్ ఇప్పించాడు. గ్రామాభివృద్ధి కోసం కమిటీని ఏర్పాటుచేసి నీళ్లటాంకు, రోడ్లు, సైడ్ కాలువలు తీయించడానికి నాయకత్వం వహించి పూర్తి చేయించాడు. 1991లో ఖానాపూర్ రైతాంగ సమస్యలపై ధర్నాకు నాయకత్వం వహించి వేలాదిమంది రైతాంగాన్ని కదిలించాడు. బుధరావుపేట చుట్టుపట్ల గ్రామాలలో ప్రతి పంచాయతీలో పాల్గొని తీర్పులు చెప్పి ప్రజల మధ్య వైరుధ్యాలను పరిష్కరించాడు. గ్రామ పెత్తందార్ల, రాజకీయ నాయకుల, అవినీతి, లంచగొండితనానికి కళ్లెంవేసినాడు. దీనితో రెచ్చిపోయిన MCPI, కాంగ్రెస్, తెలుగుదేశం లీడర్లు, పెత్తందార్లు పోలీసులకు సమాచారం అందించడంతో ప్రజాపంచాయతీలో తీర్పు చెప్తున్న వెంకన్నపై కాల్పులు జరపగా వెంకన్న తప్పుకొని వెళ్లిపోయాడు. తీవ్ర నిర్బంధం మధ్య పోలీసుల కళ్లుగప్పి తిరిగేవాడు.

కొత్తగూడెం మండలంలో 'ప్రజాపంథా' ముఠా కొనసాగిస్తున్న తప్పుడు విధానాలను ఎండగడుతూ విస్తృతంగా ప్రచారంచేసి ప్రజలను కూడగట్టడంలో తీవ్రమైన కృషి చేశాడు. కొత్తగూడెం మండలంలో తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని భావించిన 'ప్రజాపంథా' ముఠా దళాలు క్యాంపెయిన్ దళాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నాలు చేసారు. చివరకు క్యాంపెయిన్ దళసభ్యుడు కామ్రేడ్ రాజంకోటన్న ఇంటికి వెళుతుండగా పట్టుకొని కాల్చి చంపి శవాన్ని మాయం చేశారు. కా॥ రాజం కోటన్న మరణవార్త విన్న కా॥ వెంకన్న మరింత పట్టుదలతో తిరిగాడు. తనకు తెలిసిన పరిజ్ఞానంతో గ్రనేడ్స్ చేసుకుని 'ప్రజాపంథా' దళాల ఆటకట్టించాడు. అవకాశవాదులైన 'ప్రజాపంథా' ముఠా ధర్మారావుపేటలో కమలాకరరావు భూస్వామి పంచన చేరి ఆర్వైఎల్ సంఘాన్ని దెబ్బతీయడానికి పూనుకున్నారు. పార్టీ సానుభూతిపరుడు ఇంతిల సోమిరెడ్డి ప్రజాపంచాయతీలో కమలాకరరావు తప్పులను బయటపెట్టడంతో ఇంతిల సోమిరెడ్డిని చంపడంతో, 'ప్రజాపంథా' అవకాశవాద విధానాలను బహిర్గతం చేసి కమలాకరరావును మట్టుబెట్టిన ధీరుడు, కా॥ వెంకన్న. ఇటు భూస్వాములకు, మరోప్రక్క 'ప్రజాపంథా' ముఠాకు కా॥ వెంకన్న సింహస్వప్నంగా మారాడు.

కా॥ వెంకన్న 1991 చివరలో దళంలో సభ్యుడుగా చేరాడు. దళంలో సభ్యుల ఆదరాభిమానాలు చూరగొన్నాడు. ఏరియా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో వెంకన్న పాత్ర ఎంతో వుంది. BSF బలగాల దాడిలో ఎంతో నిబ్బరంగా వుండేవాడు. అలుపెరగనివాడు. బాధ్యతాయుతంగా పనులు మీద వేసుకుని చేసేవాడు. ఏరియా ఉద్యమంలో వస్తున్న సమస్యలను అర్థం చేసుకొని వాటిని పరిష్కరించడానికి దళంలో సెల్‌కు సహాయపడేవాడు. కా॥ వెంకన్న (గోపన్న)ను 1992 మధ్యలో SAC సభ్యుడిగా తీసుకోవడం జరిగింది. కా॥ వెంకన్న తోటి సభ్యుల తప్పులను ఎత్తిచూపుతూ చాలా ఓపికతో సరిదిద్దేవాడు.

కా॥ గోపన్న 1994 జనవరిలో కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. కా॥ గోపన్న ఎప్పుడూ చిరునవ్వుతో అందరినీ నవ్విస్తూ ఉత్సాహపరిచేవాడు. పార్టీ పాలసీని అమలు చేయడానికి తీవ్రమైన కృషి చేసేవాడు. దళ సమావేశాల్లో, SAC సమావేశాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా మాట్లాడేవాడు. తన తప్పులను ఎదుటివాళ్లు సూచిస్తే వెంటనే సరిదిద్దుకునేవాడు. ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం తలపెట్టిన దాడిని తిప్పికొట్టడానికి ప్రజలను ప్రతిఘటనకు సిద్ధం చేశాడు. పరమ కిరాతకుడు సి.ఐ.రామయ్య నర్సంపేట ఏరియాలో ఉద్యమాన్ని దెబ్బతీయడానికి యువకులను పట్టుకెళ్లి కాల్చిచంపి భయానక వాతావరణం కలిగించడానికి పూనుకోగా నర్సంపేట పోలీస్‌స్టేషన్ పేల్చివేయడానికి కా॥ గోపన్న నాయకత్వం వహించాడు. ప్రజా పీడకుడైన MCPI నాయకుడు కర్నెసాంబయ్యను మట్టుపెట్టినాడు. ఇన్‌ఫార్మర్స్‌పై కన్నుపెట్టి మట్టుబెట్టినాడు. పోలీసుల దన్నుతో భూస్వాములు ప్రజలు ఆక్రమించుకున్న భూములను సాగు చేయగా ప్రజలను సంఘటితంచేసి భూస్వాముల ఇండ్లను పేల్చివేయించాడు. నిర్బంధాల

మధ్య ప్రజలను తిరిగి భూమి ఆక్రమించుకోవడానికి సిద్ధం చేసి మేడపల్లిలో భూస్వాముల భూములను పంపిణీ చేసాడు. 1993లో భూపాలపల్లి వద్ద మందుపాతర పేల్చడంలో పాల్గొన్నాడు. తను ఇంటివద్ద వున్నప్పుడే భూస్వాముల వద్ద వున్న ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో పాల్గొన్నాడు. రాజకీయ చర్చల్లో చురుకుగా పాల్గొనేవాడు. 1995 జిల్లా కాన్ఫరెన్సులో చురుకుగా పాల్గొని పార్టీ డాక్యుమెంట్లను చర్చించాడు. పెరుగుతున్న ఉద్యమానికి అనుగుణంగా ఎదగాలనే ఆరాటంతో వుండేవాడు. యువకులకు రాజకీయ క్లాసులు చక్కగా బోధించేవాడు.

కా॥ గోపన్న ప్రజలకు తలలోని నాలుక, ప్రేమపాత్రుడు. శత్రువులకు ప్రక్కలో బల్లెంలాంటివాడు. కా॥ గోపన్న మరణవార్త విన్న ప్రజలు శవయాత్రలో వేలాదిగా పాల్గొని విప్లవగీతాలు పాడుతూ అమరుల ఆశయాలు కొనసాగిస్తాం అని ముక్తకంఠంతో నినదించారు. కామ్రేడ్ గోపన్న పట్టుదల, త్యాగం, ఓపిక మనకెంతో ఆదర్శం.

కామ్రేడ్ లచ్చన (నమ్మన్న) పర్కాల మండలం ధర్మారం నివాసి. నిరుపేద కుటుంబంలో పుట్టినాడు. కా॥ లచ్చన్న చిన్ననాటినుండే జీతం ఉండి రెక్కలు ముక్కలు చేసుకుని ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. ధర్మారంలో పింగలి భూస్వాముల దౌర్జన్యాలకు, వేధింపులకు గురికాని కుటుంబంలేదు. అందులో లచ్చన్న కుటుంబం కూడా ఒకటి. పర్కాల ప్రాంతంలో పోరాటం తీవ్రతరం కావడంతో భూస్వాముల గుండెల్లో రైళ్లు పరుగెత్తి పట్టణాలకు పరుగుతీశారు. 1987 నుండి 1990 వరకు పర్కాల ప్రాంతంలో మన ఆర్గనైజేషన్ ప్రారంభం కావడంతోనే కా॥ లచ్చన్న పార్టీ సానుభూతిపరుడుగా వుంటూ దళానికి షెల్టరు ఏర్పాటు చేస్తూ వుండేవాడు. కా॥ లచ్చన్న గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైనాడు. అయినప్పటికీ గ్రామంలోని పెత్తందార్లు, భూస్వాములు ఎవ్వరూ నిలవనీయకపోయేవారు. హీనంగా చూసేవారు. దీన్ని భరించలేని లచ్చన్న క్రమంగా సంఘంలో చేరి పని చేయడం ప్రారంభించాడు. భూస్వాముల భూములు ఆక్రమించుకోవడంలో ప్రజలను కదిలించాడు. క్రమంగా నిర్బంధం పెరగడంతో భార్యాపిల్లలను వదిలిపెట్టి 1992లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. పర్కాల మండలంలో సాయుధ ప్రచార దళంలో సభ్యునిగా తిరుగుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేవాడు. చదువు రాకపోయినా తనదైన శైలిలో రైతులకు రాజకీయాలు చెప్పి అందరిని ఆకట్టుకునేవాడు. 1993లో పర్కాల దళ సభ్యునిగా చేరాడు. క్రమంగా కా॥ లచ్చన్న 1994 నవంబరులో SAC సభ్యుడయ్యాడు. పర్కాల ప్రాంతంలో ప్రజలకు తలలోని నాలుకగా అయ్యాడు. ప్రజల సమస్యలు చెప్పినప్పుడు వెంటనే స్పందించేవాడు. పర్కాల దళం దాడులు జరిగి నష్టాలకు గురైతే దళానికి పైలట్‌గా వుండి ఆ కామ్రేడ్స్‌లేని లోటు తీర్చాడు. నిర్బంధానికి జడిసి లొంగిపోతున్న వారిని చూసి బెంబేలెత్తకుండా పట్టుదలతో వుండేవాడు. కా॥ లచ్చన్నను '95 నవంబరులో నర్సంపేట దళంలోకి మార్చడం జరిగింది. దళంలో సభ్యుల ఆదరాభిమానాలు చూరగొన్నాడు.

కామ్రేడ్ రామన్న (కొలువుల కిష్టన్న) దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామస్థుడు. తెనుగు కులానికి చెందిన పేద కుటుంబంలో పుట్టి పెరిగాడు. గ్రామంలో CPI, MCPI పార్టీల తప్పుడు విధానాలను వ్యతిరేకిస్తూ యూత్‌ను కూడగట్టాడు. మన పార్టీ మీటింగులు ఎక్కడ జరిగినా వెళ్లేవాడు. RYL సంఘంలో చేరి పని చేయడం ప్రారంభించాడు. CPI, MCPI అవినీతిని, గూండాయిజాన్ని ఎదిరించడంలో ముందునిలిచాడు. CPI, MCPI పార్టీలు వర్గపోరాటాన్ని నీరుగార్చి, ఎర్రజెండాకు అపఖ్యాతి తెస్తున్నారని 1985 మేడే నాడు కా॥ రామన్న నాయకత్వంలో ఎర్రజెండాను ఎత్తి ఊరేగింపు తీశారు. ఇది సహించలేని CPM, MCPI గూండాలు జండాను తీయడానికి రావడంతో వాళ్లను ఎదిరించి, జెండా పీకే హక్కులేదని ఎదురు నిలబడడంతో పలాయనం చిత్తగించారు.

కా॥ రామన్న 1985నాటి తీవ్ర నిర్బంధ కాలంలో ధైర్యంగా పనిచేశాడు. గ్రామంలో యూత్‌ను చేరదీసి గ్రామ కూడలిలో విప్లవ గీతాలు పాడుతూ ప్రజలకు CPM, MCPI తప్పుడు విధానాలు వివరించి సంఘంలో చేర్చడానికి తీవ్రమైన కృషి చేశాడు. కా॥ రామన్న అంటేనే MCPI గూండాలకు హడలెత్తేది. రామన్నకు చదువు రాకపోయినా పార్టీ పత్రికలు చదివించుకునేవాడు. కా॥ రామన్న నాచనపల్లి ఎన్‌కౌంటర్‌కు కారకుడైన చంద్రమౌళిని మట్టుబెట్టడానికి తీవ్రమైన కృషి చేశాడు. కామ్రేడ్ రాజేందర్‌ను పట్టుకొని కొట్టి చంపిన బిక్కాసిపల్లి మల్లయ్యను చంపడంలో రామన్న వున్నాడు. MCPI నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చి రామన్నను అనేకసార్లు అరెస్టు చేయించారు. పోలీసులు అనేక చిత్రహింసలు పెట్టినా పట్టుదలతో పనిచేశాడు. 1990 వెసులుబాటు కాలంలో రైతాంగాన్ని కూడగట్టి మండల ధర్నాలకు కదిలించడంలో ముందుపీఠిన నిలబడ్డాడు. 1991 నిర్బంధ కాలంలో పోలీసులు అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టి జైలుకు పంపారు. కా॥ రామన్న 1993 నుండి 1995 జనవరి వరకు జైలు జీవితం గడిపినాడు. కా॥ రామన్న జైల్లో కూడా పట్టుదలతో పనిచేశాడు. జైలు పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నాడు. కా॥ రామన్న జైల్లోనే చదువు నేర్చుకున్నాడు. కా॥ రామన్న జైలునుండి రాగానే పార్టీ సంబంధాల కోసం ప్రయత్నం చేసి పూర్తికాలం కార్యకర్తగా 1995 ఫిబ్రవరిలో దళంలో చేరాడు. శత్రువు పెట్టిన చిత్రహింసలకు అనారోగ్యంగా వున్నా దళంలో పని విధానానికి ఆటంకం కలగకుండా వుండేవాడు. కా॥ రామన్న పాటలుపాడి అందరినీ ఆనందపరిచేవాడు. కా॥ రామన్నకు ఇంటివద్ద వుండగానే వివాహం చేసుకున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు. కా॥ రామన్న పట్టుదల, దీక్ష మనకెంతో ఆదర్శం.

కామ్రేడ్ రమణ కూడా తొగర్రాయి గ్రామస్థుడే. కా॥ రమణ (కుమారస్వామి) మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. కా॥ రమణ వ్యవసాయం చేసుకుంటూ గొర్లు కాసేవాడు. చిన్నతనంలో తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యతలు మీద వేసుకున్నాడు. గ్రామంలో సిపిఐ, ఎంసిపిఐ వాళ్ల అవినీతిని వ్యతిరేకిస్తూ రామన్నతో కలిసి పనిచేసేవాడు. పార్టీ ఇచ్చిన ప్రతి పనిని బాధ్యతాయుతంగా చేసేవాడు. కా॥ రమణ ఇంటివద్ద వున్నప్పుడే పార్టీ సభ్యత్వం పొందాడు. 1991 నుండి శత్రువు కొనసాగించిన తీవ్రమైన నిర్బంధం, హత్యాకాండ వల్ల సరెండర్ అయినాడు. దాదాపు ఆరునెలల కాలం జైలు జీవితం గడిపినాడు. తాను శత్రువుకు లొంగిపోవడం తప్పుగా భావించి జైల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. కా॥ రమణ జైలు నుండి విడుదలై రాగానే పార్టీ సంబంధాల కోసం ప్రయత్నం చేశాడు. పోలీసులు రమణను ప్రతిరోజు కండీషన్‌కు

రావాలని లేకుంటే చంపివేస్తామని బెదిరించేవారు. అయినా కూడా పోలీసుల బెదిరింపులు లెక్కచేయక కండీషన్ ఎగ్గొట్టి కా॥ రమణ 1992 మధ్య నుండి పార్టీ కాంటాక్ట్‌కు వచ్చి దుగ్గొండి మండలంలో పోలీసు నిర్బంధం వల్ల చెదిరిపోయిన సంఘాలను కూడగట్టి, వారికి పరిస్థితిని చెప్పి సంఘాలలో పనిచేయడానికి తీవ్రమైన కృషి చేశాడు. రమణ కోసం పోలీసుల వేట ప్రారంభమైంది. ఒకరోజు భార్యను కలవడానికి వెళ్లగా పోలీసులు ఇంటిని చుట్టుముట్టడంతో తప్పుకొని బయటపడ్డాడు. పోలీసులు ఇల్లును ధ్వంసంచేసి భార్యను వేధించారు. అయినప్పటికీ పట్టుదలతో వుంటూ భార్యకు ధైర్యం చెబుతూ పార్టీలోనికి తీసుకొని రావడానికి కృషి చేశాడు. దళంలో సైలెంట్ టీంకు సభ్యునిగా దళానికి బాటలు తీసేవాడు. దళంలో ఎప్పుడూ నవ్వుతూ అందరిని నవ్వించేవాడు. దళంలో చేరినతరువాత పట్టుదలతో చదువు నేర్చుకున్నాడు. రాజకీయాలు నేర్చుకోవాలని ఆరాటపడేవాడు.

కామ్రేడ్ జనార్దన్ కొత్తగూడెం నివాసి. గిరిజన ఆదివాసి కుటుంబానికి చెందిన నిరుపేద. ఇంటర్ చదివిన నిరుద్యోగి. కొత్తగూడ మండలంలోనే ప్రయివేట్ స్కూల్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించేవాడు. క్రమంగా ITDA ద్వారా హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కా॥ జనార్దన్ 1990 నుండి పార్టీ సంబంధాల్లోకి వచ్చి రహస్యంగా సంఘంలో పనిచేసేవాడు. మంచి కళాకారుడు. విద్యార్థులకు అభ్యుదయకరమైన నాటికలు, పాటలు నేర్పించేవాడు. కొత్తగూడలో 'ప్రజాపంథా' అరాచకాలను, దివాలాకోరు రాజకీయాలను ఎండగట్టడంలో తీవ్రమైన కృషిచేశాడు. 'ప్రజాపంథా' బెదిరింపులను లెక్కచేయకుండా విద్యార్థులను, యువకులను కూడగట్టడంలో ఆయన పాత్ర ఎంతో వుంది. ❑

# ఖమ్మంపెల్లి అమరవీరులకు జోహార్లు !

16.11.'95 సాయంత్రం ఖమ్మంపల్లి గ్రామంలో దళం ఉందని సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి 10.30గంటలకే గ్రామాన్ని చుట్టుముట్టారు. దళం పనుల నిమిత్తం వెనుకగా నిరాయుధులుగా వస్తున్న కామ్రేడ్స్ సమ్మన్న, వెంకటేష్, ఓదన్నలను వేరువేరుగా పట్టుకొని అప్పటికే ఇద్దరు దళసభ్యులతో జరిగిన ఫైరింగును సాకుగా చూపి పట్టుకున్న వారిని కాల్చి ఎన్‌కౌంటర్ కట్టుకథను అల్లారు.

కామ్రేడ్ గాదెవేన సమ్మన్న (సాగర్, 20 సంవత్సరాలు) కరీంనగర్ జిల్లా ముత్తారం మండలం, ఖమ్మంపెల్లి గ్రామంలో ఒక నిరుపేద యాదవ కుటుంబంలో జన్మించి 10వ తరగతి చదివాడు. గ్రామంలో జరుగుతున్న పోరాటాలను చూసి ఉత్తేజితుడై 1993లో పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాడు. గ్రామసంఘంలో చేరి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో ముందునిలిచాడు.

1993లో శత్రువు పెడుతున్న తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోలేక సంఘంలోని కొందరు పార్టీకి దూరంకాగా కామ్రేడ్ సమ్మన్న నిత్యం గ్రామ ప్రజలతో మమేకమవుతూ గ్రామంలో జరుగుతున్న పోరాటాలలో ముందునిలిచి ప్రజలయొక్క అభిమానాన్ని చూరగొన్నాడు. గ్రామ భూస్వామి అయిన సిరిపురం సాంబయ్య భూమి విషయంలో గ్రామంలోని దళితులపై కేసులు పెడితే అతని నుండి నష్టపరిహారం కట్టించాడు. 1994 డిసెంబరు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఖమ్మంపెల్లిలో పోలీసుక్యాంపు పెట్టి సమ్మన్నను పట్టివ్వమని ప్రజలను చిత్రహింసలు పెట్టినప్పటికీ పోలీసులకు దొరకకుండా సమ్మన్న గ్రామంలోనే వుంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు వర్గదృక్పథాన్ని అర్థం చేయించాడు. 1995 ఏప్రిల్‌లో తునికి ఆకు ధర పెరగాలని క్యాంపెయిన్ దళానికి నాయకత్వం వహించి క్యాంపెయిన్ చేసి ప్రజలకు పోరాట స్ఫూర్తిని కలిగించాడు. ఈ క్రమంలో కా॥ సాగర్ పార్టీ సభ్యుడిగా ఎదిగి మరింతగా ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు.

పార్టీ అవసరాల రీత్యా కరీంనగర్ పట్టణానికి కా॥ సమ్మన్నను 1995 మే లో పంపించడం జరిగింది. గ్రామంలో వుంటున్నప్పుడు నిరంతరం ప్రజల మధ్య వుంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు నాయకత్వం వహిస్తూ దాదాపు రెండు సంవత్సరాలుగా అలవాటు అయిన పనిని వదులుకొని, నిరంతరం శత్రుగర్భంలో వుండే పట్టణాలలోని పని విధానాన్ని అతి తక్కువ కాలంలోనే అలవరుచుకొని తనకు అప్పగించిన కార్యక్రమాన్ని చాలా ఓపికతో పట్టుదలతో చేసేవాడు. పట్టణంలో వుంటూనే పార్టీ పని మీద అతని స్వగ్రామం అయిన ఖమ్మంపెల్లికి 16.11.'95 రోజున రాత్రి వచ్చాడు. అప్పటికే దళం గ్రామంలోనే వుండడంతో ఇంటికి పోకుండానే రాత్రి 10.30గంటలకు దళం వద్దకు వచ్చాడు. దళం వెళ్లిపోయిన తర్వాత కొంతమంది కామ్రేడ్స్‌తో వస్తున్న క్రమంలో నిరాయుధంగా వున్న కా॥ సమ్మన్నను పోలీసులు పట్టుకొని అదే రోజు కాల్చిచంపారు.

కామ్రేడ్ బండారి వెంకటేశంకు 18 సంవత్సరాలు. ఖమ్మంపెల్లి గ్రామంలో ఒక నిరుపేద మున్నూరుకాపు కుటుంబంలో జన్మించాడు. గ్రామంలో 5వ తరగతి వరకు చదివి ప్రక్క గ్రామమైన తాడిచర్లలో 9వ తరగతి చదువుకుంటూనే పార్టీతో 1992లో సంబంధాలు పెట్టుకుని సంఘంలో చేరాడు. గ్రామంలో జరిగిన సారా, భూపోరాటాలలో పాల్గొని విజయవంతం చేశాడు. గ్రామ భూస్వామి అయిన సిరిపురం సాంబయ్యకు వ్యతిరేకంగా కొనసాగిన భూ పోరాటంలో పాల్గొని ప్రజలను కదిలించాడు. అతడు గ్రామ దళితులపై కేసులు పెట్టినందుకు వాడి వద్ద నుండి నష్టపరిహారం ఇప్పించడంలో కా॥ వెంకటేశ్ పాత్ర వుంది. 1994లో శత్రువు చేతచిక్కి చాకచక్యంగా తప్పించుకున్నాడు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఊరిలో పోలీసుక్యాంపు పెట్టి కా॥ వెంకటేశ్‌ను పట్టివ్వాలని మహిళలను, వృద్ధులను చిత్రహింసలు పెట్టారు. అతని తల్లిదండ్రులను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఏ మాత్రం బెదరకుండా శత్రువుకు దొరకకుండా, ప్రజల సహకారంతో నిత్య నిర్బంధంలో ప్రజలతో కలిసి పనిచేసాడు. కా॥ వెంకటేశ్ అన్ని పోరాటాలలో ముందుండి పెత్తందార్లకు దేహశుద్ధి చేసాడు. దళం ఊరిలో కార్యక్రమం ముగించుకొని తిరిగి వస్తుండగా కా॥ వెంకటేశ్‌ను పుస్తకాలు తెమ్మని ఊరిలోకి పంపగా వెళ్లి తిరిగి వస్తూ శత్రువు చేతచిక్కి బూటకపు ఎదురుకాల్పుల్లో అమరుడయ్యాడు.

కామ్రేడ్ వేల్పుల ఓదన్న ఖమ్మంపల్లి గ్రామంలో ఒక నిరుపేద యాదవ కుటుంబంలో జన్మించి, గ్రామంలో జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ఉత్తేజితుడై 1991లో పార్టీతో సంబంధాలు ఏర్పర్చుకుని, పాలేరుగా వుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ సంఘ కార్యక్రమాలలో రహస్యంగా పాల్గొనేవాడు. దళం వచ్చినప్పుడు దళానికి తిండిపెడుతూ, శత్రు సమాచారం, గ్రామంలో జరుగుతున్న మంచి చెడులను దళానికి చెప్పేవాడు. గ్రామ ప్రజల అభిమానాన్ని చూరగొని మంచిపేరు తెచ్చుకున్నాడు. దళం గ్రామంలో మీటింగు పెట్టడానికి వచ్చినప్పుడు కా॥ ఓదన్న దళంతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నాడు. దళం కార్యక్రమం ముగించుకున్న తర్వాత కొంత పార్టీ సాహిత్యం ఓదన్న ఇంట్లో వుంటే వాటిని తేవడానికి కా॥ వెంకటేశ్‌తో కలిసి పోయి తిరిగి వస్తుండగా శత్రువుకు దొరికి బూటకపు ఎదురుకాల్పులలో అమరుడైనాడు.

□

# దండకారణ్య అమరవీరులకు జోహార్లు!

గడ్‌చిరోలి ఉద్యమ చరిత్రలో తమ వంతు పాత్రను గొప్పగా నిర్వహించిన విప్లవ ప్రజానీకంలో కా॥ రైను ఉయికె ఒకరు. ఆయన స్వగ్రామం ధనోరా తాలుకా, బందెహూర్. దళం అప్పగించే ఏ పనికైనా వెనుకాడని కా॥ రైను నిర్బంధకాలంలో 1992 నవంబరులో పురాడా పోలీసులచే అరెస్టు చేయబడి అనేక చిత్రహింసలు అనుభవించాడు. నాజీ ఫాసిస్టు మూకలను మించిన రీతిలో చిత్రహింసలకు పేరొందిన గడ్‌చిరోలి జిల్లా పోలీసులు కా॥ రైనుపై అనేక అక్రమకేసులు బనాయించి అతి చిన్న వయస్సులోనే 23వ ఏట జైలుపాలు చేశారు. 'రా' (ఆర్.ఎ.డబ్ల్యు) విభాగంలో ప్రత్యేక శిక్షణపొంది, బాంబే నేరప్రపంచంలో ఆరితేరిన పోలీసు అధికారులను గడ్‌చిరోలి జిల్లాలో బాధ్యతలు నిర్వర్తించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇలాంటి దుండగుల చేత చిత్రహింస అనుభవించి నోరువిప్పని కా॥ రైను జైలులో అనారోగ్యం పాలయ్యాడు. కటిక పేదరికాన్ని అనుభవిస్తున్న ఇంటివారు రైనును విడిపించుకునే ప్రయత్నాలు చేసినా కోర్టులు, పోలీసులు అనుమతించలేదు. క్రమంగా జబ్బు క్షయకు దారితీసి, ఎలాంటి వైద్య సహాయం దొరకక కా॥ రైను జైలు అధికారుల కుట్రలకు బలయ్యాడు. అధికారులు చివరిక్షణంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా 31.1.94నాడు కా॥ రైను కన్నుమూశాడు. అనారోగ్యాన్ని లెక్కచేయకుండా నిర్బంధాన్ని గేలిచేస్తూ అమరుడయిన కా॥ రైను జీవితం ప్రతి రాజకీయ ఖైదీకి ఆదర్శమే.

కా॥ సాంబయ్య ఆగిపేట గ్రామస్థుడు. దొర్ల తెగకు చెందిన కా॥ సాంబయ్య విప్లవ రాజకీయాలతో 1984-85 నుండే పనిచేస్తున్నాడు. ప్రజాసంఘాల కార్యక్రమాలు అభివృద్ధి అయిన క్రమంలో గ్రామనాయకుడిగా ఎదిగాడు. అంతేగాదు, ప్రజల విశ్వాసాన్ని, పార్టీ విశ్వాసాన్ని చూరగొన్న ఈ కామ్రేడ్ పార్టీ సభ్యుడిగా కూడా ఎదిగాడు. పార్టీ అప్పగించే ఎంతటి కఠినమైన పనులనైనా క్రమశిక్షణతో, పట్టుదలగా చేసేవాడు. ఎలాంటి దుర్వ్యసనాలు లేని కా॥ సాంబన్న విప్లవ రాజకీయాలనే నమ్ముకొని ప్రజాసేవకే అంకితమైన ఆదర్శరైతు.

శత్రువు తలపెట్టిన 'జనజాగరణ్ నిర్బంధ అభియాన్'లో ప్రజలపక్షాన నిలబడి తీవ్ర నిర్బంధాన్ని అరెస్టులను ఎదుర్కొన్న సాంబన్న ఆదర్శ నాయకుడిగా నిలిచాడు. శత్రువుకు సవాల్ అయ్యాడు. విప్లవాన్ని తుదముట్టించాలంటే, విప్లవశక్తులను భౌతికంగా ముందు నిర్మూలించాలనే శత్రువు ఎత్తుగడలకు బలైనవాడు కా॥ సాంబన్న. 1992 వర్షాకాలంలో ఒక అంగడిరోజు మద్దేడు అంగడికి వెళ్లి సరుకులు తీసుకొని తిరిగి ఇంటికి రాలేదు. కా॥ సాంబన్న జాడ తెలువకుండా పోవడంతో బస్తర్ జిల్లా ఉద్యమం ఒక మంచి విప్లవ కార్యకర్తను కోల్పోయింది.

కా॥ మాడవి సీతారాం (గణేశ్) ఉట్నూర్ తాలూకా జైనూర్ మండలంలోని 'లెండిగూడెం' గ్రామంలో పేద కుటుంబంలో జన్మించాడు. జైనూర్ స్కూల్‌లో 7వ తరగతి వరకు చదువుకున్నాడు. కొన్నిరోజులు లారీ క్లీనర్‌గా పనిచేసాడు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న భూపోరాటంలో ఆ గ్రామస్థులు విస్తృతంగా కదిలారు. కా॥ సీతారాం గ్రామంలో గిరిజన రైతుకూలీ సంఘంలో చేరి భూముల పోరాటాల్లో చురుకుగా సంఘంతో పని చేయించాడు. ఈ క్రమంలోనే పార్టీ పనులు చేస్తూ 1987 చివరలో దళంలోకి రిక్రూట్ అయినాడు. ఖానాపూర్, మంగి, వాంకిడి దళాలలో పనిచేశాడు. 1988లో పార్టీ సభ్యుడైనాడు. 1988-89లో జరిగిన కరువు దాడులలో ప్రజలను కదిలించడానికి చురుకుగా దళంలో పనిచేసారు ఆగస్టులో జరిగిన టేకమాండ్వా (మహారాష్ట్ర) అంబుష్‌లో పాల్గొని దానిని విజయవంతం చేయడానికి, అస్సాల్ట్ పార్టీ మెంబర్‌గా తనవంతు పాత్రను సాహసంగా కొనసాగించాడు. దండకారణ్య ఉద్యమం నూతన ప్రాంతాలకు విస్తరించడంలో భాగంగా బాలాఘాట్ డివిజన్‌కు 1989 చివరలో పార్టీ నిర్ణయం మేరకు ఎటువంటి తటపటాయింపులు లేకుండా కా॥ సీతారాం పోయాడు. బాలాఘాట్ డివిజన్‌కు కొత్తగా పోయిన దళంలో సభ్యులుగా వుండి, పోయిన కొత్తలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా గట్టిగా నిలబడ్డాడు. దళంపోయిన కొద్ది రోజులు పోలీసులకు, మన దళానికి ఫైరింగ్ జరిగిన సంఘటనలో ధైర్యంగా నిలబడి రిట్రీట్ అయినాడు. ఈ క్రమంలోనే 1992 ఏప్రిల్ నెలలో కలకత్తాలో జరిగే ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. మీటింగ్ కొరకు ప్రతినిధులను పంపించి, తిరిగి వస్తున్న గ్రామంలో ఒక ద్రోహి సమాచారంతో పోలీసులు పట్టుకొని ఎన్ని చిత్రహింసలు పెట్టినా సమాచారం ఇవ్వకపోయేసరికి మధ్యప్రదేశ్ పోలీసులు కా॥ సీతారాంను కాల్చిచంపి శవాన్ని తీసుకువచ్చి ఏరియాలో పడేశారు. ఈ విధంగా వీరగెరిల్లా కా॥ సీతారాం తుదిశ్వాస వదిలేవరకు శత్రువుకు పల్లెత్తుమాట కూడా చెప్పకుండా అమరుడైనాడు.

కా॥ ధనిరాం కొడో బస్తర్ జిల్లా నారాయణపూర్ దుట్ట గ్రామస్థుడు. అబూజ్‌మహాడ్ గుట్టలపై నివసించే వెనుకబడిన ఆదివాసీ తెగకు చెందినవాడు. లోతట్టు అడవిలో 'నాగరికత'కు దూరంగా దోపిడీ పీడనలో జీవితాన్ని వెళ్లదీసే ఆదివాసీ లందరిలాగే బతుకు నీడుస్తున్న వారందరికంటే ఒకడుగు ముందుకు వచ్చి డికెఎంఎస్‌లో సభ్యత్వం పొందాడు. నిండుగా 18 ఏళ్లు కూడా లేని యువకుడు విప్లవంపట్ల అభిమానంతో, అన్నలపట్ల విశ్వాసంతో గ్రామసంఘంలో

అందరితోపాటుగా పనులు చేసేవాడు.

28 జూలై అమరుల స్మృతిదినం దండకారణ్య వ్యాప్తంగా వరదలో 8మంది యువకులు ఎంతో పట్టుదలతో ఆరోజు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందులో మన ధనిరాంకొడో ఒకడు. ''అమరులు అజరామరులు'' అని నినదిస్తూ నేలకొరిగిన ప్రజావీరుల నెత్తిటి త్యాగాల బాటనే నడిచినవాళ్లల్లో మన కొడో ఒకడు. అమరుల స్మృతిలో నిర్మితమైన స్థూపావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడానికి బయలుదేరి వెళ్తుండగా పాముల గౌతమి నది దాటుతూ ప్రమాదవశాత్తు వరదలో కొట్టుకుపోతూ మృతిచెందాడు. విప్లవాశయానికి అంకితమైన త్యాగవీరులకు జోహార్లు చెప్పసాగిన ధనిరాం తానే కన్నుమూయడం నిజంగా ఎంతో బాధాకరమయిన విషయం. ఎంతటి ప్రమాదాలనైనా ఎదిరిస్తూ, విప్లవ కార్యక్రమాలను కొనసాగించడానికి వెనుకాడకుండా ముందుకు సాగే ఆదర్శవంతమైన ఆచరణ ప్రతివారికి కొడో నేర్పుతున్నాడు. ఆ వీరుడి ఆశయసాధన కోసం చివరి నెత్తుటిబొట్టు వరకు మనం పోరాడుతామని ప్రతిజ్ఞ చేద్దాం. ❑

---

# హిందూ మతోన్మాద శక్తులకు సుప్రీంకోర్టు వత్తాసు పొంచివున్న ఫాసిస్టు పాలనకు సంకేతం

గత కొన్ని దశాబ్దాలుగా హిందు మతోన్మాద ఫాసిస్టు శక్తులు మైనారిటీ మతస్థులపై చేస్తున్న దాడులకు, ముస్లిం ప్రజలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొడ్తున్న చర్యలకు దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఆమోదం లభించింది. సెక్యులర్ రాజ్యం అంటూ భారత పాలకవర్గాలు ఎంతగా ఊదరగొడ్తున్నప్పటికీ, మన దేశ రాజ్యాంగయంత్రం యావత్తూ మొదటి నుండీ మైనారిటీ మతస్థులకు వ్యతిరేకంగా హిందూ మతోన్మాద శక్తులకు అంటకాగుతున్నది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌జోషి, తదితర శివసేన, బి.జె.పి. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా చేసిన ప్రసంగాలు ముస్లిం ప్రజలకు వ్యతిరేకంగానూ, మతాన్ని ఎన్నికల ప్రచారానికి వాడుకున్న విధంగానూ వున్నాయనే విషయంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు హిందూ ఫాసిస్టుల దురుద్దేశపూరిత వాగుడుకంతటికీ ఆమోద ముద్రవేస్తూ గత డిసెంబరు 11న అత్యంత హేయమైన తీర్పునిచ్చింది. పార్లమెంటు ఎన్నికలకు కొన్నినెలలు ముందుగా వచ్చిన ఈ తీర్పుతో హిందూ ఫాసిస్టుశక్తులు పట్టపగ్గాలు లేకుండా రెచ్చిపోయి, ఈ ఎన్నికలలో ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతంచేసి, మతకల్లోలాలు రేపి, దాడులకు పాల్పడతారు. ఎన్నికల కమిషన్ సైతం నోరుమెదపని హిందూ ఫాసిస్టుల ప్రసంగాలకు, సుప్రీంకోర్టు కూడా ఆమోద ముద్రవేయడం, దేశంలో భారత పాలకవర్గాలు నెలకొల్పనున్న ఫాసిస్టు పాలనకు సంకేతం.

బొంబాయిలోని విలేపార్లే శాసనసభా స్థానానికి 1987లో జరిగిన ఉపఎన్నిక సందర్భంగా శివసేన అభ్యర్థి ప్రభూకు ప్రచారం చేసిన పచ్చిఫాసిస్టు ఉన్మాది, శివసేన నాయకుడు బాల్‌థాకరే ముస్లింలను పాములని, లొండేలని (సున్తీ చేయించుకొనడాన్ని బట్టి తిట్టడం) దూషించాడు. 1990లో దాదర్ నుండి పోటీ చేసిన మనోహర్‌జోషికి ప్రచారం చేసిన బి.జె.పి. ప్రధాన కార్యదర్శి ప్రమోద్ మహాజన్ ''జాతి వ్యతిరేక ముస్లింలను హిందుత్వ జ్వాలల్లో భస్మం చేస్తామని'' వాగాడు. అదే మీటింగ్‌లో జోషి మాట్లాడుతూ ''దేశంలోనే ప్రప్రథమ హిందూ రాష్ట్రంగా మహారాష్ట్ర అవతరిస్తుంద''ని అన్నాడు. ముస్లింలకు తగిన గుణపాఠం చెబుతామని, ముస్లింలకు రక్షణ కావాలంటే తమనే గెలిపించాలనీ, లేకపోతే మారణహోమం సృష్టిస్తామని మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శివసేన, బి.జె.పి. అభ్యర్థులు ముస్లిం ప్రజలను తీవ్రస్థాయిలో బెదిరించారు. ఎన్నికల కమిషన్‌గానీ, పిచ్చిఅరుపులు అరిచే శేషన్‌గానీ శివసేన, బి.జె.పి.ల ప్రచారాన్ని అడ్డుకోలేదు, చర్యతీసుకోలేదు.

భారత రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం, సెక్షన్ 123(3) ప్రకారం ఏ అభ్యర్థిఅయినా మత ప్రాతిపదికన ఓట్లు అడిగినా, ఏ అభ్యర్థికైనా అతని మతం కారణంగా ఓటు వేయవద్దని చెప్పినా నేరమవుతుంది. సెక్షన్ 123(3ఎ) ప్రకారం ఏ అభ్యర్థిగానీ, అతని ప్రతినిధిగానీ, మరెవరైనా వ్యక్తిగానీ అభ్యర్థి లేదా అతని ఎన్నికల ప్రతినిధి అంగీకారంతో మత, కుల, జాతి ప్రాతిపదికన వివిధ వర్గాల ప్రజలమధ్య శత్రుత్వం లేదా విద్వేషభావాలను రెచ్చగొట్టినట్లయితే తప్పుడు చర్య అవుతుంది. మహారాష్ట్రలో శివసేన, బి.జె.పి. అభ్యర్థుల ఎన్నికను రద్దు చేయడానికి సెక్షన్లు 123(3), 123(3ఎ) ప్రకారం పూర్తి సాక్ష్యాధారా లున్నాయి. మనోహర్‌జోషితోబాటు ఏడుగురు అభ్యర్థులు మతాన్ని ఎన్నికల ప్రయోజనాలకు వాడుకున్నారనీ, మత విద్వేషాన్ని ప్రచారం చేసారనీ రుజువు కావడంతో, బొంబాయి హైకోర్టు వారి ఎన్నికను రద్దుచేసింది. ఈ తీర్పుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును కొట్టేవేసి అందుకు వ్యతిరేకమైన తీర్పునిస్తూ పూర్తిగా మతోన్మాదులను సమర్థించింది. కేవలం ప్రమోద్‌మహాజన్ ప్రసంగాలను సమర్థిస్తూ కోర్టులో మనోహర్‌జోషి చెప్పిన మాటల ఆధారంగానే అతని ఎన్నికను రద్దు చేయవచ్చు. కాని సుప్రీంకోర్టు మత దురహంకారులను సమర్థించడమేకాక, నిస్సిగ్గుగా వారి మాటలకు కొత్త భాష్యాలు పలికింది.

హిందూమతోన్మాదాన్ని తలకెక్కించుకున్న జె.ఎస్.వర్మ అధ్యక్షతలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 'హిందుత్వ' (హిందూ భావన) అంటే ''భారతీయీకరణ'' అనీ, హిందుత్వ ఒక జీవన విధానమనీ, దానిని మత ఛాందసవాదంగా భావించరాదనీ భాష్యం చెప్పింది. గత కొన్ని దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ తదితర హిందూఫాసిస్టు సంస్థలు హైందవజాతి అనీ, హిందువులు కానివారు దేశ శత్రువులనీ చేస్తున్న కుటిల ప్రచారంతో సుప్రీంకోర్టు వివరణ జతకలవడం ఏమాత్రం ఆశ్చర్యపడదగ్గది కాదు. మహారాష్ట్రను 'హిందూరాష్ట్రం'గా రూపొందిస్తామని (దాని అర్థం ముస్లింలను తరిమివేస్తామనడం) జోషి చేసిన ప్రకటనను కూడా సమర్థిస్తూ, మతోన్మాదులను సమర్థించే

కర్తవ్యాన్ని భుజాన వేసుకున్న జస్టిస్ వర్మ, దానిని కేవలం ఆశాభావం గానే పరిగణించాలనీ, అంతమాత్రంచేత జోషి తన మతం ప్రాతిపదికన ఓట్లు అడిగినట్లుగా భావించరాదనీ తీర్పుచెప్పాడు. తిమ్మిని బమ్మిని చేసి, చట్టాల అసలు అర్థాన్ని మార్చిన, సుప్రీంకోర్టు హిందూ ఫాసిస్టులతో చేయికలిపింది. భారత రాజ్యాంగయంత్రం యావత్తూ హిందూమత ఛాందసంతో నిండిపోయిందని ఈ తీర్పుతో స్పష్టమవుతున్నది.

అధికార మార్పిడి జరిగిన నాటినుండి, నెహ్రూ హయాం నుండి పి.వి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ హిందూమతోన్మాదులకు తోడ్పడుతూనే వున్నాయి. అదేవిధంగా సుప్రీంకోర్టు కూడా ఎప్పుడూ హిందూ మతోన్మాదుల కనుసైగల కనుగుణంగా, వారి కనుకూలమైన తీర్పులే ఇచ్చింది. 1949, డిసెంబరు 22న హిందూ మతోన్మాదులు దొంగచాటుగా బాబ్రీమసీదులో రాముడి విగ్రహం పెట్టిన తర్వాత నెహ్రూ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే ముస్లిం ప్రజలను ప్రార్థన చేసుకోకుండా నిరోధించి, మసీదును మూసివేసింది. తిరిగి రాజీవ్‌గాంధీ హయాంలో సుప్రీంకోర్టు 1986లో బాబ్రీమసీదులో పెట్టిన రాముడి విగ్రహానికి హిందువులు ప్రార్థన చేసుకోవచ్చుని తీర్పు చెప్పింది. ఆనాటి నుండి బాబ్రీమసీదు ప్రాంగణం హిందూ మతోన్మాదులకు ఆటపట్టయింది. బాబ్రీమసీదు ప్రాంగణంలో హిందూ ఫాసిస్టులు శిలాన్యాస్, కరసేవ పేరుతో రామమందిర నిర్మాణం చేపట్టినప్పుడు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పరోక్ష సహకారమందించింది. 1989, 1991 ఎన్నికల సందర్భంగా హిందూ ఫాసిస్టులు బాబ్రీమసీదును కూల్చి రామమందిరం నిర్మిస్తామని బహిరంగంగానే ప్రచారం చేశారు. 1992, డిసెంబరు 20న పి.వి ప్రభుత్వ సహకారంతో హిందూ ఫాసిస్టులు బాబ్రీమసీదును నేలమట్టం చేసే హీనచర్యకు ఒడిగట్టారు. వివాద స్థలంలో మసీదు, గుడి రెంటిని కట్టిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్తూ పి.వి ప్రభుత్వం బాబ్రీమసీదును కూల్చినచోట ఫాసిస్టులు నిర్మించిన రామ మందిరంలో ప్రార్థనలకు అనుమతించి, ఆ స్థలాన్ని హిందువులపరం చేసింది. హిందూ మతోన్మాదులు ఆ గుడిని క్రమంగా పటిష్టంగా నిర్మించుకొంటున్నారు. పి.వి ప్రభుత్వం నిస్సిగ్గుగా బాబ్రీమసీదు వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను తిరిగి సుప్రీంకోర్టుకే అప్పగించింది. బాబ్రీమసీదును కూల్చిన తర్వాత పి.వి ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్., భజరంగ్‌దళ్ తదితర హిందూ ఫాసిస్టు సంస్థలపై నిషేధం విధించింది. ఆ నిషేధం కేవలం కాగితాలకే పరిమితమైంది. పి.వి ప్రభుత్వం నియమించిన బాహ్రీ ట్రిబ్యునల్ ఆర్.ఎస్.ఎస్.ను 'జాతీయవాద' సంస్థగా పేర్కొంటూ, దానిపై నిషేధం ఎత్తివేసింది.

మహారాష్ట్రలో శివసేన ఫాసిస్టుముఠా ఎన్నికలలో గెలవడానికి ముందు నుండే బొంబాయిలో గూండా అధికారం చెలాయిస్తున్నది. శరద్‌పవార్, కాంగ్రెస్ ప్రభుత్వాల అండతో పెరిగిన ఈ పచ్చిఫాసిస్టు ముఠా ఈనాడు బొంబాయి నగరంలోని ముస్లిం ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. తన మాట వినని ప్రఖ్యాత సినీనటుల సినిమాలపై ఆంక్షలు విధించడం నుండి అనధికార సెన్సార్‌ను అమలు జరిపే స్థాయికి ఎదిగింది. బాబ్రీమసీదును కూల్చిన తర్వాత శివసేన ఫాసిస్టులు బొంబాయి, సూరత్, అహమ్మదాబాద్ నగరాలలో ముస్లిం ప్రజలపై నీచమైన దాడులు చేసారు. సుమారు వేయిమంది ముస్లిం ప్రజలను హత్యచేసి, వందలాది ముస్లిం మహిళలపై అత్యాచారాలు జరిపారు. వారి ఇండ్లు కూలగొట్టి తరిమివేసారు. ముస్లిం ప్రజలను కాపాడకపోగా, హిందూ ఫాసిస్టులకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు కూడా పూర్తిగా సహకరించారు. ఆనాడు శివసేన జరిపిన అత్యాచారాల విచారణకై వేసిన శ్రీకృష్ణ కమిషన్‌ను ఇటీవల శివసేన ప్రభుత్వం రద్దుచేసింది. శివసేన ఎమ్మెల్యే మధుకర్ సర్పోదర్‌ను శ్రీకృష్ణ కమిషన్ ఇటీవల తీవ్రంగా ప్రశ్నించింది. ఆనాటి అల్లర్లలో సర్పోదర్ ప్రత్యక్షంగా పాల్గొని ఆయుధాలతో పట్టుబడ్డాడు. కమిషన్ తర్వాతి విచారణలో మనోహర్‌జోషి, గోపీనాథ్ ముండే, బాలథాకరే వున్నారు. కమిషన్ సేకరించిన తమ పాపాలచిట్టా బయటపడకుండా వుండడానికే శివసేన-బి.జె.పి. ప్రభుత్వం శ్రీకృష్ణ కమిషన్‌ను రద్దుచేసింది. అంతేగాక బాలథాకరేపై నమోదైన 24 కేసులను ఉపసంహరించింది. శివసేన అధినేత బాల్‌థాకరే తన 'సామ్నా' పత్రికలో ముస్లింలపై దాడులకు ఉసిగొల్పుతూ రాసే నీచమైన రాతలను అడ్డుకునే వారే లేకపోగా, ఇప్పుడు ప్రభుత్వాధికారాన్ని సైతం ఉపయోగించుకుని శివసేన-బి.జె.పి: ముఠా ముస్లిం ప్రజలపై అదుపులేని అత్యాచారాలు సాగించే అవకాశం ఉంది.

కాంగ్రెస్(ఐ) ప్రత్యక్షంగానే హిందూ ఫాసిస్టులకు సహాయ పడుతుండగా జనతాదళ్, సిపిఐ, సిపిఎంలతో సహా రాజకీయ పార్టీలన్నీ, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడడానికి సిద్ధంగా లేకపోగా, అవే స్వయంగా హిందూ మతతత్వాన్ని సంతరించుకొని, పరోక్షంగా సహకరిస్తున్నాయి. దీనితో హిందూ ఫాసిస్టు సంస్థలు కాశీ, మధురలలో వున్న మసీదులను సైతం కూలగొట్టి గుడులు కడ్తామని విర్రవీగుతున్నారు. ''హిందూత్వ ప్రచారంలో ఇమిడివున్న చట్టపరమైన అవరోధం ఇక లేనేలేదు'' అని ఫాసిస్టులు సుప్రీంకోర్టు తీర్పుతో సంబరపడుతున్నారు.

కాంగ్రెస్ (ఐ)తోబాటు పార్లమెంటరీ పార్టీలన్నీ హిందూ ఫాసిస్టు సంస్థలకు ప్రత్యక్ష, పరోక్ష సహకారాన్నందివ్వడం, సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థతోసహా రాజ్యాంగయంత్రం యావత్తూ హిందూ మతోన్మాదుల మద్దత్తుదారులతో నిండిపోయి, వారికి మద్దత్తుగా నిలబడడం చూస్తే భారత పాలక వర్గాలు ప్రజలపై ఫాసిజాన్ని రుద్దడానికి హిందూ ఫాసిస్టు సంస్థలను త్వరత్వరగా ముందుకు తీసుకువస్తున్నాయని అర్థమవుతున్నది. జర్మనీలో నాజీలను అధికారానికి తీసుకురావడానికి జర్మనీ పాలకవర్గాలు తోడ్పడిన పద్ధతిలో హిందూ ఫాసిస్టు సంస్థలకు భారత పాలకవర్గాలు తోడ్పడుతున్నారు. డబ్బు సంచులను కూడా పెద్దమొత్తంలో కుమ్మరిస్తున్నారు.

అన్నివైపుల నుండి అందుతున్న మద్దత్తుతో హిందూ ఫాసిస్టు సంస్థలైన శివసేన, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి., భజరంగ్‌దళ్‌లు మతకల్లోలాలను రేపి, మైనారిటీ మతస్థులపై ముఖ్యంగా ముస్లిం ప్రజలపై దాడులు ఉధృతం చేస్తాయి. హిందూ మతోన్మాద సంస్థల ఫాసిస్టు దాడులను తిప్పికొట్టి ముస్లిం ప్రజలకు అండగా నిలబడి దృఢంగా పోరాడవలసిన కర్తవ్యం కార్మికవర్గం, ప్రజాస్వామికవాదులు, విప్లవ ప్రజానీకం పైన వున్నది. ❑

# భారతపాలకవర్గాల దలారీ స్వభావాన్ని నగ్నంగా బయటపెట్టిన హవాలా కుంభకోణం

పార్లమెంటరీ పార్టీల నేతలూ, బడాబ్యూరాక్రాట్లూ అంతర్జాతీయ గుత్తసంస్థలతో వారి భారతీయ దలారులతో గత యాభైఏళ్లుగా ఒద్దికగా సాగిస్తున్న అవినీతి సంసారం ఫలితంగా అసంఖ్యాకంగా కుంభకోణాలు పుట్టుకొస్తూ వున్నాయి. అలాంటి కుంభకోణాల్లో ఒకటి జైన్‌హవాలా కుంభకోణం కేసు. అయిదేళ్ల క్రింత వెలుగుచూసిన హవాలా కుంభకోణం, గత నాలుగేళ్లుగా సి.బి.ఐ.బ్రాండు వల్లమందు సేవించి జోగుతూ వుండి, నేడు మేలుకుంది. అది, తన పుట్టు పూర్వోత్తరాలేగాక తన కన్నవారి పాపిష్టి చరిత్ర నంతటినీ బయట పెడుతున్నది. ఈ ప్రత్యేకతవల్లనే అది పాలకవర్గ రాజకీయ పార్టీలన్నింటి పాలిటి భూతంగా పరిణమించింది. ఢిల్లీ గద్దెకు మరోసారి ఎన్నికలు జరుగనున్న తరుణంలో లేగిన ఈ హవాలా పెనుదుమారంలో పార్లమెంటరీ పార్టీలన్నింటి ముసుగులూ తొలగిపోయాయి. అవినీతి రొచ్చుగుంటలో బలిసే క్రిములుగా, అంతర్జాతీయ గుత్తసంస్థలకు దేశాన్ని అంగాంగంగా అమ్మేస్తున్న భ్రష్టచరితలుగా అవి బయటపడిపోయాయి. పాలకవర్గ రాజకీయ నాయకుల, అధికారుల అవినీతి అనేది హవాలా కుంభకోణం వెలుగులో కనబడే ఒక వాస్తవం మాత్రమే. నిజానికి రాజకీయ నాయకుల ప్రభుత్వాధికారుల అవినీతి, అక్రమార్జన అనేవి బహిరంగ రహస్యమే. అందరికీ తెలిసిన ఈ ఒక్క అంశంపైనే కేంద్రీకరించడం ద్వారా ఇతర వాస్తవాలను కప్పిపుచ్చాలనే ప్రయత్నం ఉద్దేశపూర్వకంగానే జరుగుతోంది. అలాగే ఈ కేసులో సుప్రీంకోర్టు నిర్వహిస్తున్న పాత్రకు సంబంధించిన సబబు, బేసబబుల గురించి జరుగుతున్న చర్చ కూడా ఆ వాస్తవాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి దోహదపడేదే. ఈ కేసు విషయంలో సుప్రీంకోర్టు చొరవ చూపిన కారణంగా రాజకీయవ్యవస్థను ప్రక్షాళనం చేయగలిగినదిగా న్యాయవ్యవస్థను కీర్తించడం కూడా ఉద్దేశపూర్వకంగానే జరుగుతోంది. ఢిల్లీలో 1991 మార్చి 23న కాశ్మీరుకు చెందిన హిజబుల్ ముజాహిదిన్ ఇంటెలిజెన్స్ విభాగపు ఉపనాయకుడు అషఫక్ హుస్సేన్‌లోనె అరెస్టుతో ఈ హవాలాకేసు కథ ప్రారంభమైంది. లోనే వద్ద కొంత కరెన్సీ బ్యాంకుడ్రాఫ్టులు లభించాయి. ఏప్రిల్‌లో కేసును సి.బి.ఐకి అప్పగించారు. ఆ కాశ్మీరీ మిలిటెంట్ సంస్థకు హవాలా వర్తకుల ద్వారా అంతర్జాతీయ నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకోవడానికి సి.బి.ఐ దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ జె.ఎన్.యు విద్యార్థి షాబుద్దీన్‌గనీనీ, ఏడుగురు హవాలా వ్యాపారులనూ అరెస్టు చేశారు. ఈ అరెస్టుల తర్వాత మే 5వ తేదీన హవాలా లావాదేవీలతో సంబంధం వున్న వారిపై జరిపిన దాడులలో ''జైన్ డైరీలు'' దొరికాయి. జైన్ సోదరులు ఎవరెవరికి ఎప్పుడెప్పుడు ఎంతెంత ముడుపులు చెల్లించారో ఆ డైరీలలో వివరంగా రాసివుంది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు కాశ్మీరీ మిలిటెంట్లు కందుతున్న హవాలా నిధులకోసం దర్యాప్తు ప్రారంభించిన సి.బి.ఐ.కి జైన్ సోదరులు అధికార ప్రతిపక్ష పార్టీల నేతలకూ, ప్రభుత్వాధికారులకూ పెద్దమొత్తంలో చెల్లించిన ముడుపుల జాబితా దొరికింది. పాలకవర్గ పార్టీల భ్రష్ట చరిత్రను బట్టబయలు చేసే ఆ డైరీలను చూసి సి.బి.ఐ. దిగ్భ్రాంతి చెందింది. ప్రభుభక్తితో అవి బయటకు పొక్కకుండా జాగ్రత్తపడాలని ప్రయత్నించింది. ప్రభుత్వమూ, సి.బి.ఐ. జైన్ డైరీలను ఎందుకూ పనికిరానివిగా మూలన పడేయడానికి సిద్ధమయ్యాయి. వామపక్షాలతోసహా పాలకవర్గ పార్టీలన్నీ తేలుకుట్టిన దొంగల్లా ఈ జైన్‌డైరీల విషయమై మౌనం వహించాయి.

ఏడాది తర్వాత 1992 మార్చి నాటికిగాని సి.బి.ఐ. కాశ్మీర్ మిలిటెంట్లు లోనె, గనీలపై ఛార్జిషీట్లను దాఖలు చేయలేదు. ఆ ఛార్జిషీట్లలో ఎక్కడా జైన్ డైరీల గురించిగాని, అవి వెల్లడిచేసిన రాజకీయ నాయకుల, అధికారుల అవినీతి కార్యకలాపాలను గురించికానీ ఎలాంటి ప్రస్తావన లేదు. జైన్‌లు ఎప్పటిలాగనే తమ కార్యకలాపాలు సాగిస్తూ వచ్చారు. నిజానికి 1991-95 మధ్యకాలంలో జైన్‌ల ''వ్యాపారం'' ముడుపుల చెల్లింపులతోసహా మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లింది. ఈ కాలంలోనే జైన్ సోదరులు ప్రధానికి 3.5 కోట్లు ముడుపులు సమర్పించుకున్నారు కూడా. జైన్ సోదరులలో ఒకడైన బి.ఆర్. జైన్ వర్తక ప్రతినిధిగా పి.వి.తో కలిసి సెప్టెంబరు 1993లో సియోల్ సందర్శించాడు కూడా. ఇలా ఈ హవాలా కుంభకోణం ఇతర కుంభకోణాలన్నింటిలాగానే ఎలాంటి పర్యవసానమూ లేకుండానే ముగిసిపోయి వుండవలసింది కానీ అలా జరగలేదు.

## మేల్కొన్న హవాలా భూతం

1993 ఏప్రిల్ 10వ తేదీన 'కాలచక్ర' అనే వీడియో మేగజైన్ సంపాదకుడు వినీత్‌నారాయణ్ తదితరులు జైన్‌డైరీలలోని వివరాలను వెల్లడిచేస్తూ వాటిపైన పరిశోధన కొనసాగించాలనీ, దర్యాప్తును సి.బి.ఐ.చేగాక వేరొక స్వతంత్ర సంస్థచే దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. సి.బి.ఐ.చే భూస్థాపితం చేయబడిందనుకున్న హవాలా భూతం బయట పడసాగింది. జైన్ హవాలా కుంభకోణం యితర కుంభకోణాలకన్నా చాలా భిన్నమైనది. రాజీవ్‌గాంధీ, పి.విల నుండి అద్వానీ, బొమ్మయ్, ఆర్.వెంకట్రామన్‌ల వరకూ 62మంది పాలకవర్గ పార్టీల నాయకులకూ, 23మంది ఉన్నతాధికారులకూ 1988-91 మధ్యకాలంలో జైన్‌లు ఎప్పుడెప్పుడు ఎంతెంత ముట్టజెప్పారో అందరి పాపిష్టి చరిత్రలనూ బయటపెట్టే కుంభకోణం ఇది. అందువల్లనే అన్ని రాజకీయ పార్టీలకూ ఈ కేసును గుట్టుచప్పుడు కాకుండా ముగించేయాలన్న విషయంలో పూర్తి ఏకీభావం ఉంది. హవాలా భూతం నిద్రలేచిందని పాలకవర్గ రాజకీయ పార్టీలేవీ కలవరపడలేదు. సి.బి.ఐ. విచారణ తతంగం ఏళ్లతరబడి సాగిసాగి మరోసారి అది భూస్థాపితం కాకతప్పదనేదే వారి భరోసా. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఎం.ఎన్.వెంకటాచలయ్య నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ కేసు యేడాదిన్నరపాటూ పడివుంది. 1994 నవంబరులో ఈ కేసు విచారణ జస్టిస్ జె.ఎస్.వర్మ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. దీంతో ఈ హవాలా కుంభకోణం

వూహించని మలుపు తిరిగింది. జస్టిస్ వర్మ ఈ కేసులో అసాధారణమైన ఆసక్తి కనబరచాడు. సి.బి.ఐ. నిర్వ్యాపకత్వాన్ని దుయ్యబట్టాడు. సి.బి.ఐ. డైరెక్టర్ విజయరామారావును కోర్టుకు పిలిపించి మందలించాడు. అతడే స్వయంగా కేసు విచారణ బాధ్యత స్వీకరించాలని ఆదేశించాడు. ప్రభుత్వాధికారులపైనైనా, మంత్రుల పైనైనా వేరే ఏ అధికారి అనుమతి అవసరం లేకుండానే సి.బి.ఐ. దర్యాప్తు సాగించవచ్చని అసాధారణ ఆదేశాలు జారీచేసాడు. ఎప్పటికప్పుడు కేసు దర్యాప్తును ధర్మాసనానికి నివేదించాలని ఆదేశించాడు. అయినా సి.బి.ఐ. తాత్సారం చేస్తూనే వచ్చింది. చివరికి, జైన్‌డైరీలు బయటపడి నాలుగేళ్ళు గడిచాక, 1995 మార్చి 4న ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేసింది. ఏప్రిల్‌లో ఎస్.కె.జైన్‌ని అరెస్టుచేసి ఇంటరాగేట్ చేసింది. ఈ ఇంటరాగేషన్‌లోనే జైన్ తాను ప్రధాని పి.వి.కి చంద్రస్వామి, సతీష్‌శర్మల ద్వారా 3.5 కోట్ల ముడుపులు చెల్లించానని తెలియజేసాడు. 1995 నవంబరు 25న సి.బి.ఐ. ఎన్.టి.పి.సి., కోల్ ఇండియా సంస్థల మాజీ ఛైర్మన్‌లతోపాటూ ఎనిమిదిమంది అధికారులపైన ఛార్జిషీట్లు దాఖలుచేసింది. వర్మ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సి.బి.ఐ.పైన గట్టిగా వత్తిడితెస్తూ వుండడంతో హవాలా ముడుపు అందుకున్న నేతలను రచ్చకీడ్వక తప్పలేదు. అయితే, కూటనీతిలో నిష్ణాతుడైన పి.వి. ఈ ప్రతికూల పరిస్థితిని కూడా తనకు అనుకూలంగా మలుచుకోడానికి నేర్పుగా ప్రయత్నించాడు. తన ఇంటి కుక్క సి.బి.ఐ.ని వాడుకుని పార్టీలోనూ బయటావున్న తన రాజకీయ ప్రత్యర్థులను చావుదెబ్బ తీయడానికి పూనుకున్నాడు. పి.వి. రాజకీయ వ్యూహానికి అనుగుణంగా సి.బి.ఐ. జాగ్రత్తగా ఎంపికచేసి జైన్‌ల నుండి ముడుపులు అందుకున్న 24మంది అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలపైన రెండుదఫాలుగా ఛార్జిషీట్లు దాఖలు చేసింది. అద్వానీ, అర్జున్‌సింగ్, ఆరిఫ్‌మొహమ్మద్‌ఖాన్, యశ్వంత్‌సిన్హా, దేవీలాల్, ఎన్.డి.తివారీ, శరద్‌యాదవ్, కైలాశ్‌జోషీ తదితర ప్రతిపక్ష పార్టీ నేతలు; కల్పనాథ్‌రాయ్, వి.సి.శుక్లా, బలరాంజాకర్, ఆర్.హెచ్. ధావన్, బూటాసింగ్, ఎ.కె.సేన్, జాఫర్‌షరీఫ్, నట్వర్‌సింగ్ మొదలైన అధికార పార్టీల మంత్రులూ, నేతలు అందులో వున్నారు. అనుదినమూ అవినీతి కుంభకోణాలతో నడుస్తున్న తన ప్రభుత్వంపైన విమర్శలు సంధిస్తున్న బి.జె.పి., జనతాదళ్ తదితర ప్రతిపక్ష పార్టీల నేతలంతా కూడా తమవలెనే అవినీతి రొచ్చుగుంటలో బతుకుతున్న వారేనని వెల్లడి చేయడం ద్వారా పి.వి ప్రతిపక్షాలను డిఫెన్స్‌లోకి నెట్టేసాడు. మరోవంక కాంగ్రెస్ పార్టీలో తన నాయకత్వంపైన తిరుగుబాటు చేస్తున్న నాయకుల అడ్డుతొలగించుకుని పార్టీపైన తన నాయకత్వాన్ని స్థిరపరుచుకోవడానికి ప్రయత్నం చేసాడు. దినదినమూ సి.బి.ఐ. ప్రతిచర్యనూ స్వయంగా పర్యవేక్షిస్తున్న పి.వి. ఇక ''చట్టం తన పని తాను చేసుకు పోతుంది. ప్రభుత్వం ఈ కేసు విషయంలో జోక్యం చేసుకోదు'' అంటూ కొంగజపం ప్రారంభించాడు.

ఇంతకూ జైన్‌లు ఇంత పెద్దమొత్తంలో ముడుపులు ఎందుకు చెల్లించినట్లు? జైన్‌లకు హవాలా మార్గాల ద్వారా కోట్లాది రూపాయలు ఎవరు, ఎందుకు పంపుతున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. నిజానికి ఈ ప్రశ్నలే ఈ కుంభకోణంలోకెల్లా కీలకమయినవి, అతితక్కువగా చర్చించబడుతున్నవి. ఇంతకూ అసలెవరీ జైన్ సోదరులు?

### భారత దళారీ బూర్జువా వర్గపు ఆదర్శ ప్రతినిధులు

హవాలా కుంభకోణం ప్రాచుర్యంలోకి రాకముందు జైన్‌ల గురించి విని వుండకపోవచ్చును. కానీ ఛత్తీస్‌ఘడ్ ముక్తిమోర్చా నాయకుడూ, మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ నాయకుడూ అయిన శంకర్‌గుహ నియోగి 1992లో హత్య చేయబడిన సంగతి గుర్తుండే వుంటుంది. భిలాయి ఇండస్ట్రియలిస్టు అసోసియేషన్ నాయకత్వమే ఈ హత్య చేయించిందన్న విషయం బహిరంగ రహస్యమే. ఆ అసోసియేషన్ నాయకత్వం ఈ జైన్‌లదే. ఢిల్లీకి చెందిన ఒక మోస్తరు సంపన్న కుటుంబీకులు జైన్‌లు. 1956లో (పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ రంగంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేసిన రెండవ ప్రణాళిక ప్రారంభమైన సంవత్సరం) భిలాయ్‌కి చేరి అక్కడ ప్రభుత్వ రంగంలో నిర్మించబడుతున్న భిలాయి ఉక్కు కర్మాగారపు కాంట్రాక్టులు చేపట్టారు. 1970ల నడిమికల్లా జైన్‌లు ఇంజనీరింగ్, విద్యుత్, ఎరువులు, గనులు, సిమెంటు, ఫుడ్‌ప్రాసెసింగ్ తదితర రంగాలకు విస్తరించిపోయారు. (జైన్ సోదరులు ముగ్గురు ఎస్.కె.జైన్, ఎన్.కె.జైన్, బి.ఆర్.జైన్. ఇక జైన్‌ల ముడుపుల ఖాతాను డైరీలో వివరంగా రాసిపెట్టిన జె.కె.జైన్ వీరికి దగ్గరి బంధువు, అత్యంత నమ్మకస్తుడు) రాజకీయ నాయకుల ప్రాపకంతో, అధికారుల అండదండలతో త్వరత్వరగా ఎదిగిపోయి టాటాలు, బిర్లాల సరసన నిలవాలన్నది తమ లక్ష్యమనీ, ఈ విషయంలో రెండు దశాబ్దాల్లో అగ్ర కార్పొరేట్ సంస్థగా ఎదిగిపోయిన అంబానీలు (రిలయన్స్) తమకు ఆదర్శమనీ ఎస్.కె.జైన్ సి.బి.ఐ.కి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు.

1970ల మధ్యనుండీ ఎస్.కె.జైన్ ఢిల్లీలోని అధికారులకూ, రాజకీయ నాయకులకూ లంచాలు మేపుతూ విదేశీ గుత్తసంస్థలకు ప్రాజెక్టులను సంపాదించి పెట్టడం ప్రారంభించాడు. జైన్‌లు ప్రధానంగా విద్యుత్, స్టీలు రంగాలలో తమ కార్యకలాపాలు కేంద్రీకరించారు. ఫ్రాన్స్‌కు చెందిన అల్‌స్తోమ్ అనే గుత్తసంస్థకు ఎన్.టి.పి.సి నుండి కవాస్ విద్యుత్ ప్రాజెక్టునూ, ఫ్రాన్స్‌కే చెందిన సెజిలాక్ కన్సార్టియమ్‌కు ఎన్.హెచ్.పి.సి నుండి దుల్హస్తి ప్రాజెక్టును; స్వీడన్‌కు చెందిన స్కాంకా, ఎ.బి.బి. సంస్థలకు యురీ ప్రాజెక్టును జైన్‌లు సంపాదించి పెట్టారు. ఈ వ్యవహారంలో రాజీవ్‌గాంధీకి మిత్రుడూ, ఇటాలియన్ గుత్తసంస్థ సామ్ ప్రొగెట్టి ప్రతినిధీ అయిన ఖత్రోచీ కీలకమైన పాత్ర నిర్వహించాడు. ఆ బహుళజాతి సంస్థలు ఈ కాంట్రాక్టుకోసం రాజకీయ నాయకులకు, అధికారులకూ చెల్లించాల్సిన లంచాలనూ, దళారీలుగా పనిచేసిన జైన్‌లకు చెల్లించాల్సిన కమిషన్‌నూ హవాలా మార్గాల ద్వారా పంపారు. జైన్ డైరీలలో పేర్కొన్న 65.47 కోట్ల రూపాయాలలో 80శాతం పైగుత్తసంస్థలు చెల్లించినవే.

రాజకీయ నాయకులకూ అధికారులకూ లంచాలు మేపి ఇలా ప్రాజెక్టులు సంపాదించి పెట్టినందుకుగాను జైన్‌లకు సామ్రాజ్యవాద గుత్తసంస్థలు కమిషన్ చెల్లించడం మాత్రమేగాక ఆ ప్రాజెక్టులలో కొన్ని పనుల కాంట్రాక్టులను కూడా ఇస్తాయి. రష్యన్ పబ్లిక్‌రంగ సంస్థలు అయిన త్యాజాపెర్మో జైన్‌లకు ముడుపులు చెల్లించిన వ్యవహారం కొంత ఆసక్తికరంగా వుంటుంది. దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్ ఆధునీకరణ పనులు చేపట్టటానికి ఆ సంస్థకు జైన్‌లు అనుమతి సంపాదించి

# హవాలా మార్కెట్ : నల్లధనపు అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ

హవాలా వ్యాపారమంటే చట్ట విరుద్ధమైన విదేశీ మారకద్రవ్య లావాదేవీలని అర్థం. సంపన్నవర్గాలూ, రాజకీయ నాయకులూ, అధికారులూ తమ అక్రమార్జనను (బ్లాక్‌మనీని) విదేశాలకు తరలించడానికీ, విదేశాలలోని తమ అక్రమ అర్జనను, ఆస్తులను దేశంలోకి తేవడానికీ ఈ హవాలా మార్గాన్నే అనుసరిస్తారు. అందువలన హవాలా మార్కెట్ అంటే విదేశీ మారకద్రవ్య బ్లాక్‌మార్కెట్ అని చెప్పవచ్చు. ఇది ప్రపంచమంతటా విస్తరించి వున్న సమాంతర ద్రవ్యవ్యవస్థ. మన దేశంలోనేకాదు అమెరికాలో అయినాసరే అక్రమ ఆర్జన ఈ హవాలా దారుల్లో ప్రవహించ వలసిందే. అమెరికా వీధుల్లో డ్రగ్స్ (మాదకద్రవ్యాల) అమ్మకం ద్వారా లభించే సొమ్ము కూడా మెక్సికో, కెనడాల ద్వారా యూరప్‌కూ, ఇంకా యితర దేశాలకూ హవాలా మార్గాల గుండానే చేరుతుంది. సి.ఐ.ఏ. వంటి సామ్రాజ్యవాద గూఢచారి సంస్థలు వివిధ దేశాలలో సాగించే విద్రోహ కార్యకలాపాలకు నిధులు కూడా ఇలాంటి మార్గాల ద్వారానే ప్రధానంగా అందుతుంటాయి.

హవాలా వ్యాపారులు రకరకాల పద్ధతుల్లో తమ కార్యకలాపాలు సాగిస్తుంటారు. చేర్చవలసిన వారికి కరెన్సీని స్వయంగా అందించడం ఒక పద్ధతి. సాధారణంగా హవాలా వ్యాపారులు వివిధ దేశాలలో బోగస్ ఎగుమతి, దిగుమతుల సంస్థలను స్థాపించి దేశంలోని బోగస్ ఎగుమతి దిగుమతి సంస్థల ద్వారా విదేశాలకు ఎగుమతులు చేసినట్లుగా చూపి విదేశీ మారకద్రవ్యాన్ని ఈ ఎగుమతి సంస్థల ఖాతాలో జమచేస్తారు. అలాగే, దిగుమతులు చేసుకొన్నట్లుగా చూపి దేశం నుండి నిధులను విదేశీ కరెన్సీగా యితర దేశాలకు తరలిస్తారు. అలా చేరవలసిన దేశాలలోకి చేరిన డబ్బును ఆ వ్యక్తులకు అందజేస్తారు.

హవాలా లావాదేవీలలో చాలా భాగం బ్యాంకుల ద్వారానే జరుగుతుంటాయి. జైన్ డైరీలు వెల్లడయిన తరువాత, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జరిపిన విచారణలో స్వదేశీ, విదేశీ బ్యాంకుల ద్వారా హవాలా కార్యకలాపాలు సాగుతున్నాయని వెల్లడి అయింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల కలకత్తా బ్రాంచీలూ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ బికినర్ అండ్ జైపూర్, సౌత్ ఇండియా బ్యాంక్, యుకోబ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండోర్‌ల బొంబాయి బ్రాంచీలు ఇలాంటి హవాలా లావాదేవీలు జరిపాయని వెల్లడిఅయింది. విదేశీ బ్యాంకులలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు తను విదేశీ మారకద్రవ్య నిబంధనల నుల్లంఘించి హవాలా కార్యకలాపాలు జరిపానని స్వయంగా అంగీకరించింది కూడా.

మనదేశ స్థూల జాతీయోత్పత్తి (GDP)లో 1/3వవంతు అంటే 280 బిలియన్ డాలర్లు లేదా 2,00,000 కోట్ల రూపాయలు నల్లధనముందని రిజర్వ్‌బ్యాంక్ చెబుతున్నది. ఏటా కొత్తగా కనీసం 40,000కోట్ల రూపాయల నల్లధనం ఉత్పన్నమవుతోందని అంచనా. ఈ నల్లధనాన్ని విదేశీ బ్యాంకులలో దాచుకోవాలన్నా, ఆ డబ్బుతో విదేశాల్లో ఆస్తులు కొనుక్కోవాలన్నా హవాలా మార్కెట్ నాశ్రయించవలసిందే తప్ప గత్యంతరం లేదు. ఈ హవాలా కార్యకలాపాల ద్వారా ఏటా కనీసం ఎనిమిది బిలియన్ డాలర్ల పెట్టుబడి దేశం నుండి పలాయనం చిత్తగిస్తుందని అంచనా. దేశంలోని కోటీశ్వరులంతా, మంత్రులూ, అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలూ, ఉన్నత ప్రభుత్వాధికారులూ, ప్రభుత్వరంగ సంస్థల అధికారులూ అందరూ ఈ హవాలా మార్కెట్ కస్టమర్లే. ఎలా వచ్చిందని ఎలాంటి వివరాలూ చెప్పకుండానే దర్జాగా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి అవకాశాలు కల్పిస్తూ 1991లో పి.వి. ప్రభుత్వం రెండు పథకాలు కూడా ప్రవేశపెట్టింది. ఒక్క మొదటి ఏడాదే 2,300 మిలియన్ డాలర్లు ఈ పథకాల ద్వారా తెల్లధనంగా మారింది. విచిత్రమేమిటంటే హవాలా వ్యాపారాన్ని నిర్మూలించడం కోసమే రూపాయికి పూర్తి కన్వర్టిబిలిటిని కల్పిస్తున్నామని మన్మోహన్‌సింగ్ ప్రకటించాడు. రూపాయికి పూర్తి కన్వర్టిబిలిటీని కల్పించి మూడేళ్ళు దాటుతున్నా హవాలా వ్యాపారం నిర్మూలించ బడలేదు సరికదా మరింత విస్తరించింది.

మన దేశంలోని రాజకీయ నాయకులకూ, అధికారులకూ సామ్రాజ్యవాద గుత్తసంస్థలు చెల్లించే ముడుపులూ, బాబ్రీమసీదు విధ్వంసం కోసం సంఘ్‌పరివార్ సంస్థలు విదేశాలలో సేకరించిన నిధులూ, పేదజనాన్ని మభ్యపెట్టి, మోసపుచ్చి మూత్రపిండాల ''ఎగుమతి'' సాగించే డాక్టర్ల ''ఫీజులు'' (ఒక్క మూత్రపిండం వెల అంతర్జాతీయ మార్కెట్లో 20లక్షలు) ఇలా ఒకటేమిటి అన్నిరకాల అక్రమార్జనా దేశంలోకి ఈ హవాలా మార్గాలద్వారానే ప్రవేశిస్తుంది.

ఇప్పుడు హవాలా కుంభకోణం పేరిట నడుస్తున్న జైన్‌డైరీల కేసులో ఈ హవాలా డబ్బు ప్రముఖపాత్ర నిర్వహించింది. 1991లో సిబిఐ, కాశ్మీర్ మిలిటెంట్లకు హవాలా మార్గాలద్వారా డబ్బు పంపుతున్నవారి గురించి దర్యాప్తు ప్రారంభించింది. అలా జరిపిన ఆ దాడులలో జైన్‌డైరీలు దొరికాయి. జైన్‌లు హవాలా మార్గాల ద్వారా సామ్రాజ్యవాద గుత్తసంస్థల నుండి నిధులు అందుకుని దేశంలోని అన్ని పాలకవర్గ రాజకీయ పార్టీల నేతలకూ, ఉన్నతాధికారులకూ ముడుపులు చెల్లించారన్న వాస్తవాలను ఆ డైరీలు వెల్లడిచేసాయి. ఖంగుతిన్న సిబిఐ హడావిడిగా ఆ జైన్‌డైరీలను వదుల్చుకోవాలని ప్రయత్నించింది. హవాలా కార్యకలాపాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటు క్రిందికి వస్తాయి కాబట్టి హవాలా కార్యకలాపాల కేసును వారికి అప్పగించి చేతులు దులుపుకుంది. ఇప్పుడు సిబిఐ అవినీతి కార్యకలాపాల నిరోధక చట్టం క్రింద జైన్‌ల నుండి ముడుపులు అందుకున్న వారిపైన మాత్రమే దర్యాప్తు జరుపుతున్నది. హవాలా వ్యాపారానికి ప్రాణం అక్రమార్జన. అక్రమార్జనను అరికట్టడం అక్రమార్జనపైనే ఆధారపడి బతుకుతున్న ఆర్థిక రాజకీయ వ్యవస్థకు అసాధ్యం. అక్రమార్జనకు నూతన రహస్య మార్గాలను తెరుస్తున్న లిబరలైజేషన్, గ్లోబలైజేషన్‌ల పట్ల వామపక్షాలతోసహా అన్ని పాలకవర్గ పార్టీలూ విధేయతను ప్రకటిస్తున్నవే. కనుక వాటిలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అక్రమార్జన, హవాలా వ్యాపారం నిరాటంకంగా సాగులాయనడం నిస్సందేహం.

పెట్టారు. అందుకు రాజీవ్‌గాంధీ కోరినట్లు 10.5 కోట్లు చెల్లించాడు కూడా. అయితే ల్యాజాపెర్మో ప్రభుత్వరంగ సంస్థ కాబట్టి జైన్‌లకు మధ్యవర్తి కమిషన్ చెల్లించడానికి అవకాశంలేదు. అందువలన అది జైన్‌లకు వారి భిలాయి ఇంజనీరింగ్ కార్పోరేషన్ పేరిట 15కోట్లు చెల్లించింది. ఆ 15 కోట్ల రూపాయలను భిలాయి ఇంజనీరింగ్ కార్పోరేషన్ ల్యాజాపెర్మోకు చేసే ఎగుమతుల ధరలు ఎక్కువగా చూపి సర్దుబాటు చేసారు.

బోఫోర్స్ కుంభకోణంలో విన్‌ఛద్దా నిర్వహించిన దళారీ (మధ్యవర్తి) పాత్రనే జైన్‌లూ నిర్వహించారు. జైన్‌లేకాదు దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలంతా, బడా వ్యాపారులంతా అనుసరించినదీ, అనుసరిస్తున్నదీ ఇదే మార్గం. అందువలన జైన్‌లు ఎవరంటే భారత దళారీ బూర్జువా వర్గపు మచ్చుతునకలని చెప్పవచ్చు. కాకపోతే జైన్‌లు యాక్సిడెంటల్‌గా యిలా బైటపడిపోయారు. ఇలాంటి కుంభకోణాలలో ఇరుక్కుంటే రక్షించడానికే వున్న సి.బి.ఐ. ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా ముగించాలనే చూసింది. మొదట ఈ కేసు పరిశోధన చదివిన సి.బి.ఐ. డి.ఐ.జి. గోపీశర్మ ఈ కేసు కీలకమైనదని గ్రహించి జైన్‌ను 10 లక్షలు లంచం అడిగాడు. జైన్ సి.బి.ఐ. ఉన్నతాధికారులకు తెలియజేసి శర్మ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించాడు. సి.బి.ఐ. డి.ఐ.జి. గోపీశర్మ ఆ కసికొద్దీ జైన్ డైరీ వివరాలను సకల ఆధారలతోసహా లీక్ చేయకుంటే జైన్‌లు నేడు మరో అంబానీలుగా మారే దిశగా వరుసలు తీస్తుండేవారు.

రెండు దశాబ్దాల కాలంలో అంబానీలు కార్పోరేట్ కింగ్‌లుగా మారినది సామ్రాజ్యవాద గుత్తసంస్థలకు దళారీలుగా పనిచేసే కదా? రాజకీయ నాయకులకు అధికారులకు లంచాలు మేపేకదా? పారిశ్రామికవేత్తలకు, రాజకీయ పార్టీలకు మధ్య ఈ అనుబంధం ఈనాటిది కాదు. బిర్లా, బజాజ్ వంటి పారిశ్రామికవేత్తలకు గాంధీతో వున్న అనుబంధం వారు కాంగ్రెస్‌కు నిధులు సమకూర్చడం ఎవరెరుగనిది? రాజకీయ నాయకులు కోట్ల ఆస్తులను అక్రమంగా ఆర్జించడం నెహ్రూ హయాం నుండి వున్నదే. పారిశ్రామికవేత్తల నుండి నిధులు పోగుచేయడంలో స్విస్‌బ్యాంకులలో దాచుకోవడంలో ఇందిరాగాంధీకున్న పేరు ప్రఖ్యాతులు ఎవరెరుగనిది? వామపక్షాలతో సహా అధికార, ప్రతిపక్ష పార్లమెంటరీ పార్టీలన్నీ అవినీతి రొచ్చుగుంటలో బతుకుతున్న కీటకాలేనని, బడా పారిశ్రామిక వ్యాపారవర్గాల నుండి ముడుపు లందుకుంటున్నవే నన్న విషయం బహిరంగ రహస్యమే కదా. అవినీతిపరులైన రాజకీయ నాయకులు శిక్షించబడాలని కోరుకోవడం పూర్తిగా సమంజసమే. అయితే ఇంతకు లంచాలు మేపినవాళ్లు ఎందుకు మేపినట్లు? దేశ సంపదను, ప్రజల ఆస్తులను కొల్లగొట్టడానికే కదా. మరి దేశాన్ని ప్రజలను ప్రాజెక్టుల పేరిట, కాంట్రాక్టుల పేరిట కొల్లగొట్టిన కొల్లగొడుతున్న బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు బోనెక్కేదెన్నడు? జైన్‌ల దగ్గర ముడుపు లందుకున్నవారిని శిక్షించమని కోరుదాం సరే. జైన్ ద్వారా ముడుపులు చెల్లించిన సామ్రాజ్యవాద గుత్తసంస్థలను శిక్షించేదెన్నడు? ఇంటి తలుపులు తెరిచినవాడిని శిక్షించాలని కోరడం సరే, ఇంటిని దోచుకుపోయిన దొంగలను పట్టేదెన్నడు?

**అవినీతి అంతర్జాతీయాకరణ**

భారతదేశం వంటి వెనుకబడిన దేశాలను కొల్లగొట్టడంకోసం ఆ దేశాల ప్రభుత్వాలకూ, ప్రభుత్వాధికారులకూ అంతర్జాతీయ గుత్తసంస్థలు బహిరంగంగానే లంచాలిస్తున్నాయి. ఫ్రాన్స్ వంటి అనేక సామ్రాజ్యవాద దేశాలలో ఇలా ఆ సంస్థలు చెల్లించే లంచాలకు పన్నులలో రాయితీలు కూడా ఇస్తారు. అమెరికా లాంటి దేశాల్లో ఈ లంచాలను నేరుగా లంచాలుగా ఇవ్వడానికి లేదు. అక్కడి గుత్తసంస్థలు మధ్యవర్తులుగా ఎవరినైనా పెట్టుకుని వారికి కమిషన్ చెల్లిస్తాయి. ఆ మధ్యవర్తుల నుండి చేరవలసిన నాయకులకో లేక అధికారులకో ముడుపులు చేరుతాయి. ఈ పద్ధతిలో చెల్లించే లంచాలను ''కిక్‌బ్యాక్స్'' అంటారు (బోఫోర్స్ సంస్థ ఈ పద్ధతిలోనే రాజీవ్‌గాంధీకి లంచాలు చెల్లించింది).

సామ్రాజ్యవాద గుత్తసంస్థలతో మూడవ ప్రపంచదేశాల పాలక వర్గాలకున్న ఈ అవినీతి అనుబంధమూ, నల్లధనపు అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థయైన హవాలా మార్కెట్‌లతో వారికున్న అనుబంధమూ నానాటికీ బలపడుతున్నాయి. తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సామ్రాజ్యవాద ఆర్థికవ్యవస్థ మున్నెన్నటికన్నా నేడు ఎక్కువగా మూడవ ప్రపంచ దేశాలను కొల్లగొట్టడం ద్వారా బతికి బట్టకట్టాలని ప్రయత్నిస్తున్నది. పి.వి. ప్రభుత్వం లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలనూ, వ్యవస్థీకృత సర్దుబాట్ల కార్యక్రమాన్నీ (SAP) అమలు పరచడం ద్వారా సామ్రాజ్యవాద గుత్తసంస్థల దోపిడీకి రాజమార్గాన్ని వేసిన విషయం తెలిసినదే. ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం కారణంగా సామ్రాజ్యవాద గుత్తసంస్థల మధ్య విపరీతంగా పెరిగిపోయిన పోటీ అవినీతిని అంతర్జాతీయం (గ్లోబలైజ్) చేస్తున్నది.

గత ఐదేళ్లుగా మన దేశంలో నూతన ఆర్థిక విధానాలు అమలు జరుగుతున్నాయి. గత ఐదేళ్లుగానే మున్నెన్నడూ ఎరుగని విధంగా అసంఖ్యాకంగా కుంభకోణాలు బయటపడుతున్నాయి. ఇవి కాకతాళీయకంగా ఒకేసారి జరుగుతున్న రెండు వేరువేరు పరిణామాలు కాదు. అవినీతి యిలా పెచ్చుపెరిగి పోవడానికి, తామర తంపరలా కుంభకోణాలు పుట్టుకు రావడానికీ నూతన ఆర్థిక విధానాల పేరిట అమలు జరుగుతున్న లిబరలైజేషన్, గ్లోబలైజేషన్‌లు ఒక ప్రధాన కారణం. గత ఐదేళ్లుగా దేశంలోకి సామ్రాజ్యవాద గుత్తసంస్థలు పెద్దఎత్తున చొచ్చుకురావడమూ, భారత పాలకవర్గాలూ పాలకవర్గపార్టీలూ అధికారయంత్రాంగమూ అందిస్తున్న అండదండలతో అవి దేశాన్నీ ప్రజలనూ కొల్లగొట్టడమూ, ఆ క్రమంలో దళారీ, బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గమూ వారి రాజకీయ ప్రతినిధులూ అధికార యంత్రాంగమూ ఆర్జిస్తున్న నల్లధనం విపరీతంగా పెరిగిపోవడమూ, తత్పర్యవసానంగా హవాలా మార్కెట్ కార్యకలాపాలు విస్తరించి దేశ సంపదా పెట్టుబడులూ సామ్రాజ్యవాద దేశాలకు తరలిపోవడమూ, అలా తరలిపోయిన దేశసంపదే హవాలా నిధులుగా దేశంలోకి తిరిగి ప్రవేశించి దేశ రాజకీయ వ్యవస్థను శాసిస్తుండడమూ అనేదే హవాలా కుంభకోణం సారాంశం.

జైన్ డైరీల కుంభకోణం ఆవిష్కరిస్తున్న యీ సమగ్ర చిత్రంలోని ఒక అంశంపైన మాత్రమే, అదీ కూడా అందరికీ సుపరిచితమైన పాలకవర్గ రాజకీయ పార్టీల, అధికార యంత్రాంగపు అవినీతి అక్రమార్జనలన్న ఒక్క అంశంపైకే ప్రజల దృష్టిని మరల్చడం కోసం పాలకవర్గాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. జైన్ డైరీలు నగ్నంగా వెల్లడిచేస్తున్న భారత పాలకవర్గాల దళారీ స్వభావాన్ని మరుగుపరచడం

ద్వారా ప్రజలలో నేటి సామాజిక ఆర్థిక వ్యవస్థపట్ల విశ్వాసం పూర్తిగా నశించిపోకుండా కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నాయి.

**కుళ్ళికంపుకొడుతున్న సామాజిక వ్యవస్థకు అత్తరు పూస్తున్న న్యాయవ్యవస్థ**

సుప్రీంకోర్టు ఈ కేసు విషయంలో చూపిన చొరవ నాధారం చేసుకుని రాజకీయరంగాన్ని, ప్రభుత్వయంత్రాంగాన్నీ ప్రక్షాళనం చేయగల శక్తిగా న్యాయవ్యవస్థను చిత్రించాలని ప్రయత్నిస్తున్నారు. సారాంశంలో పరమ అభివృద్ధి నిరోధక నియంతృత్వంగా నానాటికీ మారుతున్న భారత రాజకీయ వ్యవస్థను అతిచక్కని ప్రజాస్వామ్యంగా నమ్మించాలని ప్రయత్నిస్తున్నాయి. ఒకే సామాజిక ఆర్థిక వ్యవస్థ నుండి పుట్టుకొచ్చి, ఆ వ్యవస్థ పరిరక్షణ కోసమే నిలిచివుండే రాజ్యాంగ యంత్రంలోని ఒక విభాగమైన న్యాయవ్యవస్థను వేరుచేసి, దానిని సర్వ స్వతంత్రమైనదిగా, నిష్పాక్షికమైనదిగా, అభివృద్ధికరమైనదిగా చూపాలన్న ప్రయత్నం ఉద్దేశపూర్వకంగానే జరుగుతుంది. మన న్యాయస్థానాల్లో దొరికే న్యాయం ఎలాంటిదో ఏ వర్గన్యాయమో దేశంలోని సాధారణ పౌరుడు ఎవరైనా లేదా భోపాల్ బాధితుల్లో ఎవరైనా చెబుతారు. అవినీతి, లంచగొండితనాలకు న్యాయవ్యవస్థ ఎన్నడూ అతీతంగా ఉండలేదన్నది తిరుగులేని వాస్తవం. న్యాయస్థానాలు ఎప్పుడూ ఉన్నతవర్గాల పక్షమే వహిస్తూ ఉన్నాయన్నది కూడా అంతే తిరుగులేని వాస్తవం. కాగా న్యాయవ్యవస్థ నిష్కళంకమైనది, నిష్పాక్షికమైనదంటూ పాలకవర్గ మేధావులు బాకాలు ఊదుతున్నారు. మన న్యాయవ్యవస్థలోని నిష్పాక్షికత్వమంటే నేతిబీరకాయలోని నెయ్యేనని నిన్నటి మండల్ కమీషన్ వివాదం, బాబ్రీమసీదు వివాదం పరిపోవా? హిందూత్వమంటే మతోన్మాదం కాదంటూ సంఘపరివారపు బాకాగా మారింది అత్యున్నత న్యాయస్థానం కాదా? ఆ తీర్పు యిచ్చింది హవాలా కేసులో చొరవచూపిన జస్టిస్ వర్మనే కాదా? ప్రైవేటైజేషన్ చెయ్యడానికి ప్రభుత్వానికి తిరుగులేని హక్కు ఉందంటూ టెలికాం ప్రైవేటైజేషన్ కేసులో తీర్పునిచ్చినది సుప్రీంకోర్టు కాదా? మారుతున్న పాలకవర్గ ప్రయోజనాల కనుగుణంగా న్యాయవ్యవస్థ నేడు అతిచక్కగా తనను తాను సర్దుబాటు చేసుకుంటున్నది, రోజురోజుకూ మరింత అభివృద్ధి నిరోధక స్వభావాన్ని సంతరించుకుంటున్నది. రాజ్యాంగ యంత్రంలోని తమ సహవిభాగాలైన శాసన, పరిపాలనా విభాగాలపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయిన తరుణంలో న్యాయవిభాగం నేడు ముందుకు వస్తున్నది. శిథిలమైపోతున్న సామాజిక వ్యవస్థను తాను సంస్కరించ గలనంటూ వ్యవస్థపైన ప్రజలకున్న భ్రమలను కాపాడాలని ప్రయత్నిస్తున్నది. ఉద్దేశపూర్వకంగానైనా, కాకపోయినా న్యాయమూర్తులు — వర్మగాని, వి.సి.గుప్తాగాని నేడు చేస్తున్నదదే. ఎన్నికల సంస్కరణల పేరిట బూటకపు ప్రజాస్వామ్యంపై భ్రమలు కల్పించడానికి నిన్న శేషన్ చేసింది అదే. శేషన్‌గాని, వర్మగాని పాలకవర్గ రాజ్యాంగయంత్రంలో భాగంగా వున్న మరెవరైనాగాని, వారి ఉద్దేశాలు ఏవైనాగాని పాలకవర్గాల ప్రయోజనాలను యీడేర్చే వరకు హీరోలుగా కీర్తించబడతారు. ఆ పరిధిని దాటితే అనామకులై పోతారు.

**తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాజకీయవ్యవస్థ**

ఏదేమైనా ఈ హవాలా కుంభకోణం పాలకవర్గాల మధ్యనున్న వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేసి పాలకవర్గాలలోని వివిధ ముఠాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటరీ పార్టీలన్నీ తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఒకరి గోత్రాలు ఒకరు బైటపెట్టుకుంటూ పార్లమెంటరీ పార్టీలన్నీ వాటి నీలిబాహ్య చరిత్ర నంతటినీ ప్రజల ముందుంచుతున్నాయి. సి.బి.ఐ.ని వాడుకుని హవాలా వరదలో చిక్కుబడకుండా గట్టున కూర్చుందా మనుకున్న పి.వి భ్రష్ట చరిత్రను ప్రతిపక్షాలు బహిర్గతం చేస్తున్నాయి. ప్రధానికి జైన్‌లు రూ. 3.5 కోట్లు చెల్లించిన విషయాన్నీ, తన ప్రభుత్వంపై విశ్వాసరాహిత్య తీర్మానానికి వ్యతిరేకంగా జార్ఖండ్ ముక్తిమోర్చా ఓట్లను ఒక్కొక్కరికి 40 లక్షలు చెల్లించి పి.వి. కొన్న విషయాన్ని బిజెపి బైట పెట్టింది. సి.బి.ఐ. చేతిలోనే వున్న సెయింట్‌కిట్స్ వ్యవహారంలో అప్పట్లో విదేశాంగమంత్రిగా వుంటూ పి.వి. ఫోర్జరీకి పాల్పడిన విషయాన్ని ప్రతిపక్షాలు ఇప్పుడు తమ చాపక్రిందకు నీళ్లు వచ్చాక విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. స్వచ్ఛమైన పాలన నిస్తానంటూ అధికారం చేపట్టనున్న పార్టీగా తనను తాను వర్ణించుకుంటున్న బిజెపి అధ్యక్షుడు ఎల్.కె.అద్వాని హవాలా గడ్డి తిన్నందుకు బోనెక్కవలసి రావడంతో ఆ పార్టీ పని కుడితిలో పడ్డ ఎలకలా అయ్యింది. పైగా బొంబాయి బాంబు పేలుళ్ల కేసులో నిందితులూ, అంతర్జాతీయ మాఫియా నాయకుడు దావూద్ ఇబ్రహీం అనుచరులూ ఐన కిరాయి హంతకులకు ఆశ్రయ మిచ్చినందుకుగాను మంత్రి కల్పనాధ్‌రాయ్‌తోపాటు బిజెపి ఎం.పి. బ్రిజ్‌భూషన్ శరణ్‌సింగ్ కూడా అరెస్టయ్యాడు. దీనితో దేశభక్తి అంటూ గావుకేకలు వేసే బి.జె.పి. కూడా మాఫియాగ్యాంగుల, క్రిమినల్ గ్యాంగుల పార్టీ అని స్పష్టంగా వెల్లడయింది.

ఇదిలా వుండగా ఈ కుంభకోణం అన్ని పార్టీలలోనూ ముఠాల కుమ్ములాటను తీవ్రతరం చేసింది. హవాలా దెబ్బతిన్న కాంగ్రెస్ నేతలంతా పి.వి.తో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నారు. తమ హవాలా సోదరులైన అర్జున్‌సింగ్, తివారీలతో మంతనాలు సాగిస్తున్నారు. కాగా పి.వి మొట్టమొదటిసారిగా జిల్లాస్థాయి నాయకులతో స్వయంగా సంబంధాలు పెట్టుకుని, వారి సహాయంతో పార్టీలో తనపై జరుగనున్న తిరుగుబాటును ఎదుర్కోవడానికి సిద్ధమౌతున్నాడు. రాజీవ్‌గాంధీ 10.5కోట్లు హవాలా గడ్డి మేసినట్లుగా తిరుగులేని విధంగా బైటపడ్డంతో, బోఫోర్సు కేసు ఇంకా కొనసాగుతుండడంతో సోనియాగాంధీ ఈసారి ఎన్నికల్లో కూడా తెరవెనుక రాజకీయాలకే పరిమితంగాక తప్పడంలేదు. ఇక బి.జె.పి.లోని మురళీ మనోహర్‌జోషి వర్గం బహిరంగంగానే అద్వానిపై దాడికి దిగుతున్నది. అద్వానీ మెక్కిన హవాలా నిధులు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నది. ప్రధాని పదవికి అభ్యర్థిగా ముందుకి తెచ్చిన వాజ్‌పేయిపై అద్వానీ, జోషిల ముఠాలు గోతులు తవ్వుతున్నాయి. ఇక అంతర్గత కలహాలతో ముక్కలు చెక్కలు కావడంలో రికార్డు సృష్టించిన జనతాదళ్‌లో ఈ హవాలా దెబ్బకు ముఠాకలహాలు తారాస్థాయికి చేరాయి. హవాలా గడ్డిమేసిన అధ్యక్షుడు బొమ్మయ్‌ని గద్దెదింపడానికి ఆ పార్టీ నాయకులు నానాపాట్లుపడ్డారు. ఇహ లల్లూప్రసాద్‌యాదవ్ అధ్యక్షస్థానం చేపట్టిన వెంటనే 1000కోట్ల బీహారు పశుగ్రాస కుంభకోణం బయటపడింది. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లైంది ఆ పార్టీ పని. మూడవ ప్రత్యామ్నాయ మంటూ గంతులేసిన సి.పి.ఐ., సి.పి.ఎమ్.లు చతికిలపడ్డాయి.

వామపక్ష పార్టీలు కూడా క్రింది నుండి పైదాకా అవినీతిలో మునిగి తేలుతున్నాయని వామపక్ష నేతలైన నృపేన్‌చక్రవర్తి, వినయ్ చౌదరీలే స్వయంగా వెల్లడి చేస్తుండడంతో హవాలా మురికి అంటని పార్టీలుగా చెప్పుకుంటున్న రివిజనిస్టు పార్టీలకు గొంతులో వెలక్కాయ పడ్డట్లైంది. ఇలా హవాలా దుమారానికి పాలకవర్గ పార్టీల ముసుగులన్నీ తొలగిపోయాయి. విచిత్ర మేమిటంటే తాడిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికోసమన్నట్లుగా, ప్రభుత్వమే రాజకీయ పార్టీల ఎన్నికల వ్యయాన్ని భరించకపోవడం వల్లనే తాము అడ్డమైన గడ్డి కరవవలసి వస్తుందంటూ ఈ పార్టీలు సిగ్గువిడిచి చెబుతున్నాయి.

హవాలా కుంభకోణంకు సంబంధించిన చిల్లరమల్లర విషయంపైన చర్చలు రేకెత్తించడం ద్వారా గత ఐదేళ్లుగా అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణల దుష్ఫలితాల నుండి ప్రజల దృష్టిని మరల్చాలని ప్రయత్నిస్తున్నారు. తాత్కాలికంగా వారి ఈ ప్రయత్నం కొంతమేరకు సఫలం కావచ్చునేమో కూడా. అయితే సి.బి.ఐ. పి.విపైన ఛార్జిషీటు పెడుతుందా లేదా? పి.వియే సి.బి.ఐ. చేత ఛార్జిషీట్లు దాఖలు చేయించాడా లేదా? చంద్రస్వామి, సతీష్‌చంద్రలు నిజంగానే 3.5 కోట్లు అందించారా లేక పి.వి పేరు చెప్పి తామే దిగమింగారా? అద్వాని అంటే ఎల్.కె.అద్వానీయేనా? సి.బి.ఐ. స్వతంత్రమైన సంస్థగా పనిచేస్తున్నదా లేదా? సుప్రీంకోర్టు సి.బి.ఐ.పైన అజమాయిషీ చేయవచ్చునా? న్యాయ విభాగం శాసన విభాగాన్ని శాసించవచ్చునా? న్యాయవ్యవస్థ చురుకైన పాత్రను నిర్వహించడం తగునా? వంటి ప్రశ్నలు ప్రజల ఆకలి మంటలను చల్లార్చజాలవు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను మటుమాయం చేయజాలవు. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అడ్డజాలవు. ఈ విషయం అందరికన్నా ఎక్కువగా పాలకవర్గాలకే తెలుసు. అందువల్లనే పాలక వర్గాలు మెల్లమెల్లగా నగ్ననియంతృత్వం కావాలని బయటపడు తున్నాయి. ఆర్థిక సంస్కరణల నత్తనడకకు ఎన్నికలే కారణమంటూ బడాపారిశ్రామిక వ్యాపారవర్గాలు అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నాయి. దేశంలో వున్న నామమాత్రపు ప్రజాస్వామ్యమే ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా మారిందంటూ మరికొందరు వాపోతున్నారు. మన దేశానికి సైనిక నియంతృత్వమే ఇప్పుడు అవసరమంటూ అప్పుడే కొందరు సెలవిస్తున్నారు కూడా. ప్రస్తుత రాజకీయ వ్యవస్థపైన ప్రజలు పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోతున్న పరిస్థితి పాలకవర్గాలకు అత్యంత ప్రమాదకరం. కాబట్టి పాలకవర్గాలు ఫాసిజాన్ని తెచ్చే అవకాశం కూడా ఉందని గుర్తుంచుకోవాలి.

హవాలా కుంభకోణం వెలుగులో బయటపడుతున్న పాలకవర్గాల దళారీ స్వభావాన్ని, నీతిబాహ్య చరిత్రనూ, విప్లవకారులు ప్రజలకు వివరించి చెప్పాలి. పాలకవర్గాల అవినీతి అక్రమార్జనలకు వ్యతిరేకంగా విశాలమైన ఆందోళన చేపట్టాలి. ఈ ఆందోళనను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా ఎక్కుపెట్టవలసి వుంది. అన్నిటికీ మించి సామాజిక అశాంతి, ప్రజల అసంతృప్తి రోజురోజుకూ తీవ్రతర మౌతున్న నేటి పరిస్థితులలో పాలకవర్గ రాజకీయ వ్యవస్థ ఇలా సంక్షోభంలో కూరుకుపోవడం విప్లవానికి చాలా అనుకూలమైన పరిస్థితిని సృష్టిస్తుందని గుర్తించాలి. ఆ పరిస్థితి నుపయోగించుకుని విప్లవశక్తులు ప్రజలకు నాయకత్వం వహించి భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషి చేయవలసివుంది. □

## ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టి బతుకును మార్చుకుంటున్న ఆదివాసీ ప్రజలు

విశాల దండకారణ్యంలో గల సహజ వనరులపై ఆదివాసీ ప్రజానీకానికి ఎలాంటి హక్కులేదు. ప్రకృతి సహజ సంపదనంతా తరలించుకుపోయి కోట్ల లాభాలు గడించడానికే దళారీ, సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు పోటీపడుతున్నారు. వారికే ఊడిగం చేసే భారత పాలకవర్గాలు, స్థానిక ప్రజల కనీస అవసరాలను కూడా తీర్చకుండా, అడవి సంపదను, వారి శ్రమను దోపిడీ చేస్తున్నాయి.

ఆదివాసీ వ్యవసాయం నేటికీ ప్రధానంగా వర్షాధారమే. దండకారణ్యంలో విస్తృతంగా నీటి వనరులున్నా, వ్యవసాయానికి నీరు దొరకడం లేదు. తాగడానికే నీటికొరత వున్న ఈ దేశంలో, వ్యవసాయానికి నీటిపారుదల వసతులెక్కడుంటాయి? గ్రామీణ ప్రాంతాల్లో కొద్దో గొప్పో చెల్లుబాటు వున్న కుటుంబాలు చిన్న చిన్న కుంటలు, చెరువులు నిర్మించుకుని వినియోగించుకుంటున్నా, మెజారిటీ ప్రజానీకానికి ఇలాంటి అవకాశమే లేదు. ప్రభుత్వం ఎన్నడూ కూడా నీటి గురించి ఆలోచించలేదు. ఆక్షన్ ప్లాన్ పేరిట (1988) మహారాష్ట్రలో, ప్రత్యేక బడ్జెట్టుల పేర మధ్యప్రదేశ్‌లో కోట్ల డబ్బు పోలీసు యంత్రాంగం ఆధునీకరణకు, బలగాల పెంపుదలకు, రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వాలు తగలేస్తున్నాయేతప్ప, ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలేదు.

ఆదివాసీ ప్రాంతాలలో అనారోగ్యం ఒక తీవ్ర సమస్య. మహమ్మారి జబ్బులు ప్రబలినప్పుడు గూడాలకు గూడాలే లేసిపోతుంటాయి. సరైన తాగునీటి వసతులు లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా ప్రబలే అంటువ్యాధులు ఎన్ని జీవాలను బలితీసుకుంటుందో చెప్పలేం. ముమ్మరమైన వ్యవసాయ పనుల ఒత్తిడి వుండే ఈ కాలంలోనే ఒకవైపు జనాలు, మరోవైపు పశువులు జబ్బులతో ఏ పనులు చేయలేకుండా ఉండిపోతాయి. జనాలందరికి పూజారి ఇచ్చే చికిత్సాలయాలు. ప్రాణాలకు కనీస గ్యారంటీలేని నాటు వైద్యాలతో, జీవచ్ఛవాల్లా మామూలు వ్యాధులకు కూడా దీర్ఘకాలం బాధపడుతుంటారు. ఈ పరిస్థితిని చక్కదిద్దే ఏ పథకము ప్రభుత్వం దగ్గరలేదు.

ఆదివాసీ ప్రాంతాలలో విత్తనాల సమస్య కూడా తీవ్రంగానే వుంది. పరిమితమైన దేశీయ వంగడాలతోనైనా సరైన వ్యవసాయోపకరణాలు, పద్ధతులు కూడా లేకుండా వుండడంతో పంట దిగుబడి కూడా నామమాత్రంగానే వుంటుంది. అన్నిరకాల విత్తనాలు అవసరం మేరకు అందజేసి, వ్యవసాయ పద్ధతులను సంస్కరించే ఎలాంటి ఆలోచన ప్రభుత్వం వద్దలేదు. అడవిలో లభించే కందమూలాలు, పళ్లతోనే ఆదివాసీ జీవితం 20వ శతాబ్దం చివరి పాదంలో కూడా గడవాల్సిందేతప్ప, మేలైన మొక్కలు అందజేసి ఆదివాసీల పోషక విలువలను పెంచే కార్యక్రమాలు ఏమీ చేపట్టడంలేదు. అటవీశాఖవారు నర్సరీల్లో పెంచే మొక్కలు మైదాన ప్రాంతాల్లోకి తరలించి, పిచ్చి తుమ్మలు అడవిలో నాటుతారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీల కనీస అవసరాలను తీర్చకుండా ప్రభుత్వం ఏ పనుల కుపక్రమించినా ప్రతిఘటించి, ప్రజా డిమాండ్లపై పోరాడాలని విప్లవ ప్రజాసంఘాలు నిర్ణయించుకున్నాయి. మౌలికమైన వ్యవసాయ నీటిపారుదల వసతులు లేకుండా, ప్రభుత్వ 'బలగాల' రాకపోకలకు ఆటంకంలేని విధంగా మారుమూల ప్రాంతాలలోకి కూడా రోడ్ల నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టిన ఏ పథకంలోనూ ప్రజావసరాలు మొదటి వరుసలో లేవు సరికదా, తమ జీవిత సమస్యలపై సమైక్యంగా పోరాడే ప్రజలను అణచివేసే విధానాలే ప్రభుత్వం ఎంచుకుని తుపాకుల నీడల్లో కొనసాగిస్తుంది. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వం మిలిటరీ సహాయంతో రోడ్లు పూర్తి చేస్తామని ప్రకటించింది. అయినా ప్రజలు ఒకవైపు తమ డిమాండ్లపై పోరాడుతూనే మరోవైపు సమిష్టిగా తమ అవసరాలను తీర్చుకోవడానికి నడుం బిగిస్తున్నారు. దోపిడీ ప్రభుత్వాలు తమ అవసరాలు తీరుస్తాయని ఎదురుచూడకుండా స్వశక్తితో తమ అవసరాలు తీర్చుకోవడానికి ప్రజలు ముందుకు వస్తున్నారు.

బాలాఘాట్ డివిజన్‌లో 50వేల రూపాయల ఖర్చుతో ప్రజలు 6 చెరువుల నిర్మాణాన్ని పూర్తి చేశారు. మరో రెండు చెరువులు పోలీసులు ఆటంకపర్చడంతో మధ్యస్థంగా నిలిచిపోయాయి. పర్సవాడ దళం ఏరియాలో పాలగొంది, కొడ్కా, మాటె, వొల్వెత్తూర్, టకారియా మరియు మలాజ్‌ఖండ్ ప్రాంతంలోని చవారియాలలో చెరువుల నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడ చెరువుల నిర్మాణంలో ప్రజలు బ్యాచీలవారీగా ఏర్పడి శ్రమలో పాల్గొంటున్నారు. వీరిలో యువతీ యువకులే ఎక్కువ. శ్రమ పరికరాలు ఎవరికి వారు తమ ఇంటినుండే తెచ్చుకున్నారు. శ్రమలో పాల్గొన్నవారికి ఆ రోజు సమిష్టి డబ్బుల్లో నుండే తిండి ఏర్పాట్లు చేసుకున్నారు. చెరువు నిర్మాణం పనులు 20 నుండి నెలరోజుల్లోగా పూర్తయ్యాయి. చెరువు నిర్మాణానికి గ్రామస్థాయిని బట్టి ముగ్గురు నుండి ఏడుగురితో కూడిన కమిటీ ఏర్పడి, దాని నాయకత్వానే పనులు పూర్తయ్యాయి. గతంలో ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం 'ఆరోగాటో' (శ్రమకు భోజనం) తిని వ్యక్తిగత పనుల కోసం శ్రమను వెచ్చించిన అనుభవమో, లేక ప్రభుత్వ, గ్రామపెద్దల ఆదేశాలపై వెట్టిచాకిరీలు చేసిన జీవితాలు అయిన తమ బతుకుల్లో 'ప్రజల కోసం, ప్రజల శ్రమతో' ప్రజోపయోగకరమైన పనులు నేడు విప్లవ ప్రజాసంఘాలు చేపట్టేసరికి గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ఉత్సాహం కనపడింది. ఈ 6 చెరువుల నిర్మాణ ప్రభావం అనేక గ్రామాలపైన పడింది. గెరిల్లా దళాలు కూడా తమ మొదటి ప్రయత్నానికి విజయం చేకూరడంతో మరింత పట్టుదలతో ప్రజాహిత కార్యక్రమాల కోసం ప్రజలను ఇంకనూ కదిలించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి.

ఆదివాసీ ప్రజానీకం ఆర్థిక, రాజకీయ డిమాండ్లపై ప్రభుత్వాన్ని నిలదీస్తే ఒంటికాలిపై వచ్చే పోలీసు బలగాలు, నేడు ప్రజలు సంక్షేమ కార్యక్రమాలకు సొంతంగా తలపడినా విడవడంలేదు. తమంత తాముగా ప్రజలు చైతన్యంతో చేసే ఏ పనికి తలపడినా, వెన్వెంటనే రంగంలోకి వచ్చే సాయుధ బలగాలను ప్రతిఘటించడానికి సిద్ధం కావాలని చెరువుల నిర్మాణం తెలుపుతుంది. పర్సవాడ ప్రాంతంలో రెండు చెరువులను పోలీసులు ఆటంకపరచడానికి రాగా, ప్రజలు ప్రతిఘటించి పనులు పూర్తి చేసుకున్నారు. మోర్లీ అనే గ్రామంపై పోలీసులు దాడిచేసి గ్రామస్థుల నుండి 10వేలు ఎత్తుకెళ్లారు. అవి తునికాకు కాంట్రాక్టర్ల నుండి వసూలుచేసిన బలవంతపు డబ్బు) అని పోలీసులు ప్రజాధనంతో తమ జేబులు నింపుకున్నారు.

దక్షిణ బస్తర్ డివిజన్‌లో 50వేల పెట్టుబడితో ఒక చెరువు నిర్మాణానికి ప్రజలు పూనుకున్నారు. 120 గడప గల ఈ గ్రామంలో పెద్ద సంఖ్యలో ప్రజలు డికెఎంఎస్, కె.ఎ.ఎమ్.ఎస్. నాయకత్వాన కదిలారు. 20 మందితోకూడిన 12 బ్యాచ్‌లను యువతీ యువకులతో కలిసి ఏర్పాటు చేశారు. చెరువు నిర్మాణానికి అవసరమైన సిమెంటు, రాయి స్థానిక పెత్తందార్లను డిమాండ్‌చేసి తెప్పించారు. గతంలో ఎప్పుడో పోసిన కుంటనే మరింత విశాలంచేసి చెరువుగా మలిచారు. ఈ చెరువు మూలంగా కనీసం 30-40 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యంతోపాటు చాలాకాలం పశువులకు కూడా నీటి సదుపాయం ఉంటుంది. ఇక్కడ కూడా శ్రమలో పాల్గొన్నవారు పరికరాలను తమ ఇళ్ల నుండే తెచ్చుకున్నారు. పనుల్లో పాల్గొంటున్న వారికి ముందే తిండిగింజలు సంఘం ద్వారా పంపకమైనాయి. ఆదిలాబాద్ డివిజన్‌లో విప్లవోద్యమంలో భాగంగా చెరువుల నిర్మాణం కూడా ప్రారంభమవుతుందని తెలిసిన వెంటనే ప్రభుత్వము, ఐటిడిఎ (సమగ్ర ఆదివాసీ సంక్షేమ పథకాలు) ప్రజలు అన్నల పక్షం పోకూడదనీ పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి, మన సంఘాలు ఎంచుకున్న గ్రామాలలో ఆ పనులకు పూనుకున్నారు. దీనితో, తమ గ్రామానికి మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు.

గడ్‌చిరోలి డివిజన్‌లో గత మూడేళ్లుగా కొనసాగుతున్న తీవ్ర నిర్బంధం మధ్యనే ప్రజలు సంక్షేమ కార్యక్రమాలకు 'రహస్యంగా' ముందుకొస్తున్నారు. తాము సమిష్టిగా సేకరించుకున్న 2లక్షల 15వేల రూపాయలలో నుండి ఒక గ్రామంలో తాగునీటికి తీవ్ర కొరత వుండడంతో ఆ పని చేపట్టారు. మరో మూడు గ్రామాలలో చెరువులు పోసుకోవాలని ప్రజలు సిద్ధపడినారు. చెరువుల నిర్మాణంలో సరైన స్థలాలు ఎంపిక చేసుకోవాలనీ, పేద ప్రజల భూములకే అధికశాతం ప్రయోజనం కలిగేలా చిన్న చిన్న నిర్మాణాలకు పూనుకోవాలనీ, అవకాశం ఉన్నచోట చెక్‌డ్యాంల నిర్మాణం ఉపయోగకరంగా వుంటుందనీ, చెరువులలో చేపల పెంపకాన్ని కూడా ప్రోత్సహించాలనీ, మరియు నిర్మాణ ఖర్చులు విరాళాలుగా సేకరించాలని, అనుభవరాహిత్యంతో జరిగిన లోపాలను చక్కదిద్దుకోవాలనీ నిర్మాణాలు చేపట్టిన దగ్గర సమీక్షించారు.

ప్రజాసంఘాల నాయకత్వంలో ఆరోగ్యకేంద్రాలు (హెల్త్ యూనిట్) కూడా ఏర్పర్చుకొని, ప్రజల ఆరోగ్య రక్షణకు నడుంకట్టారు. దక్షిణ బస్తర్‌లో ఇప్పటికే 10 గ్రామాలలో ఆరోగ్యకేంద్రాలు ఏర్పర్చారు. సమిష్టి డబ్బుతో కొనితెచ్చిన మందులతో ఏర్పడిన ఈ ఆరోగ్యకేంద్రాలలో ప్రజలు తమకు అవసరమైన మందులకు డబ్బులు చెల్లించాలి. గ్రామాలలో అక్షరజ్ఞానం ఉన్నవారికి 3రోజుల వైద్య తరగతి నిర్వహించి మందులు అప్పగించారు. చదువురాని వారికి మందుల వివరాలు అర్థం చేయించి 'ఒక వ్యక్తి వద్ద ఒకే రకమైన మందు వుంచి, ఏ జబ్బువారు ఆ వ్యక్తి దగ్గరికి వెళ్లాలో ప్రజలకు చెప్పుతున్నారు. ఆపద సమయంలో తమ

ఊరిలో వున్న ఆరోగ్యకేంద్రం తమకెంతో మేలు చేస్తుందనే ఆశలు ప్రజల్లో నెలకొన్నాయి. ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడే విధానాలు ఎన్ని నిర్బంధాలు వచ్చినా శాశ్వతంగా కొనసాగించుకోవాలనే చైతన్యం పెంపొందుతుంది.

ఆదిలాబాద్ డివిజన్‌లో గల ఒక గ్రామంలో ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేశారు. ఆ పక్కనే గల ఆర్ఎంపి డాక్టర్ వారానికి సగం రోజులు వచ్చి ఆ ఆరోగ్యకేంద్రం ద్వారా సేవలందించడానికి ఇచ్ఛికంగా ముందుకు రావడమే గాకుండా ఆ గ్రామంలోని యువకులకు వైద్య విషయాల్లో శిక్షణ కూడా ఇస్తున్నాడు. మరో గ్రామంలో ప్రజలు తమ గ్రామంలో ఆరోగ్యకేంద్రాన్ని నెలకొల్పుకోడానికై ఒక యువకున్ని శిక్షణకు పంపారు. త్వరలోనే మరికొన్ని గ్రామాలలో ఆరోగ్యకేంద్రాలు ఏర్పడే అవకాశాలు వున్నాయి. గడ్చిరోలి డివిజన్‌లో రెండు గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాలు ఏర్పడగా మరో రెండు గ్రామాల్లో ఏర్పర్చుకోడానికి ప్రజలు సిద్ధపడుతున్నారు. అవకాశం ఉన్న గ్రామాల్లో వెంటనే ఆరోగ్యకేంద్రాలు ప్రారంభించాలని అన్ని డివిజన్‌లు నిర్ణయించుకున్నాయి.

కలిమెల ఏరియాలోని 10 గ్రామాల ప్రజలు పంచుటకొన్ని స్థానిక కంట్రాక్టర్లను విత్తనాలు డిమాండ్ చేశారు. కనీం రూాల ఖర్చుతో 2కిలోల చొప్పున 11రకాల విత్తనాలు, 2 క్వింటాళ్ల బంగాళాదుంపలు కంట్రాక్టర్లు అందించారు. వాటిని 12 గ్రామాల ప్రజలు పంపకాలు చేసుకుని విత్తినారు. కాయగూరల వాడకం అంతగా లేకుండా ప్రధానంగా గోంగూర, అడవిలోని ఆకు-అలములపై ఆధారపడే ఆదివాసీ ప్రజానీకం రకరకాల విత్తనాల పంపకంతో చాలా ఉత్సాహం పొందారు. దండకారణ్యంలోని మిగతా కొన్ని డివిజన్‌లలో మామిడి, పనస మరియు కొబ్బరి మొక్కలు ప్రజానీకానికి పంపకం చేయాలని నిర్ణయించుకున్నారు.

ఇలా ఎక్కడికక్కడే వివిధ ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై ప్రజలను ప్రజాసంఘాలు కదిలించే పనికి పూనుకున్నాయి. నిర్బంధం మధ్యనే వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇవే గాకుండా, ఇంకా నిర్దిష్టంగా ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమాలైనా చేపట్టి, ప్రజల జీవనస్థాయి పోరాట మార్గాల ద్వారా మెరుగుపరచే కృషి కొనసాగుతుందని ఆశిద్దాం. □

# నిర్బంధాన్నధిగమించి భూపోరాటంలో పురోగమిస్తున్న ఉత్తర తెలంగాణా రైతాంగం

1990నాటి భూ ఆక్రమణ పోరాటాలలో జిల్లాలో ప్రజలు లక్షలాది ఎకరాలు ఆక్రమించుకుని సాగుచేసారు. '92 నుండి తీవ్రమైన నిర్బంధంలో భూస్వాములు పోలీసుల అండతో తిరిగి ఆ భూములను ఆక్రమించారు. '95లో జూన్‌లో నిషేధం ఎత్తివేసిన తర్వాత రైతాంగం పెద్దఎత్తున కదిలి భూస్వాముల నుండి భూములు స్వాధీనం చేసుకుని, సాగు చేసుకుంటున్నారు. భూస్వాములను లొంగదీసి వారిపై ఆంక్షలు విధిస్తున్నారు.

వరంగల్ జిల్లా హసనపర్తి మండలం, మల్లారెడ్డిపల్లెలో రైతాంగం 5గురితో భూపోరాట కమిటీని ఏర్పర్చుకొని, దాని నాయకత్వాన భూస్వాములు యుగంధర్‌రెడ్డిది నాలుగున్నర ఎకరాలు, వెంకటేశ్వర్లుది రెండున్నర ఎకరాలు, ధనుంజయ్‌ది ఒకటిన్నర ఎకరాలు, వెంకటరామిరెడ్డిది ఏడున్నర ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారు. కుటుంబానికి 10కుంటల చొప్పున ఆ భూమిని 63మంది భూమిలేని పేదలు పంచుకొని పెసర, పత్తి, వరి పంటలువేసి సాగు చేసుకుంటున్నారు.

హసన్‌పర్తి మండల గ్రామమైన సూదన్‌పల్లి ప్రజలు 1995 జూన్‌లో ఊరి భూస్వామి అయిన పెసరు రామచంద్రారెడ్డిని గ్రామంలో పార్టీ నాయకత్వం క్రింద 200మంది సమక్షంలో విచారణ జరిపి రామచంద్రారెడ్డికి 10 ఎకరాలు వుంచి మిగతా భూమిని ప్రజలకు పంచాలని తీర్పు చెప్పారు. దీనితో రామచంద్రారెడ్డి ప్రజలను ప్రాధేయపడగా 4 కండిషన్స్ పెట్టి 20 ఎకరాల భూమి వుంచి 20 ఎకరాలు దున్నుకుంటున్నారు. దీనితోపాటు గ్రామంలోని దేవాదాయ పోరంబోకు భూమిని పార్టీ ఆధ్వర్యంలో ఐదుగురితో ఏర్పాటు చేసుకున్న భూపోరాట కమిటీ నాయకత్వం క్రింద కుటుంబానికి 10కుంటల చొప్పున దాదాపుగా 100మంది పంచుకొని పెసరు, పత్తి, వరి, మొక్కజొన్న పంటలను వేసి సాగుచేసుకుంటున్నారు.

ఆత్మకూరు మండలం దామెర గ్రామంలో వున్నటువంటి శ్రీరాంరెడ్డి, విజయసాగర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చిన్న నర్సింహారెడ్డి, కుంటిగోపాల్‌రెడ్డి, సహోదర్‌రెడ్డి, వీరారెడ్డి, చందుపట్ల నారాయణరెడ్డి, చందుపట్ల నర్సింహారెడ్డి, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ నర్సింహారెడ్డిల భూములను తిరిగి '95 జూన్‌లో ఆపడం జరిగింది. కొంతమంది భూస్వాములు ఆపకపోతే వారి చేలల్లో మేకలను, గొర్లను, బర్లను తోలి మేపినారు. ఇక కొంతమంది భూస్వాముల భూముల్లో వేసిన పత్తిపంటను సంఘ నాయకత్వంలో ప్రజలు పీకేసారు. గ్రామంలో భూస్వాముల భూములను 150 ఎకరాల వరకు స్వాధీనం చేసుకుని ప్రస్తుతం పడావుగా (ఖాళీగా) వుంచారు.

దామెర గ్రామానికి చెందిన పెద్ద నర్సింహారెడ్డికి చెందిన 2ఎకరాల పెరడులో దాదాపు 200మంది ప్రజలు దాడిచేసి కంకులు విరుసుక పోయారు. ఇది వెంకటాపురం గ్రామ సంఘ నాయకత్వంలో ప్రజలు ఒక ప్లాను ప్రకారం రాత్రికి రాత్రే వెళ్లి పెరట్లోని కంకుల్ని విరుచుకొని మూటలు కట్టుకుని తీసుకుపోయారు.

పర్కాల్ మండలం రామక్రిష్ణాపురం (కంఠాత్మకూర్ పోస్టుట్) గ్రామంలో '95 జూన్‌లో పార్టీ నాయకత్వంలో ప్రజలు భూస్వాములను పిలిపించి 4 కండిషన్‌లు పెట్టి, ఆరె రాజిరెడ్డిని 3 ఎకరాలు, ఆరె సాంబయ్యని 3ఎకరాలు, నల్ల జనార్ధన్‌రెడ్డిని 2ఎకరాలు, పెండ్లి మల్లయ్యని 3ఎకరాలు, మొత్తం 10ఎకరాలను 23మంది కలిసి దున్నుకుంటున్నారు. ఈ పొలానికి కావలసిన నారు కొరకు 1ఎకరానికి తూమెడు వడ్లు భూస్వాముల నుండి సమకూర్చుకున్నారు.

వెల్లంపల్లిలో '95 జూన్‌లో పార్టీ నాయకత్వంలో గ్రామ ప్రజలు భూస్వాములను పిలిపించి విచారించి 4కండీషన్స్ పెట్టి భూస్వాములు అయిన గంటరాజిరెడ్డికి 10ఎకరాలు, గంట వర్ధింపారెడ్డికి 10ఎకరాలు, రాపుల లింగారెడ్డికి 10ఎకరాలు, రాపుల రాజిరెడ్డికి 10ఎకరాలు, మంకరిమల్లయ్యకి 10ఎకరాలు, పెసరు పాపిరెడ్డికి 20ఎకరాలు, దేసూరి సమ్మిరెడ్డికి 2ఎకరాలు, దేసూరి దామోదరరెడ్డికి 4ఎకరాలు, నాంతాని అరిరెడ్డికి 92ఎకరాల భూమిని భూస్వాముల ఎద్దను ఉపయోగించుకుని గ్రామ ప్రజలు సమిష్టిగా దున్నుకుంటున్నారు. భూపోరాట కమిటీ ఏర్పరచుకుని పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

ఆత్మకూర్ మండలం, ఊరుగొండ గ్రామంలో '95 జూన్‌లో పార్టీ నాయకత్వంలో ప్రజలు భూస్వాములను పిలిపించి 4 కండీషన్స్ పెట్టి బొల్లి సమ్మిరెడ్డికి 20ఎకరాలు, బాషిక లక్ష్మీకాంతరావుకి 9ఎకరాలు, మల్లాడి మోహనరెడ్డికి 4న్నర ఎకరాలు, మల్లాడి తిరుపతిరెడ్డికి 8ఎకరాలు, మల్లాడి అరిరెడ్డికి 3ఎకరాలు, మల్లాడి వర్ధింపారెడ్డికి 4ఎకరాలను ఐదుగురితో ఏర్పరచుకున్న భూపోరాట కమిటీ నాయకత్వం క్రింద 40మంది సమిష్టిగా దున్నుకుంటున్నారు.

ప్రజలు భూస్వాములకు పెట్టిన షరతులు

1. పోలీసులు ఇన్‌ఫార్మర్స్, సానుభూతిపరులపై పెట్టిన కేసులకు కోర్టుకు పోయినప్పుడు అయిన ఖర్చులు చెల్లించాలి.
2. గ్రామంలోకి పోలీసులు వస్తే మీదే బాధ్యత.
3. మీకు సంబంధించిన ఎలాంటి ఆస్తులను మా అనుమతి లేకుండా అమ్మకూడదు.
4. మేం నిర్ణయించిన భూములకు పట్టా యిప్పించాలి.
5. మేము జెండాలు పాతిన సంవత్సరం నుండి మా అనుమతి లేకుండా అమ్మిన ఎలాంటి ఆస్తులైనా వాపస్ తీసుకోవాలి.

నల్లబెల్లి మండలం, మేడపల్లి గ్రామంలో పెమ్మారి రాంచందర్‌రావుకు చెందిన 13ఎకరాల తరిని, రంగారెడ్డికి చెందిన 15ఎకరాల కుష్కీని పార్టీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకుని పంచుకున్నారు.

ఆత్మకూరు మండలం, పొల్లపల్లి గ్రామభూస్వామి తన భూమిని తను దక్కించుకునేందుకై డబ్బు ఆశ చూపించి సంఘసభ్యులను తొలగించుకునేందుకై ప్రయత్నించాడు. ఇదే సమయంలో తొలగిపోయిన సభ్యున్ని ఆసరా చేసుకుని భూమి అమ్ముకునేందుకు ప్రయత్నించాడు. పలుమార్లు భూస్వామి భూములు ఎవరూ కొనవద్దని వాల్‌పోస్టర్లు వేయడం జరిగింది. అయినా లెక్కచేయకుండా కౌలుకు, పాలుకు ఇచ్చేందుకై ప్రయత్నించాడు. ఎవరూ సాగుచేయలేదు. దానితో భూమి పడావుపడే పరిస్థితి వచ్చింది. దీనితో మామిడితోట 3ఎకరాలు పెట్టినాడు. ఈ విషయం తెలిసిన ప్రజలు ఆగ్రహించి 50మంది కలిసి 10.9.'95నాడు రాత్రి 8గంటలకు తోట మొత్తం పీకేసారు. దీనితోపాటు 2ఎకరాల మొక్కజొన్న పీకేసారు.

పర్కాల్ మండలం వెల్లంపల్లి గ్రామంలో మళ్లీ ఇప్పుడు 1995లో నిషేధం ఎత్తివేసిన తర్వాత భూములు దున్నేందుకై ప్రజలు సిద్ధమయ్యారు. సంఘానికి భూస్వాములు సరెండర్ అయినప్పటికీ మోసగించారు. ఇలా కొంతమంది భూమి ఇచ్చినట్లే ఇచ్చి భూములు అమ్ముకున్నారు. ఈ పనితో ప్రజలు ఆగ్రహించి నేలాని అరిరెడ్డి అమ్మిన భూమిలోని 1ఎకరా పత్తి 29.9.'95 రాత్రి యువజనులు, ప్రజలు కలిసి పీకేసారు.

కరీంనగర్ జిల్లా మంథని ఏరియా మల్హర్ మండలం (తాడిచర్ల)లోని రుద్రారం గ్రామంలో రెక్కాడితేగాని అప్పులు తీరుటలేని నిరుపేద ప్రజలు 1990లో పార్టీ పిలుపునందుకొని రుద్రారం దొరలవారు ప్రాజెక్టు (చెరువు) క్రిందవున్న భూమిని పదును చేయడానికి 70 మంది ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు మహిళలు పురుషులు పొలాన్ని చెక్కను, తుంపలను నరికి, వాటిని ఎండిన తర్వాత అగ్గి పెట్టి, దాదాపు 60ఎకరాలను పదును చేసుకొని దానికి ప్రాజెక్ట్ నుండి పిల్ల కాలువ ఏర్పాటు చేసుకున్నారు. గత 4సంవత్సరాల నుండి మంచి పంటలు పండించుకున్నారు. ఈ పోరాటాన్ని చూసి ఉత్తేజితులై, అదే గ్రామానికి చెందిన యాదవులు, చాకలి, పద్మశాలి, కాపు కులాలకు చెందిన దాదాపు 150మంది ప్రజలు 1995లో అదే ప్రాజెక్ట్ నుండి వెలువడిన వాగు క్రింద వున్న 50ఎకరాలకు పైగా భూమిలో చెట్లు, తుంపలు నరికి భూమిని పదును చేసారు. ఇది చూసిన అటవీ అధికారులు ఆక్షేపణలు పెట్టడంతో వారిని ఎదిరించి పోరాడి భూమును కాపాడుకున్నారు.

జీతాలు, కూలిరేట్లు పెంచుకున్న జీతగాళ్లు

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట, తొగర్రాయి, మహ్మదాపురంలలో 9మంది 10వేలకు వెంకటాపురంలో 8మంది 9వేల వరకు పాలేర్ల సంఘం నాయకత్వంలో ఐక్యంగా పూండి జీతాల పెంపుదలను సాధించుకున్నారు. వర్ధన్నపేట మండలం కమ్మపెల్లిలో 9వేల నుండి 11,500వరకు, దాసరిపల్లి, చంద్రాయపల్లి, ధానోకపేట గ్రామాలలో 9వేల నుండి 12వేల రూపాయల వరకు జీతాల పెంపుదలను సాధించుకున్నారు. ఆత్మకూరు మండలం, ఒగలాపూర్, ఊరుగొండ, పరకాలంలో పాలేర్ల సంఘాలు పెట్టుకుని ఆర్‌వైఎల్ నాయకత్వంలో ఉగాదికి పదిరోజుల ముందే జీతాలు పెరిగే వరకు జీతం ఉండకూడదని నిర్ణయించుకున్నారు. దానికి పాలేర్లు కట్టుబడివుండి, జీతాలు పెరిగే వరకు ఎవ్వరూ పనిలోకి వెళ్లలేదు. దానితోపాటుగా కొన్ని గ్రామాలలో పనిగంటలు నిర్ణయించడం జరిగింది. ఉదయం 6గంటల నుండి సాయంకాలం 6గంటల వరకు మాత్రమే పనిలోకి వెళ్లడం, సంవత్సరానికి 24 సెలవు దినాలు, యజమాని పనిలో ప్రమాదం జరిగిన పూర్తి నష్టపరిహారం భరించాలని మొదలగు డిమాండ్లతో పోరాడి విజయం సాధించుకున్నారు.

ఒగలాపూర్‌లో మన పార్టీ నాయకత్వంలో సంఘటితమైన పాలేర్లు ఒకసారి 1500రూపాయల వరకు జీతాలు పెంచుకుని సంవత్సరానికి 10,500వరకు సాధించుకున్నారు. పులుకుర్తి, తక్కెళ్లపాడు, పెద్దపురం, లక్ష్మీపేట, వెంకటాపురం, కోగిల్వాయి, ధర్మన్నపేట గ్రామాలలో ఆర్‌వైఎల్ నాయకత్వంలో జీతాలు పెంచుకోగా, ఇంకా కొన్ని గ్రామాలలో మన పోస్టర్ల ప్రభావంతో (పొల్లపల్లి, రామపురం,

కామారం, నీరుకుళ్ళ, పెంచకలపేట, కేశవపురం మొదలగు గ్రామాలలో) పెంచుకున్నారు. శాయంపేట మండలం, గట్లకనిపర్తిలో పాలేర్లు జీతాల పెంపుదలకై సమ్మె చేస్తుండగా భూస్వాముల ప్రోద్బలంతో పోలీసులు వచ్చి పాలేర్ల సంఘాన్ని, సమ్మెను విచ్ఛిన్నం చేయ ప్రయత్నించారు. పాలేర్లందరూ ఎదురు తిరగడంతో పోలీసులు, పాలేర్లకు వెయ్యి రూపాయలు పెంచండని చెప్పి తోకముడిచివెళ్లారు.

సింగారంలో ఆర్.వై.ఎల్. నాయకత్వంలో 1000 రూపాయల (5,500 రూ॥ నుండి 6,700) వరకు పెంచుకున్నారు. పర్కాల మండలంలో ధర్మారం, కంఠాత్మకూర్, లక్ష్మీపురం, రంగాపురం, వెంకటేశ్వరపల్లి, వాళ్లపురం, వెల్లపల్లి, ముస్త్యాలపల్లి, చౌటపర్తి, నడికూడ మొదలగు గ్రామాలలో ఆర్.వై.ఎల్. నాయకత్వంలో పోరాడి జీతాలు పెంచుకున్నారు. చిట్యాల ఏరియా పెద్దంపల్లి, సంగెంపల్లిలలో 25 మంది పాలేర్లు 56 రోజులు సమ్మెచేసి 8వేల రూ॥ జీతం, పురుగుమందు కొట్టినప్పుడు ఏమైనా అయితే ఖర్చు భరించేలా, ఒక డ్రెస్, చెప్పులు, కల్లుతో 24 రోజులు సెలవు దినాలు సాధించుకున్నారు. టేకుమెట్ల, వెల్లంపల్లి, అంకిరెడ్డిపల్లి, గుమ్మడవెల్లి, గర్మిళ్లపెల్లి, ఎంటాలపల్లి గ్రామాలలో ఇదేవిధంగా చేసుకున్నారు. మహిళలు పోరాడి రోజుకూలీ 25రూ॥ వరకు పెంచుకున్నారు.

మొగుళ్లపల్లి మండలంలోని మెట్లపల్లి గ్రామంలో 9వేల రూ॥కు పెంచుకున్నారు. అజినపల్లి, దుబ్యాల, కోమటిపల్లి, ముల్కలపల్లి, పిడిసిల్ల, పొత్తుగల్లు గ్రామాలలో 8వేల రూ॥కు జీతం పెంచుకున్నారు. ఈ సంవత్సరంలో అదనంగా 500రూ॥ పెంచుకుని విజయం సాధించారు. రేగొండ మండలంలోని భాగిర్తిపేట, కాకర్లపల్లి, గుడెపల్లి, రేపాక, కోడవాటంచలలో 7,500రూ॥ల నుండి ఈ సంవత్సరం మన సంఘనాయకత్వంలో 8,500రూ॥కు పెంచుకున్నారు. భూపాల్‌పల్లి మండలంలో నేరేడుపల్లి, నదినెపల్లి, గొర్లవీడు, కాశింపల్లిలలో 5వేల నుండి 5500రూ॥కు పెంచుకున్నారు. మైపల్లి, గాంధ్రపల్లి, కొంపెల్లి గ్రామాలలో 8వేల నుండి 9వేల రూ॥కు పెంచుకున్నారు. ఈ మండలంలో మహిళలు 20రూ॥లు వున్న రోజుకూలీని 25రూ॥కు పెంచుకున్నారు.

ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఏరియాలో వివిధ గ్రామాలలో రెండురోజులు సమ్మెచేసి కూలీలు పెంచుకున్నారు. దన్నూర్ గ్రామంలో కూలీలకు మద్దత్తుగా పాలేర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు. స్త్రీలు 15రూ॥ నుండి 20రూ॥కు సాధించుకున్నారు. ఇతర పనులకు గడ్డికోతకు, చెరకు కలుపుకు, స్ప్రే చేయడానికి మహిళలు నీళ్లు తీసుకవస్తే 25రూ॥ చెల్లిస్తారు. పురుషులకు పాత కూలీ 30రూ॥లు కాగా సాధించుకున్న కూలి 35-40రూ॥లు. పొచ్చెర స్త్రీలకు పాతకూలీ 15రూ॥ కాగా సాధించుకున్న కూలీ 25రూపాయలు. పురుషులు సాధించుకున్న కూలీ 50రూపాయలు. ఈ కూలీల పోరాట ప్రభావంతో బోథ్ ఏరియాలోని గిరిజన, గిరిజనేతర గ్రామాలలో (కౌఠ, కుమారి, మర్లపెల్లి, సొనాల, ఇవి గిరిజనేతర గ్రామాలు) కొత్తపల్లి, నక్కలవాడ, మర్లపెల్లి ఈ గ్రామాలలో కూడా కూలీలు సంఘటితంగా పోరాడి అధిక జీతాలరేట్లు సాధించుకున్నారు. సారంగపూర్ మండల గ్రామాలైన కౌట్ల, ధనిన జామ్ గ్రామాలలో మహిళల కూలీ 25రూ॥, పురుషులకు 40రూ॥ సాధించుకున్నారు.□

## వరకట్న హత్యలను ప్రతిఘటిస్తున్న ప్రజలు

వరంగల్ జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో చల్లగరుగుల రాజమౌళి (తిరుమలగిరి) తన భార్య సౌందర్యను, అడిగిన కట్నానికంటే ఎక్కువ తీసుకురమ్మని లేకుంటే రెండవ పెళ్లి చేసుకుని తనకు నచ్చినంత కట్నం తెచ్చుకుంటానని కాబట్టి నీవు విడాకులు ఇవ్వు లేకుంటే నేను అడిగిన కట్నం తీసుకురమ్మని, తను, తన తల్లితండ్రి తీవ్రంగా చిత్రహింసలు పెట్టేవారు. సౌందర్య కొన్నిమార్లు ఇంటికి (రాయపర్తి)పోయి తల్లిదండ్రులకు చెప్పుకుని కట్నం ఇవ్వమని అడిగినా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇవ్వలేకపోయారు. సౌందర్య ఇదే సమాధానం తన భర్త, అత్తమామలకు చెప్పగా, 25.5.'95నాడు భర్త, అత్తమామలు తీవ్ర చిత్రహింసలకు గురిచేసి మర్మాంగంలో కట్టెలుపెట్టి తిప్పి, పాలిండ్లను బ్లేడ్‌తో గాయపరిచి చనిపోయిన సౌందర్య నోట్లో మందుపోసి 'కడుపునొప్పి భరించలేక మందుతాగి చనిపోయిం'దని ప్రచారం చేసారు. సౌందర్య శవాన్ని చూసిన తిరుమలగిరి గ్రామస్థులు చిత్రహింసలలో సౌందర్య చనిపోయిందని నిర్ధారించుకుని సౌందర్య భర్త, అత్తమామలను పట్టుకునేందుకై తిరగగా అప్పటికే వారు ఆ గ్రామం నుండి పారిపోయి పోలీస్‌స్టేషన్‌లో సరెండర్ అయినారు. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు చల్లగరుగుల రాజమౌళికి చెందిన 4ఎకరాల మొక్కజొన్న పైరును 80మంది గ్రామప్రజలు కలిసి ధ్వంసం చేసి గ్రామంలోకి రాకుండా గ్రామబహిష్కరణ చేశారు. ఆ తర్వాత సమాజంలో వరకట్న హత్యలు ఎందుకు జరుగుతున్నాయో వివరిస్తూ గ్రామంలో ప్రచారం చేశారు.


వెలువడినవి ! చదవండి !!

రెక్కవిప్పిన రివల్యూషన్

(ఫ్రాన్స్‌లో 1968నాటి విప్లవగాథ)

అనువాదం : శ్రీశ్రీ

సువర్ణముఖి కథలు

(కథాసంకలనం)

విరసం ప్రచురణలు

# నిర్బంధాలను ఛేదిస్తూ జూలై 28వ గ్రామగ్రామాన అమరవీరుల సంస్మరణదినం

నిర్బంధాన్ని ఎదిరిస్తూ, పార్టీ రహస్యంగా [illegible] కర్తవ్యాలు [illegible] సాహిత్యాన్ని ప్రదర్శించి [illegible] అమరవీరులను తలచుకుంటూ వారి ఆశయసాధనకోసం "మేము నడిచిన బాటలో, [illegible] గావిస్తాము, మీ ఆశయం సాధిస్తాము" [illegible] ప్రతిజ్ఞలు [illegible] అమరవీరుల [illegible], ప్రదర్శనలు [illegible] నిర్వహించారు.

[illegible] గ్రామంలో 35 మంది [illegible] రాత్రి 7 గంటలకు [illegible] 9 గంటల నుండి [illegible] [illegible] ఎర్రజెండాను ఎగురవేసి, [illegible] 10 మంది 40 మంది [illegible] ప్రదర్శనలు [illegible] ఎర్రజెండాలను [illegible] గ్రామంలో [illegible] ఎగురవేశారు.

[illegible] దాదాపు వంద గ్రామాలో అమరవీరుల సంస్మరణ సభలు జరిగాయి. కొన్ని గ్రామాలో ఎర్రజెండాలను ఎగురవేశారు, కొన్ని గ్రామాల్లో ప్రదర్శనలు, సభలు జరిగాయి. [illegible] మడపల్లి గ్రామంలో కట్టిన స్థూపాలను కూల్చివేశారు. [illegible] గ్రామంలో ఎత్తిన ఎర్రజెండాను పీకి కాల్చివేశారు. [illegible] 36 మంది కలిసి అమరుల సంస్మరణదినాన్ని జూలై 28వ జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు 50 గ్రామాలలో అమరవీరుల [illegible] మరియు "అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం", "అమరుల త్యాగం వృధాకాదు", "[illegible]" అనే నినాదాలు రాసిన బ్యానర్‌లను కట్టారు. మొత్తం ఏరియాలో 300 మీటర్ల ఎర్రగుడ్డను ఏరియా [illegible] వినియోగించారు. బ్యానర్లతోపాటు ప్రతి గ్రామంలో అమరవీరుల పోస్టర్లు, కరపత్రాలను పంచారు.

[illegible] మండలంలోని వీరుకుల్లలో అమరుడు నాగారం [illegible] 16 మీటర్ల వెడల్పు గల బ్యానర్‌ను కట్టారు. పెద్దాపురం గ్రామంలో 12 బ్యానర్లు కట్టారు. అదే విధంగా ముస్త్యాలపల్లి, [illegible], [illegible], రామిరెడ్డి, [illegible], కోగిల్వాయి, పులుకుర్తి, వనగొండ, మలక్‌పేట, [illegible], పోచారం, పెద్దకొండ, ఓబ్లాపూర్, ఆత్మకూర్‌టౌన్, ధర్మన్నపేట, [illegible], వొక్కలపల్లి, పెంచలపేట, కేశవపురం, పడమటపల్లి, నర్సక్కపల్లి, [illegible], మల్లారెడ్డిపల్లి, రామకృష్ణాపురం, [illegible], [illegible]టౌన్, పులిగిల్ల, అల్లీపల్లి, రంగాపురం, ఇ.సి.పేట గ్రామాలలో మూడు చొప్పున బ్యానర్లను కట్టారు. అమరవీరుల పోస్టర్లు వేసి కరపత్రాలు పంచారు.

అదే విధంగా కొండ మండలంలోని తిర్మలగిరి, జగ్గయ్యపల్లి, మల్లాన్‌పూర్, గోరెకొత్తపల్లి, విజాంపల్లి, కొత్తపల్లి, ములుగు మండలంలోని రామచంద్రాపురం, మల్లంపల్లి, వెంకటాపూర్, కంతియాల; రాయంపేట మండలంలోని గొనుపల్లి, రాజపల్లి గ్రామాల్లో మూడు చొప్పున గ్రామగ్రామాన బ్యానర్లను కట్టారు. ప్రతి గ్రామంలోనూ అమరుల పోస్టర్లు వేసి కరపత్రాలు పంచారు.

**సింగరేణిలో జూలై 28 అమరవీరుల సంస్మరణదినం**

అమరవీరుల సంస్మరణదినాన్ని పాటిస్తామని తెలుసుకున్న పోలీసులు ఈ కార్యక్రమాన్ని సాగనీయకూడదని గస్తీ పెంచి కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ముమ్మరంచేశారు, అనేకచోట్ల మాటుగాశారు. అయినప్పటికీ కార్మికులు తెగువతో మందమర్రిలో 12 బ్యానర్లు, నాలుగు జెండాలను, 30 పోస్టర్లను వేసి ప్రచారంచేశారు. ఎక్కడికక్కడ సంఘాలు శ్రద్ధాంజలి ఘటించారు. అయితే అమరవీరుల సంస్మరణ పద్ధతి తెలియకపోయినప్పటికీ సంస్మరణను కొనసాగించాలనే ఉత్సాహంతో కొందరు బొట్లు పెట్టుకుని కొబ్బరికాయలు కొట్టి ఐదు నిముషాలు మౌనం పాటించారు. అలాగే బెల్లంపల్లిలో 25 బ్యానర్లు కట్టి, కొన్ని ఎర్రజెండాలు ఎగురవేసి విస్తృతంగా ప్రచారంచేశారు. మాదారం సెంటర్లో కూడా తాండూర్, మాదారం, గోలేటి టౌన్‌షిప్‌లలో బ్యానర్లుకట్టి, పోస్టర్లు వేసి, కరపత్రాలు పంచి విస్తృతమైన ప్రచారంచేశారు. ఈ సందర్భంగా మందమర్రిలో పోలీసులు పదిమందిని అనుమానించి నలుగురిని తీవ్రంగా కొట్టి అక్రమకేసులు బనాయించి ఎమ్మార్వోముందు హాజరుపర్చి వదిలివేశారు. మిగతా ఆరుగురిని, మనతో సంబంధాలున్నాయనే నెపంతో లంచాలు తీసుకుని వదిలిపెట్టారు. అలాగే బెల్లంపల్లి, మాదారం సెంటర్లలో కూడా పోలీసులు తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగిస్తున్నప్పటికీ జూలై 28వ మాదారం ఏరియాకు చెందిన ముగ్గురు సి.ఐ.టి.యు. బాధ్యులు, ఇద్దరు మహిళా పి.ఆర్.లతో పాటు ఇద్దరు మహిళా సానుభూతిపరులు, ఒక కార్మికుడు, మరో యువకుడు కలిసి రహస్యంగా ఒక యింటిలో సమావేశమై అమరవీరుల సంస్మరణదినాన్ని జరుపుకున్నారు. ఏరియా బాధ్యుడు ఆ సభకు అధ్యక్షత వహించగా, ఎర్రజెండాను ఎగురవేసి అమరవీరులకు పేరుపేరునా శ్రద్ధాంజలి ఘటించి జోహార్లర్పించారు.

నూతన ప్రజాతంత్ర విప్లవంలో అసువులుబాసిన అమరుల చరిత్రను, వారి పోరాటపటిమను, వారి త్యాగాలను గురించి, నేటి పరిస్థితుల్లో మన కర్తవ్యాలను గురించి మాట్లాడి అమరవీరుల ఆశయసాధనకోసం తుదకంటా పోరాడుతామని శపథంచేసి సభను ముగించారు. □

# విజయవంతంగా ముగిసిన ఎస్.టి.ఎఫ్.డి. రైతుకూలీ సంఘం ప్రథమ మహాసభ

డిసెంబరు 11నుండి 13వ తేదీవరకు (రెండున్నర రోజులు) కామ్రేడ్ కాసన్న అనసూయ్య నగర్‌లోని కాటాపూర్ అమరుల హాలులో ఉత్తర తెలంగాణా అటవీ డివిజన్ ఆర్.పి.ఎస్. ప్రథమ మహాసభ జరిగింది. 27మంది ప్రతినిధులు హాజరయ్యారు. అందులో మహిళా ప్రతినిధి ఒకరు. దమ్మక్కపేట అమరవీరుల మిలిటరీ గ్రౌండ్‌లో 11వ ఉదయం 8గంటలకు సభకు వచ్చిన ప్రతినిధులు మరియు ప్రొటెక్షన్ కామ్రేడ్స్ అందరూ ఇద్దరిద్దరుగా రైఫిల్స్ ఆర్.పి.ఎస్. బ్యానర్, ఎర్రజెండాలతో ఊరేగింపు జరిపారు. అనంతరం ఏ.పి.ఆర్.పి.ఎస్. కార్యదర్శి (ప్రతినిధి) ఎర్రజెండాను ఆవిష్కరించగా మూడు వరుసలుగా జెండా ముందు బారులుతీరి సుత్తికొడవలి గీతం పాడారు. తర్వాత జెండా ప్రాముఖ్యత గురించి ఆవిష్కరించిన కామ్రేడ్ ఉపన్యాసం ఇచ్చాడు. ఆ తరువాత డి.వి.పి.ఎమ్. అమరులకు జోహార్లు ప్రతిపాదించి రెండు నిమిషాలు మౌనం తర్వాత అమరుల త్యాగాల గురించి మాట్లాడాడు. ఈ రైతుకూలీ మహాసభ జరుపుకోవడం వెనకాల అనేకమంది అమరుల కృషి, త్యాగం ఉందని మాట్లాడారు. మధ్య మధ్య సాయుధ జననాట్యమండలి కామ్రేడ్స్ పాటలు పాడారు. చివరగా డివిసి కార్యదర్శి ప్రతినిధుల నుద్దేశించి ప్రారంభోపన్యాసం చేస్తూ 'పీపుల్స్‌వార్ హింసా విధానాల మూలంగా ప్రజల మద్దత్తు కోల్పోయి ఏకాకి అయింది, మిలిటెంట్స్ వ్యవస్థ విచ్ఛిన్నమైంది' అని పాలక వర్గాలు ప్రచారం చేస్తూ వంకలు గుద్దుకుంటున్న సమయంలో అనేక త్యాగాలు చేస్తూ, క్రూర నిర్బంధాల మధ్య మన సంఘాలు పనిచేస్తూ ఇక్కడ ప్రజాసంఘాలుగా మరింత సమన్వయంతో పనిచేయడానికి కాన్ఫరెన్సులు జరుపుకోగలుగుతున్నాయంటే మన పెరుగుతున్న బలానికి ఇంకా వేరే ఉదాహరణ అవసరం లేదని, ఈ ప్రాంతంలో ఇప్పటికయినా ఒక విప్లవకర ప్రజాసంఘాన్ని జిల్లా స్థాయిలో నిర్మించుకోవడం ఇక్కడి రైతుకూలీలకు ఆశాకిరణం అని మాట్లాడాడు. భారతదేశం స్వభావం - రైతుకూలీలు 80శాతం కలిగిన ఈ దేశంలో రైతుకూలీలని ఈ పోరాటంలో రాటుదేల్చడానికి ప్రజాసంఘాలు రిహార్సల్స్‌గా ఎలా పనిచేయాలో, గత రివిజనిస్టు ప్రజాసంఘాల పాత్రను విమర్శిస్తూ వాటికి మన ప్రజాసంఘానికి స్పష్టమైన తేడా వుందని ఈ ప్రాంత ప్రజానీకానికి మరింత నిరూపించేలా సీరియస్‌గా కృషి చేయాలని అందుకై కాన్ఫరెన్స్‌లో శ్రద్ధగా నేర్చుకుని మరింత పట్టుదలతో పనిచేయాలని మాట్లాడి ముగించగా ప్రతినిధులు కామ్రేడ్ బాబూరావు ద్వారం గుండా కాటాపూర్ అమరవీరుల కాన్ఫరెన్స్ హాలులోకి వెళ్లారు.

ముగ్గురితో కూడిన అధ్యక్షవర్గాన్ని డివిసి ప్రతిపాదించగా ప్రతినిధులు ఆమోదించారు. ఎజెండాలో 1. అమరవీరులకు జోహార్లు తీర్మానం; 2. జైలు కామ్రేడ్స్‌కు విప్లవ జేజేలు తీర్మానం; 3. రైతుకూలీ సంఘం ప్రణాళిక-నిబంధనావళి; 4. రైతాంగ సమస్యలపై డివిజన్ వ్యాప్త కార్యక్రమం; 5. పర్యావరణ పరిరక్షణకై కార్యక్రమం; 6. నూతన కమిటీ ఎన్నిక వున్నాయి.

మొత్తంగా రెండున్నర రోజులలో పై అంశాలన్నీ వివరంగా చర్చించుకుని, ఐదుగురితో కూడిన డివిజన్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అందులో కిరణ్, రమేష్, సత్తెన్న, సమ్మన్న, జగన్‌లు వుండగా కార్యదర్శిగా కిరణ్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఆ తర్వాత నూతన కమిటీ సభ్యులు మొత్తం ప్రతినిధుల ముందు ప్రతిజ్ఞచేయగా, మొత్తం ప్రతినిధులు కూడా కాన్ఫరెన్స్ కర్తవ్యాలు అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. చివరగా కాన్ఫరెన్స్ తీసుకున్న నినాదాలతో ఊరేగింపుచేసి గ్రౌండ్‌లో సమావేశం అయ్యారు. ముగింపు ఉపన్యాసం మరో డి.వి.పి.ఎమ్. మాట్లాడి మొత్తం కార్యక్రమాలు ముగింపుగా అంతర్జాతీయగీతం పాడి జెండాను అవనతం చేశారు.

గ్రామగ్రామాన అడవి రక్షణ కమిటీలు నిర్మించడం, పర్యావరణ సమస్యపై డివిజన్ వ్యాప్త ప్రచారం చేపట్టాలి. అధిక పోడు నరికివేతను కంట్రోల్ చేయడం కోసం డిసెంబరు నుండే ప్రచార క్యాంపెయిన్ చేపట్టాలి అని, రైతాంగ సమస్యలపై డివిజన్ వ్యాపిత కార్యక్రమం (గిట్టుబాటు ధరలు, కరెంట్‌కోత మొదలగునవి) జనవరి నుండి ప్రచారం చేస్తూ మండల కేంద్రాల్లో ధర్నాలు చేయించాలి, దానికై యువఫ్ కమిటీలు నిర్మించాలి అని తీర్మానాలు చేశారు. ❑

## అమరవీరుల కుటుంబాల మధ్య జూలై 28 అమరవీరుల సంస్మరణసభ

1995 జూలై 28న పర్కాల్ ఏరియాలోని దళం, అమరవీరుల తల్లిదండ్రుల భార్యాపిల్లల మధ్య ఒక రహస్య స్థలంలో అమరవీరుల సంస్మరణసభ జరిగింది. దళం ప్లాను ప్రకారం అమరవీరుల తల్లిదండ్రులను, భార్యాపిల్లలను జూలై 27 రాత్రి పిలిపించారు. జూలై 28 ఉదయం, అమరవీరుల సంస్మరణసభను జూలై 28నవే ఎందుకు జరుపుకుంటాం అనే విషయాన్ని కమాండర్ వివరంగా చెప్పాడు. మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు అమరుడు కామ్రేడ్ ప్రభాకర్ (వంగాపహాడ్) తండ్రి జెండా ఆవిష్కరించి ''నేను దొరలకు వెట్టి జేసిన, నా కొడుకు దొరలకు వెట్టి చేయకుండా దొరతనానికి వ్యతిరేకంగా యుద్ధంచేసి ప్రజలకోరకు ప్రాణాలర్పించాడు. అటువంటి కొడుకును కన్నందుకు నేను గర్వపడుతున్నాను'' అని కండ్ల నీళ్ళు తిరుగుతుండగా చెమ్మగిల్లిన కండ్లతో ప్రసంగించాడు.

భర్తను కోల్పోయిన భార్యలు, కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులు, తన కొడుకు, తన భర్త వున్నప్పుడు తనకు చెప్పిన రాజకీయాలను, వారు నాయకత్వం వహించి నడిపిన పోరాటాలను, పట్టుకొనిపోయి కాల్చిచంపిన పరిస్థితిని గురించి చెప్తూ ఒక్కసారిగా ఏడ్చారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబాల నుండి 29 మంది పాల్గొన్నారు. తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ''వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు'', ''బావయ్యో ఒక్కసారి చూసిపోవ'', ''దొంగ ఎదురుకాల్పులల్లో కనుమూసిన కూనలారా'', ''పగిడేరు ఒగ్గుకథలోని కొంతభాగం'', ''మీ త్యాగం ఉన్నతమైనది'', మరికొన్ని అమరవీరులను కీర్తిస్తూ పాటలు పాడారు.